ఫిబ్రవరి - 2020

DECCAN LAND, HYDERABAD

90

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక






- తెలంగాణ కుంభమేళ - మేడారం జాతర
- రాతి చిత్రాలతో గుండ్లపోచంపల్లి ఆవాసాలు
- సినీ కీర్తిపతాకం ఆదూర్ గోపాలకృష్ణన్
- బాలల్లో చైతన్యం - పెద్దల బాధ్యత







Artist:

**AFZA TAMKANAT**

తన వైవిధ్యమైన పేయింటింగ్‌తో రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నారు **ఆఫ్జా తమ్కనాథ్.** ప్రతిభకు సవాళ్లు అడ్డుకావు. కృషితోనే అత్యుత్తమంగా రాణించవచ్చని నిరూపిస్తున్నారు. జవహార్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ నుండి ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన ఆఫ్జా వాస్తవికతకు అద్దంపట్టేలా సృజనాత్మకమైన చిత్రాలు గీస్తూ అబ్బురపరుస్తున్నారు. తన విశేషమైన ప్రతిభతో దేశ, విదేశాల్లో వందకుపైగా చిత్ర ప్రదర్శనలు చేసి పలువురి మన్ననలు పొందారు.


























## రంగుల హరివిల్లు..

కృషి, పట్టుదల, ఆసక్తి ఉంటే చిత్రకళలో రాణించవచ్చని నిరూపిస్తున్నారు ప్రముఖ ఆర్టిస్టు అప్జా తమ్మనాథ్. కష్టపడటమేకాదు తాను ఎంచుకున్న రంగాన్ని ప్రేమించాలని, అప్పుడే విజయవంతం అవుతామంటున్నారు. సాహిత్య, చిత్రకళా కుటుంబంలో జన్మించిన హైదరాబాద్ నగరానికి చెందిన కళాకారిణి అప్జా తమ్మనాథ్ తన బాల్యంలోనే అందమైన పేయింటింగ్ రంగం పట్ల ఆకర్షితు లయ్యారు. కళ తన ఆలోచనలను వ్యక్తపరిచే ఒక సాధనం లాంటిది అంటారు.

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com









## స్ఫూర్తినింపిన ఆర్టిస్టు శివరామాచారి వ్యాసం

'ఆ శిల్పాలు నాట్యం చేస్తాయి' అంటూ ఆర్టిస్టు శివరామాచారి గురించి రాసిన వ్యాసం చాలా అద్భుతంగా ఉంది. జీవంలేని వస్తువులు సైతం మాట్లాడుకుంటాయని చాలా చక్కగా వర్ణించినతీరు అమోఘం. టెర్రకోటా మట్టితో వివిధ రూపాలను ఆర్టిస్టు మలిచినతీరును చక్కగా విశ్లేషించారు. విభిన్నమైన శిల్పి చెక్కిన సౌందర్యం మానవులను మంత్ర ముగ్దుల్ని చేస్తుంది. ప్రాణంలేని వస్తువులు ప్రాణం పోసుకొని మాట్లాడుకునేలా శివరామాచారి చేతిలో రూపుదిద్దుకున్నాయి. మట్టి, ఫైబర్, రాగి, చెక్క, ఇనుములాంటి పదార్థాలకు జీవంపోసి మనుషులతో అనుబంధాన్ని పెంపొందించేలా చేస్తున్నారు. స్ఫూర్తినింపేలా ఆర్టిస్టు గురించి రాసిన విధానం చాలా బాగుంది. అందుకు కృతజ్ఞతలు.

– కె.రాము, వికారాబాద్

❖ ❖ ❖

## ఉమ్మడి ఏపీలో తెలంగాణ సాహిత్యం కరవు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ సాహిత్యానికి పెద్దపీట వేయకపోవడం వల్ల సాహిత్యకళాభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి హైదరాబాద్‌లో వరుసగా ప్రతి సంవత్సరం బుక్‌ఫెయిర్ నిర్వహించడం గర్వకారణం. 2020లో జరిగిన 33వ జాతీయ పుస్తక మహోత్సవంలో 330 స్టాళ్లలో 60 లక్షలకుపైగా పుస్తకాలు కొలువుదీరాయి. దేశవ్యాప్తంగా ఢిల్లీ, కలకత్తా, రాజస్థాన్ బుక్ ఫెయిర్‌లకు ఏమాత్రం తీసిపోని విధంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ నిర్వహించడం తెలంగాణకే గర్వకారణం. పది రోజులపాటు జరిగిన బుక్ ఫెయిర్‌లో పలువురు రాసిన నూతన పుస్తకాలు, బాలల పుస్తకాలు, సాహిత్య పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు ఇలాంటి ఎన్నో ఈ వేదికల మీద ఆవిష్కరింపబడ్డాయి. ఇలాంటి పుస్తక మహోత్సవాలు ప్రజలను చైతన్యపరుస్తాయి. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– పి.సచిన్, కరీంనగర్

❖ ❖ ❖

## ప్రయోగాత్మక చిత్రాల దర్శకుడు అరవింద్

కేరళలో జన్మించిన అరవిందన్ యాక్సిడెంటల్‌గా చిత్రసీమలోకి ప్రవేశించి అనతికాలంలోనే గొప్ప దర్శకుడిగా ఎదిగారు. ప్రతిభ గల కుటుంబంలో జన్మించినా బాల్యం నుండే తన చుట్టూ జరుగుతున్న పరిణామాలకు ప్రభావితుడై చదువుతోపాటు హిందూస్తాన్, కర్నాటక సంగీతాలను అభ్యసించారు. ఎలాంటి సాంకేతిక అనుభవం లేకుండా మొక్కవోని దీక్షతో తన మిత్రులతో కలిసి 1973లో చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు. అలా తన తొలి సినిమా ఉత్తరాయణం 1974లో పూర్తి చేశారు. ఐక్యత, అనంతరం విచ్ఛిన్నమై స్వార్థం, మోసాలు ప్రబలిపోయి నిరుద్యోగిగా, పేదరికం, ఆకలి, అస్థిరతలకు దారితీసిన పరిస్థితులకు దర్పణం పట్టాడు. అంటూ రాసిన వ్యాసం చాలా అకట్టుకుంది. ధన్యవాదాలు.

– జి.రాకేష్, ఆదిలాబాద్

## త్వరలో మీ ముందుకు 'బాలచెలిమి'

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాస పత్రికను రంగులతో 52 పేజీలు ఫిబ్రవరి మాసం నుండి అందచేస్తామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. బాలలలో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన, వినోదాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగే 'బాల చెలిమి'ని త్వరలో మీ ముందుకు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం నిర్వహిస్తున్న **'బాలచెలిమి-ముచ్చట్ల'**లో ప్రసిద్ధ రచయితలు, మేధావులు, ఆర్టిస్ట్‌లు, ఫోటోగ్రాఫర్‌లు, పబ్లిషర్స్, ప్రింటర్స్ పాల్గొని తమ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. బాల రచయితల నుండి బాలల కథలు, గేయాలు, కవితలు, స్కెచ్‌లు, వ్యాసాలు, పొడుపుకథలు, సామెతలు, జాతీయాలు బాలచెలిమిలో ప్రచురణ కోసం ఆహ్వానిస్తున్నాం. బాలచెలిమిని www.balachelimi.com వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు.

–చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

బాల చెలిమి

**మీ రచనలు మాకు పంపవలసిన చిరునామా:**

ఎడిటర్, "బాలచెలిమి", చంద్రం, 3-6-712/2, స్ట్రీట్ నెం:12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, తెలంగాణ.

Mobile: 9030626288

E-Mail: desk.chelimi@gmail.com

Website: www.balachelimi.com

### ఆన్‌లైన్ ద్వారా దక్కన్ ల్యాండ్ చందా చెల్లింపు

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరాలు**

Name : DECCAN LAND,
Kotak Account No: 7111218829
Bank: KOTAK MAHINDRA BANK
IFSC Code: KKBK0007463
Branch Code : 007463

ISSN 2581-3188

దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 8 సంచిక : 6 పేజీలు : 68

ఫిబ్రవరి - 2020

సంపాదకులు

మణికొండ వేదకుమార్

9848044713

editordeccan@gmail.com

సహాయ సంపాదకులు

కట్టా ప్రభాకర్

జుగాష్ విలి

సర్క్యులేషన్

హెచ్. మోహన్‌లాల్

వాణిజ్య ప్రకటనలు

సయ్యద్ ఖైజర్ భాష

9030626288

ఫొటోగ్రాఫర్

టి.స్వామి

8374995555

కవర్‌పేజీ ఫొటో

అప్జా తమ్మనాథ్

చిత్రాలు

కూరెళ్ల శ్రీనివాస్

layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA

Mobile: 9030626288 Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సాహిత్యం విభాగంలో సలహాలు, సూచనలు అందించిన డా॥ ఎస్. రఘుకు మా కృతజ్ఞతలు.

## విషయసూచిక

# లోపలి పేజీల్లో...




జమాలుద్దీన్ ........ డా॥ దేవరాజు మహారాజు ........ 6

మేడారం సమ్మక్క-సారక్క జాతర (ఎడిటోరియల్) ........ ఎం. వేదకుమార్ ........ 7

చరిత్రలో వెలుగు చూడని చీకటి కోణాలు ........ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 9

కల్లోల కలల కాలం ........ పరవస్తు లోకేశ్వర్ ........ 11

పర్యావరణం - శాస్త్రం - నైతికత - తాత్విక దృక్పథాలు ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 15

రాతి చిత్రాలతో గుండ్లపోచంపల్లి ఆవాసాలు ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 19

సమాజ అభివృద్ధిలో సాహిత్యం కీలకపాత్ర ........ కట్టా ప్రభాకర్ ........ 23

పదాలకొండ దేవరకొండ బిక్షపతి పాట ........ అంబటి వేకువ ........ 25

మిల్లెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ ........ డాక్టర్ ముత్తన్న ........ 27

బాలల్లో చైతన్యం పెంపొందించే బాధ్యత పెద్దలదే.. ........ రామకృష్ణ కాంపాటి ........ 29

ఘంటా మొగిలయ్య ప్రస్థానం ........ జుగాష్‌విలి ........ 33

రంగుల హరివిల్లు అప్జా తమ్మనాథ్ ........ అనిల్ ........ 35

సినిమాకు కీర్తి పతాకం అదూర్ గోపాలకృష్ణన్ ........ హెచ్. రమేష్‌బాబు ........ 37

దేశ భవిష్యత్‌పై ఆందోళన అక్కరలేదు ........ కట్టా ప్రభాకర్ ........ 41

అప్పుడప్పుడు - 11 ........ బి. నరసింగరావు ........ 44

సోమనాథ కళాపీఠం పురస్కార ప్రదానోత్సవం ........ డాక్టర్ రాపోలు సత్యనారాయణ ........ 47

దోస్తులు చెప్పిన కథల్లో జగదీశ్వర్ రచనా పరిపక్వత ........ డా॥ బెల్లి యాదయ్య ........ 49

పీఠికలు భిన్నభావాల పేటికలు ........ డా॥ వెలుదండ నిత్యానందరావు ........ 53

పాద ముద్రలు ........ రామా చంద్రమౌళి ........ 57

నవభరితం 'గోర్‌జీవన్' చిత్రం ........ ఆచార్య సూర్యాధనంజయ్ ........ 61

అతని కవిత్వం ఒక నిరలంకారపద్యం ........ రాపోలు సీతారామరాజు ........ 63

పుస్తక పరిచయం ........ దక్కన్ న్యూస్ ........ 65


'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక సాహిత్య విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# జమాలుద్దీన్

**1970-80** దశకం వరకు మన హైదరాబాదు నగరంలో సయీద్ జమాలుద్దీన్ పేరు బాగా వినిపిస్తూ ఉండేది. ఆయన చెప్పిన హాస్యోక్తులు ఆయన ఆశువుగా చెప్పిన షాయరీలు, చురకల్లాంటి చెణుకులూ తరచూ వినిపిస్తూ ఉండేవి. నిజానికి ఈయన ఎవరు? నిజాం రాజు ఆస్థానంలో విదూషకుడా? కాదు. ఆయన ఆస్థానంలో అలాంటివారు ఎవరూలేరు. కానీ జమాలుద్దీన్ అనధికారంగా అంతటివాడే.

అక్బర్ ఆస్థానంలో బీర్‌బల్‌లాగా, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామలింగ కవిలాగా, మన హైదరాబాద్ సంస్థానాధీశుడు లేదు. కానీ, ఆయన దగ్గరే చిరు ఉద్యోగిగా చేరి, క్రమక్రమంగా 'బాగే-ఎ-ఆమ్' పబ్లిక్ గార్డెన్స్‌కు సూపరింటెండ్‌గా పదోన్నతి సాధించాడు.

తెనాలి రామలింగడి గురించి, బీర్‌బల్ గురించి ఎలాగైతే కథలు, పిట్టకథలు వ్యాప్తిలోకి వచ్చాయో జమాలుద్దీన్ పేరుతో అలాంటివే ఎన్నో వ్యాప్తిలోకి వచ్చాయి. ఈ తరంవారికి అవి అభూత కల్పనలని అనిపిస్తాయి. 'జమాలుద్దీన్' అనేది ఎవరో సృష్టించిన ఒక పాత్ర అని కూడా అనుకున్నారు. కానీ, జమాలుద్దీన్ నిజాం కాలంలో రంగ ప్రవేశం చేసి, తనదైన తరహాలో పాత్ర పోషణ చేసి ఈ జీవిత నాటకరంగం నుంచి నిష్క్రమించిన ఒక సజీవ విదూషకుడు! నిజాంరాజు ఆయనను ఆస్థాన విదూషకుడిగా నియమించకపోయినా, ప్రజల దృష్టిలో ఆయన హైదరాబాదు సంస్థానానికి విదూషకుడయ్యాడు.

> **దక్కను పీఠభూమిలో హైదరాబాదుకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, ప్రత్యేకమైన వంటకాలవలె జమాలుద్దీన్ సర్వర్ దండా లాంటి వాళ్లు కూడా హైదరాబాదు సంస్కృతిలో భాగమైపోయారు. నిజాం కుటుంబానికి అతి సన్నిహితుడైన జమాలుద్దీన్ టిప్పు సుల్తాన్ వంశంలోనివాడు.**

దక్కను పీఠభూమిలో హైదరాబాదుకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, ప్రత్యేకమైన వంటకాలవలె జమాలుద్దీన్ సర్వర్ దండా లాంటి వాళ్లు కూడా హైదరాబాదు సంస్కృతిలో భాగమైపోయారు. నిజాం కుటుంబానికి అతి సన్నిహితుడైన జమాలుద్దీన్ టిప్పు సుల్తాన్ వంశంలోనివాడు.

1881లో మద్రాసులో అంటే చెన్నైలో పుట్టాడు. విద్యాభ్యాసం కోసం విద్యార్థిగా హైదరాబాదు చేరాడు. నాటి ప్రముఖ విద్యావేత్త, సరోజినీ నాయుడి తండ్రిగారైన అఘోరనాథ ఛటోపాధ్యాయ సంరక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు. మెట్రిక్యులేషన్ పాసయ్యేవరకు సరోజినీ నాయుడి కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి తిరిగాడు. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ నిజాం కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఆబిడ్స్ రోడ్డులోని 'గోల్డెన్ త్రెషోల్డ్' భవనం వారి నివాసంగా ఉండేది. కవులకు కళాకారులకు, సామాజిక కార్యకర్తలకు అది కేంద్రంగా విలసిల్లింది. సరోజినీ నాయుడితో పాటు ఆమె సోదరుడు హరీంద్రనాథ్ చటోపాధ్యాయ వీరి వయసువాడే! ఇక్కడ - అనుకోకుండా ఇంటా బయటా లభించిన సాహిత్య కళారంగాల వాతావరణం జమాలుద్దీన్ ఎదుగుదలకు దోహదం చేసింది.

అలాగే, ఒక మంచి అవకాశం కూడా అనుకోకుండానే చేజిక్కింది. జమాలుద్దీన్‌కు నవాబ్ కాజిమ్‌యార్ జంగ్ సోదరి గౌసియా బేగంతో 'నిఖా' జరిగింది. నవాబ్ కాజిమ్‌యార్ జంగ్ అంటే మాటలా? నిజాం ప్రభుత్వంలో ఒక ముఖ్యమైన శాఖ నిర్వహిస్తున్న 'నజీర్'! నవాబుల కుటుంబం. అందులో మంత్రిగారి చెల్లెలుతో పెళ్ళి. ఇంకేముంది? జమాలుద్దీన్ స్థాయి ఒక్కసారిగా పెరిగిపోయింది.

ఇకనేం నిజాం ప్రభువుతోనూ, అతని కుటుంబ సభ్యులతోనూ పరిచయం కావడం, సాన్నిహిత్యం పెరగడం ఇక సహజమేకదా? ఆ విధంగా జమాలుద్దీన్‌కు సన్నిహితుడయ్యాడు. ఉద్యానవన శాఖలో చిన్న ఉద్యోగిగా చేరి, అనతి కాలంలో త్వరితగతిని పబ్లిక్ గార్డెన్స్‌కు అంటే 'బాగ్-ఎ-ఆమ్'కు సూపరిటెండ్ అయ్యాడు. పబ్లిక్ గార్డెన్స్‌లో 'జపనీస్ గార్డెన్' అభివృద్ధి చేయడానికి నిజాం, జమాలుద్దీన్‌ను జపాన్ పంపించాడు.

జమాలుద్దీన్ జపాన్ వెళ్ళి అక్కడి తోటల పెంపకం, నిర్వహణ అంతా అధ్యయనం చేశాడు. హైదరాబాదుకు తిరిగొచ్చాక వెంటనే కార్యరంగంలోకి దూకకుండా కాలయాపన చేశాడు. ఈయన బద్ధకాన్ని గమనించి నిజాం ప్రభువే వెంటపడి 'ఎంత డబ్బు కావాలో తీసుకో, జపాన్ గార్డెన్ అభివృద్ధి చెయ్యి' అని ఒత్తిడి చేయసాగాడు. లక్ష రూపాయలు, సంవత్సరం గడువూ కావాలన్నాడు జమాలుద్దీన్. నిజాం మంజూర్ చేశాడు.

కాలం గడిచింది. లక్ష ఖర్చయ్యింది. కానీ, "జపాన్ గార్డెన్"లో ఒక్క మొక్కా పెంచలేదు. జపనీస్ పద్ధతిలో ఉద్యానవనం తయారై ఉంటుందనుకుని ఎంతో ఉబలాటంతో నిజాం రాజు తనిఖీకి వచ్చాడు. 'పని ఎంతవరకు వచ్చింది' అని అడిగాడు.

"జపాన్ గార్డెన్ అంతా సిద్ధమైంది ప్రభూ! కానీ, ఒక్కటే తక్కువ! జపాన్ నుండి అగ్ని పర్వతాలు దిగుమతి చేసుకోవాల్సి ఉంది!" అని నివేదించుకున్నాడు -జమాలుద్దీన్, పిసినిగొట్టు, కోపిష్టి అయిన నిజాం ప్రభువు మరి ఆ సమయంలో ఏ గుణాన ఉన్నాడో గానీ... చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు. గార్డెన్‌కు మరికొంత డబ్బు మంజూరు చేశాడు. ఆ తర్వాత జమాలుద్దీన్ తన బద్ధకం వదిలించుకుని, రాత్రింబవళ్ళు జపనీయ తోట పెంపకం మీద మనసు పెట్టాడు. చివరకు జపనీస్

(మిగతా 8వ పేజీలో)

# తెలంగాణ కుంభమేళ.. మేడారం సమ్మక్క-సారక్క జాతర




ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగ మేడారం సమ్మక-సారక్క జాతర. తెలంగాణ కుంభమేళగా పిలుచుకునే ఈ విశిష్ట జాతర ప్రకృతి రమణీయతకు, పర్యావరణ సమతౌల్యానికి అద్దం పడుతుంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నెలరోజులపాటు ఈ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ప్రకృతి అంటే ప్రాణమిచ్చే ఆదివాసీలు వాళ్లే పూజారులై ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ జాతరను ఎంతో వైవిధ్యంగా,మరెంతో అపురూపంగా తమ ఆచార సంప్రదాయాల ప్రకారం జరుపుకుంటారు. సమ్మక్క - సారక్క జాతరకు సుమారు 900 వందల ఏళ్ల గొప్ప చరిత్ర ఉందని చరిత్రకారులు చెప్తుంటారు. కాలం మారుతున్నా ఆదివాసీల సంప్రదాయాలు చెక్కుచెదరకుండా అత్యుత్తమంగా కొనసాగుతుండటం గర్వించదగ్గ విషయం. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల నుండి కోట్లాది మంది భిన్న కులాలు, విభిన్న మతాల ప్రజలు జాతరకు రావడం వారి సహజమైన సామూహిక స్వభావానికి, ఐక్యతాభావనకు గుర్తు. ప్రకృతితో మమేకమైన ఆదివాసీలు పర్యావరణ పరిరక్షణకు ఏమాత్రం అవరోధాలు కలగకుండా ఎంతో నిష్ఠతతో ఈ ఉత్సవాన్ని మహోన్నతంగా నిర్వహిస్తున్నారు.

తెలంగాణ వైభవాన్ని చాటిచెప్పే వాటిలో గొల్కొండ బోనాలు, బతుకమ్మ ఉత్సవాలు, జంగుబాయి జాతర, నాగోబా జాతర, కొమరవెల్లి జాతరలకు ప్రముఖస్థానం ఉంది. అంతకుమించి మేడారం సమ్మక్క - సారక్క జాతరకు మరింత విశిష్టత కలదు. తెలంగాణ సంస్కృతి ఎంత గొప్పదో ఆచార సంప్రదాయాలు కూడా అంతే గొప్పవి. ఇలాంటివి భవిష్యత్ తరాలకు అందించాలి. ఆదివాసీల సంస్కృతి అంతరించిపోకుండా కలకాలం కాపాడుకోవాలి. మన వారసత్వ సంపదగా భావించి పరిరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైన ఉంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తెలంగాణలో మరుగుపడిన అనేక చారిత్రకాంశాలను ప్రత్యేక శ్రద్ధతో వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తుంది. తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి గుర్తింపు తెచ్చే దిశలో పనిచేస్తుంది. ఇప్పటికే గొల్కొండ కోటతోపాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రామప్ప ఆలయం కూడా యునెస్కో గుర్తింపు కోసం ప్రతిపాదించబడి ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మరియు కాకతీయ హెరిటేజ్ ట్రస్టు విశేషమైన కృషి చేసి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి చారిత్రక రామప్ప ఆలయాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించాలని యునెస్కోకు ప్రతిపాదించాయి. యునెస్కో బృందం రామప్ప కట్టడాలను పరిశీలించడంతోపాటు సంబంధిత పరిశోధక అధికారులను ప్యారిస్‌కు పిలిపించి వారితో చర్చలు జరిపింది. ఈ సంవత్సరానికిగాను రామప్ప కట్టడాలకు యునెస్కో గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.

ఇదేక్రమంలో అంతర్జాతీయ చారిత్రక పరిశోధకులచే గుర్తింపబడిన ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క- సారక్క జాతరను కూడా యూనెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించేరీతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదనలు పంపేలా ముమ్మర ప్రయత్నాలు ప్రారంభం కావాలి. అధికారికంగా డాక్యుమెంటేషన్ చేసి పంపాలి. ఇంటాంజిబుల్ హెరిటేజ్ (లివింగ్ హెరిటేజ్)లో భాగంగా యునెస్కో గుర్తింపు పొందడానికి సత్వర ప్రయత్నాలు జరిపిన పక్షంలో కచ్చితంగా సమ్మక్క-సారక్క జాతరకు ప్రపంచస్థాయి గుర్తింపు లభించే అవకాశం ఉంది.

దీనికి ప్రజలు, సామాజికవేత్తలు, నిష్ణాతులు భాగస్వాములై ప్రభుత్వానికి ప్రతిపాదించి, చేయూతనిచ్చి గుర్తింపు సాధించే దిశగా కృషి జరగాలి.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

శైలిలో అద్భుతమైన గార్డెన్ అభివృద్ధి చేశాడు. ఇటీవలి కాలం వరకు పబ్లిక్ గార్డెన్‌లో జపనీస్ విభాగం ప్రపంచ విహారయాత్రికులను ఎంతగానో అలరించేది.

తర్వాత కాలంలో పబ్లిక్ గార్డెన్స్‌లో లలిత కళాతోరణం, తెలుగు విశ్వవిద్యాలయ భవన సముదాయం రావడంతో జమాలుద్దీన్ అభివృద్ధి పరిచిన జపనీస్ గార్డెన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. బెరార్ యువరాజు, నిజాం యువరాజు మొజంజా మొదలైనవారంతా జమాలుద్దీన్‌తో స్నేహంగా ఉండేవారు. అప్పటికి మోటారు వాహనాలు చాలా తక్కువగా ఉండేవి. గుర్రాలు వాడుకలో ఉండేవి. గుర్రాలమీద స్వారి చేస్తూ ఈ మిత్రులంతా 'బాగె-ఎ-ఆమ్'కు వచ్చి జమాలుద్దీన్‌తో బాతాఖానీ వేసి, గరమ్ చాయ్ తాగి సరదాగా గడుపుతూ ఉండేవారు.

1940లో జమాలుద్దీన్ రెడ్ హిల్స్‌లో ఒక చిన్న భవనం కట్టుకున్నాడు. అది కూడా జపనీస్ శైలిలో ఎంతో అందంగా తయారైంది. దాని పేరు 'ఫెర్న్‌విల్లా'. అయితే జమాలుద్దీన్ ఆ భవనంలో ఎక్కువకాలం గడపలేకపోయాడు. కారణం, 1942లో ఆయన అకాల మరణం పొందాడు. కుటుంబంలోని వారంతా అనాధలయ్యారు.

జమాలుద్దీన్ కొడుకు ఇంటిలోని వస్తువులన్నీ అమ్ముతున్నట్లు పత్రికా ప్రకటన ఇచ్చాడు. అది తెలిసి నిజాం ప్రభువు హుటా హుటిన 'ఫెర్న్‌విల్లా'కు వెళ్ళాడు. అక్కడి ఆస్థి విలువ ఎంతుందో అధికారులను లెక్కగట్ట మన్నాడు. వాళ్ళు అటూ ఇటూ కూడీ, తీసివేసి చివరకు ఆ ఆస్థి విలువ రెండు లక్షలని తేల్చారు. నిజాం భృకుటి ముడిచాడు. భవనం, ఫర్నీచర్, ఇతర వస్తువులు అన్నీ కలిపి లక్షకు బేరమాడాడు. ప్రభువే ఆ మాట అంటే కాదు, ఇంకా ఎక్కువ ఇచ్చి కొంటామని ఎవరుమాత్రం ముందుకొస్తారూ? ఎంతటి ప్రభువైనా నిజాం పిసినారితరం జగద్విఖ్యాతమైంది. 'ద టీల్స్ ఆఫ్ ఇండియన్ ప్రిన్సెస్' అనే ప్రసిద్ధ గ్రంథంలో కూడా నిజాం పిసినారితనం నమోదై ఉంది.

జమాలుద్దీన్ బతికి ఉన్నంతకాలం నిజాంను అపహాస్యం చేస్తుండేవాడు. జమాలుద్దీన్ 'ఫెర్న్‌విల్లా' కట్టుకున్న తొలి రోజుల్లో యువరాజు మొజంజా ఫెర్నావిల్లాకు వచ్చి 'ఇదేమిటి పావురాల గూళ్ళలాగ ఇంత ఇరుకుగా ఉందీ ఇల్లూ- ఇందులో ఎట్లా ఉంటారూ?' అని హేళన చేశాడు. 'తన స్థాయికి, తన సంపాదనకు తగినట్టుగా తను కట్టుకున్నానని జమాలుద్దీన్ సవినయంగా మనవి చేసుకున్నాడు. విచిత్రమేమంటే పోలీస్ యాక్షన్ తర్వాత యువరాజు తన అధికారం నివాసం 'హిల్ ఫోర్ట్ ప్యాలెస్' వదిలి, తన తండ్రి నిజాం బేరమాడి కొన్న ఈ 'ఫెర్న్‌విల్లా'లోనే ఇరవైయేళ్ళు నివసించాడు. అలా జమాలుద్దీన్ కట్టిన పావురాల గూడులో యువరాజుకు జీవితం వెళ్ళబోయక తప్పిందికాదు.

జమాలుద్దీన్ పేర ప్రచారంలో ఉన్న కొన్ని హాస్యోక్తులు చూద్దాం. జమాలుద్దీన్ టోపీ ముందు భాగాన్ని వెనక్కి పెట్టుకుని తిరిగేవాడట. అదేమంటే 'ఏమో నిజాం ప్రభువు గబుక్కున వెనకనుండి వస్తే ఎట్లా? అందుకే ఈ ఏర్పాటు'- అని అనేవాడట. తెలివి తక్కువ నౌకరు ఇంట్లో మేకు కొడుతున్నాడట. మేకు తలభాగం గోడకు పెట్టి, మొనతేలిన భాగాన్ని బాదుతున్నాడట. అది గమనించిన జమాలుద్దీన్ 'ఆ మేకు ఆ గోడది కాదురా! అదిగో ఎదురుగా ఉన్న గోడది! కదిలించకుండా అలాగే తీసుకెళ్ళి ఎదురుగా కొట్టు దిగుతుంది' అని చెప్పాడట. ఒక్కో గోడకు ఒక్కోరకం మేకులుంటాయా - అని నౌకరు ఆశ్చర్యపోయ్యాడట. ఒకసారి కారు డ్రైవర్ సడన్‌గా బ్రేకు వేశాడట. ఏమిటి? ఏమైంది? అని అడిగాడు జమాలుద్దీన్. 'ఎదురుగా గొయ్యి ఉందిసార్. చూస్కోలే. మాఫ్‌కర్‌నా' అన్నాడట డ్రైవర్.

"గొయ్యి ఉన్నా నుయ్యి ఉన్నా హారన్ మోగిస్తూ వెళ్ళిపోవాలేగాని, బ్రేకులు కొట్టి కార్లో ఉన్నవాళ్ళ ప్రాణం తీస్తావా?" అని సీరియస్‌గా జోక్ చేశాడట జమాలుద్దీన్.

చదువుకోసం కూతురిని జమాలుద్దీన్ ఢిల్లీకి పంపించాడు. అక్కడ ఆమె 'పింగ్‌పాంగ్' ఆట నేర్చుకుని తల్లిదండ్రులకు "నేను పింగ్‌పాంగ్‌ను వదిలి ఉండలేకపోతున్నా"నని ఉత్తరం రాసింది.

దానికి జమాలుద్దీన్ 'అదిగో చూశావా నీ కూతురు ఎవరో చైనా వాడి వలలో పడింది' అని భార్యను బెదిరించాడట. జమాలుద్దీన్ భార్య గౌసియా బేగం తెలివి తక్కువది కాదు. 'పింగ్‌పాంగ్'- అంటే టేబుల్ టెన్నిస్ అని భర్తకు తెలియ జెప్పింది. నవాబుల కుటుంబంలోంచి వచ్చిన గౌసియా బేగం స్త్రీవిద్యకు ముఖ్యంగా హైదరాబాదు సంస్థానంలో మాంటిస్సోరి విద్యావిధానానికి నాంది పలికిన నారీమణి! ఇక్కడి నుండి పట్టభద్రులైన తొలితరం మహిళల్లో ఆమె ఒకరు. ఆ రోజుల్లోనే ఇంగ్లాండ్ వెళ్ళి మాంటిస్సోరి విద్యావిధానాన్ని అధ్యయనం చేసొచ్చి ఇక్కడ ప్రవేశపెట్టిన ఘనత ఆమెదే! భర్త జమాలుద్దీన్ అటు ఉద్యానవన శాఖను పరిపుష్టి గావిస్తే, ఇటు ఈమె విద్యారంగాన్ని సుసంపన్నం చేశారు. హైదరాబాదు చరిత్ర పుటల్లో ఈ దంపతుల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

**-డా॥ దేవరాజు మహారాజు**

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన **'తెలంగాణ తేజోమూర్తులు'** నుంచి)*

ద

## పాఠకులు, రచయితలకు శుభవార్త

## దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, వర్ధమాన రచయితలు, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింపజేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

# చరిత్రలో వెలుగు చూడని చీకటి కోణాలు

(గత సంచిక తరువాయి)

సలాబత్ జంగ్ అతని సైన్యం గుల్బర్గాలో మకాం వేసిన సమయంలో బుస్సీ అనారోగ్యం పాలయిండు. వైద్యుల సలహా మేరకు సేదదీరడం కోసం మచిలీపట్నంకు వెళ్లిండు. అయితే ఫ్రెంచ్ సైన్యం అంతా నిజాం యిలాకాలోనే ఉండింది. ఆ తర్వాత కొద్దిరోజులకు సలాబత్ జంగ్ హైదరాబాద్ చేరుకుండు. ఈ దశలో దివాన్ లష్కర్‌ఖాన్ ఫ్రెంచ్ వారికి వ్యతిరేకంగా పనిజేసిండు. మొదటి నిజాం ప్రభుత్వంలో సర్వసైన్యాధ్యక్షుడిగా పనిజేసిన లష్కర్‌ఖాన్ ఫ్రెంచ్ వారి ప్రాబల్యం పెరిగిపోయిన తర్వాత తనకు అంతగా గౌరవం దక్కడం లేదని భావించాడు. బుస్సీ హైదరాబాద్‌లో లేని సమయంలో ఒక ఎత్తుగడ ప్రకారం ఫ్రెంచ్ మిలిటరీ అధికారులను జిల్లాల్లో రెవిన్యూ వసూళ్ళు రాబట్టడానికి పంపించాడు. అప్పటికే చాలా ప్రాంతాల్లో ఖజానాకు బకాయిలున్నాయి. ఫ్రెంచ్ సైన్యాధికారులు తమ జీత భత్యాలను మినహాయించుకొని వసూలు చేసిన సొమ్ముని ఖజానాలో జమచేయాలని లష్కర్‌ఖాన్ ఉత్తర్వులు జారిచేసిండు. ఇట్లా ఫ్రెంచ్ అధికారులు రెవిన్యూ వసూళ్ళకు వెళ్ళినట్లయితే ప్రజల్లో వారిపై వ్యతిరేకత పెరుగుతుందనేది ఎత్తుగడ. దాంతో వారిని హైదరాబాద్ నుంచి బయటికి పంపించడం సులువైతుందని అంచనా! మరోవైపు రహస్యంగా ఫ్రెంచ్ సైనికులకు జీతాలు చెల్లించకుండా ఆపించిండు. అంతేకాదు ఫ్రెంచ్ సైనికుల సేవలను రద్దు చేస్తూ సలాబత్ జంగ్ చేత ఉత్తర్వులు జారీ చేయించాడు. ఇదంతా తెలుసుకున్న బుస్సీ పూర్తిగా కోలుకోక ముందే హైదరాబాద్‌కు చేరుకొని తమకు రావాల్సిన బకాయిల కోసం చార్మినార్‌ని ముట్టడించాడు. తమ అధీనంలోకి తెచ్చుకుండు. చివరికి సలాబత్ జంగ్ బుస్సీని సగౌరవంగా ఆహ్వానించి అతని పూర్వపు హోదా కల్పించడంతో సమస్య సద్దుమణిగింది. ఇది 1753లో జరిగింది. దీని గురించి గతంలో ఇదే కాలమ్‌లో రాయడమయింది. ఈ సంఘటన తర్వాత కూడా ఫ్రెంచ్ సైన్యం నిజామ్ ప్రభుత్వానికి అండగా నిలిచింది. డూప్లెక్స్ తర్వాత కౌంట్ లాల్లీ ఫ్రెంచ్ కంపెనీకి నేతృత్వం వహించాడు.


బుస్సి

1760లో అహ్మద్‌నగర్ ఖిలేదారు మరాఠాలకు అమ్ముడుపోయి ఖిలాను వారికి దారదత్తం చేసిండు. అయితే అప్పటికే నిజాం ప్రభుత్వం సైనికులకు బకాయిలుండడంతో వారెవ్వరూ యుద్ధానికి సన్నద్ధంగా లేరు. మీదు మిక్కిలి అప్పుడే నిర్మల్ దేశ్‌ముఖ్‌తో కూడా పోరాటం జరగడంతో బలగం బలహీనమయింది. వీటన్నింటి దృష్ట్యా ఎన్నో ఏండ్లుగా తమ అధీనంలో ఉన్నటువంటి అహ్మద్‌నగర్ కోటను కోల్పోవాల్సి వచ్చింది. (బ్రిగ్స్- ది నిజామ్ మొదటి సంపుటం). అయినప్పటికీ ఓటమి ఒప్పుకోకుండా తన తమ్ములతో సఖ్యత చేసుకున్నడు. ఖైదునుంచి విడుదల చేసిండు. వారిని వెంట బెట్టుకొని యుద్ధానికి సన్నద్ధమయిండు. అహ్మద్‌నగర్ కోటను స్వాధీనం చేసుకునేందుకు సలాబత్ జంగ్, అతని సోదరుడు నిజామ్ అలీలు సర్వ సైన్యంతో అహ్మద్‌నగర్‌కు బయలుదేరినప్పటికీ మధ్యలోనే మరాఠాలు యుద్ధతంత్రంలో భాగంగా రెచ్చగొట్టే పోరాటాలు చేసింద్రు. మరాఠాలు వేసిన పాచికలో పావులై ఎక్కువ ఆయుధాలను నిజామ్‌లు ఖర్చుబెట్టింద్రు. ఆఖరికి ఈ యుద్ధంలో మరాఠాలకు బీజాపూర్ తదితర కోటలను సమర్పించుకొని ప్రాణహాని లేకుండా నిజామ్ అలీ దౌత్యంతో సలాబత్ బతికి బయటపడ్డారు. ఇట్లా హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న సమయంలో అదును చూసుకొని 1762 జూలై ఎనిమిదిన (ఇది 1761 జూలై 18 అని కొంతమంది రాసింద్రు) తన అన్న సలాబత్ జంగ్‌ని నిజామ్ అలీ బందీగా చేసి బీదర్ కోటలో ఉంచుతాడు. దీంతో తెలంగాణ/హైదరాబాద్ రాజ్యంలో సుబేదార్‌ల పాలన ముగిసి మళ్ళీ నిజామ్‌ల పాలన ప్రారంభమయిందని చెప్పవచ్చు. సలాబత్ జంగ్ బీదర్ కోటలోనే 16 సెప్టెంబర్ 1763లో చనిపోయిండు. దీంతో శవాన్ని హైదరాబాద్ తీసుకొచ్చి మక్కామసీదులో ఖననం చేసింద్రు. (బీదర్‌లోనే ఖననం చేసినట్లు మరో దగ్గర రాసి ఉంది).

మొదటి అసఫ్జాహీ రాజు నిజాముల్ ముల్క్ మొదటి ప్రధాన మంత్రి హిందువు. 1723లో నిజామ్ దివాన్‌గా రాజా దీనానాథ్ నియమితుడయిండు. (బ్రిగ్స్ – నిజామ్ మొదటి సంపుటం) దీనానాథ్ తర్వాత నిజామ్‌ల దగ్గర దివాన్‌గా అత్యున్నత పదవిలో పనిచేసింది తెలుగువాడయిన రామదాసు పండిట్. ఈయన శ్రీకాకుళంకు చెందిన వాడు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే ఫ్రెంచ్‌వారి ప్రాపకంతో శ్రీకాకుళంలో ఫౌజుదార్‌గా ఉన్నటువంటి రామదాసు పండిట్ తన కుతంత్రాలు, కుట్రలతో పేష్కర్ బక్షీగా, ఆ తర్వాత దివాన్‌గా ఎదిగిండు. నాసిర్‌జంగ్ సైన్యానికి జీతాల చెల్లింపులన్నీ ఈతని నేతృత్వంలోనే జరిగేవి. ఇతను నాసిర్‌జంగ్ దగ్గర ఉద్యోగిగా ఉన్నప్పటికీ లోపాయకారిగా ఫ్రెంచ్ వారికి సహాయం చేసేవాడు. శ్రీకాకుళం జిల్లాలో ఫౌజ్‌దారుగా ఉన్నటువంటి ఈ నల్ల బాపనాయిన రామదాసు పండిట్ అక్కడి ఫ్రెంచ్ వారి ప్రాపకంతో నిజామ్ కొలువులో చేరిండు. నాసిర్ జంగ్ దగ్గర సైన్యానికి డబ్బులు చెల్లించే పేష్కారుగా ఉన్నాడు. ఆయన పనిచేసేది నాసిర్‌జంగ్ దగ్గరే అయినప్పటికీ ఆయన బద్ధ వ్యతిరేకులైన ఫ్రెంచ్ వారికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ వారి ప్రాపకం పొందుతూ ఉండేవాడు. అయితే డూప్లెక్స్ సూచనల మేరకు కర్నూలు నవాబు హిమ్మత్‌ఖాన్ ద్వారా నాసిర్‌జంగ్‌ని కుట్రపూరితంగా చంపిస్తాడు. (బ్రిగ్స్ – ది నిజామ్ మొదటి సంపుటం). బుస్సీ సూచనల మేరకు తర్వాతి కాలంలో ముజఫర్ జంగ్ రామదాసు పండిట్‌కు 'రాజా రఘునాథ్ దాస్' బిరుదు ఇవ్వడమే గాకుండా ప్రధానమంత్రి హోదాను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారి చేసిండు.

ప్రధానమంత్రి హోదాలో ఉంటూ కూడా ముజఫ్ఫర్ గుట్లన్నీ ప్రత్యర్థులకు ఎరుక పరిచింది రామదాసు పండిట్.

రామదాసు పండిట్ ఫ్రెంచ్ వారి ప్రాపకంలోకి రావడానికి అబ్దుర్ రెహ్మాన్ అనే అతను కారణం. అబ్దుర్ రెహ్మాన్ తండ్రి కొన్ని అప్పులు చేసి, కప్పం కట్టకుండా తప్పించుకు పోవడంతో అతనిపై నిజాం సైన్యం నిఘా వేసింది. ఈ దశలో ఆయన శిక్షనుంచి తప్పించుకునేందుకు పాండిచ్చేరిలో ఫ్రెంచ్‌వారి ఆశ్రయం తీసుకున్నడు. తండ్రితోపాటు చిన్నతనం నుంచి పాండిచ్చేరిలోనే పెరిగిన అబ్దుర్ రెహ్మాన్ ఫ్రెంచ్ నేర్చుకోవడమే గాకుండా వారికి దుబాసీగా, రాయబారిగా, నమ్మకస్తుడైన వ్యక్తిగా పనిచేసిండు. ఈ అబ్దుల్ రెహ్మాన్ తాను శ్రీకాకుళం ఫౌజుదారుగా ఉన్నప్పుడు రామదాసు పండిట్ చాకచక్యాన్ని, నేర్పుని గ్రహించి అతన్ని ఫ్రెంచ్‌వారికి పరిచయం చేసిండు. (జేమ్స్ డఫ్ గ్రాంట్ – ది మరాఠాస్). ఇట్లా తన స్కిల్స్‌తో రామదాసు పండిట్ ప్రధానమంత్రి పదవి వరకూ ఎదిగిండు.

ఆ తర్వాత ముజఫ్ఫర్ జంగ్ హత్య తర్వాత అంతకు ముందటి పదవిలోనే రామదాసు పండిట్ కొనసాగిండు. ముజఫర్ జంగ్ అవసరం తీరిన తర్వాత దూప్లెక్స్ అతన్ని వదిలించుకోవాలను కున్నాడు. దాంతో మళ్ళీ ఆయన రామదాసు పండిట్‌ని ఉపయోగించు కున్నాడు. ఈ దశలో రామదాసు పండిట్ కడప నవాబును హత్యకు పురమాయిస్తాడు. కడప జిల్లా లక్కిరెడ్డి పల్లెలో మకాం చేసిన సైన్య శిబిరంలో కడప నవాబు ఈటెను విసిరి ముజఫ్ఫర్ జంగ్‌ని హతమారుస్తాడు అయితే అతను చనిపోయిన విషయం సైనికులకు తెలిస్తే గొడవ జరుగుతుందనే ఉద్దేశ్యంతో అతడు కేవలం గాయపడ్డాడు అని భ్రమిప జేస్తు కుర్చీలో కూర్చుండబెట్టి క్యాంప్‌కు రామదాసు తానే దగ్గరుండి తరలింపజేస్తాడు. అతడు చనిపోయిండని నిర్ధారణ జరిగిన తర్వాత అదే క్యాంపులో బందీగా ఉన్నటువంటి సలాబత్ జంగ్‌ని విడుదల చేసి అతనికి పదవిని కట్టబెడతారు. దీంతో సలాబత్ జంగ్ తనకు అన్ని విధాల సహకరించిన రామదాసు పండిట్‌ని దివాన్‌గా నియమిస్తాడు. తాను ప్రధానిగా ఉన్న సమయంలో కొల్లాపూర్ (సతారా)కు చెందిన రాణి తారాబాయితో రాజకీయ చర్చలు జరిపిండు. సలాబత్ జంగ్– రాణిల మధ్యన సయోధ్యను కుదర్చిండు. అట్లాగే లక్షల రూపాయల లావాదేవిలను రామదాసు పండిట్ చేసేవాడని ఆనంద రంగం పిళ్ళై డైరీల ద్వారా తెలుస్తుంది. రామదాసు పండిట్ మేనల్లుడు కోదండరామ్ కూడా సలాబత్ జంగ్ కొలువులో పేష్కర్‌గా ఉన్నతోద్యోగంలో ఉన్నాడు. అంటే తన పరపతి ద్వారా అనేక మందికి ఈయన కొలువులిప్పించాడని అర్థమయితుంది.

అయితే ఈతని హత్యా రాజకీయాలను దగ్గరి నుంచి గమనిస్తూ ఉన్నటువంటి వఫాదార్లయిన సైనికులు తమకు చెల్లించాల్సిన జీత భత్యాలు సమాయానికి చెల్లించడంలో రామదాసు పండిట్ విఫలమయ్యాడనీ, ఇందుకు ఆయన తలబిరుసు తనమే కారణమని గ్రహించి ఏప్రిల్ ఏడు 1752 నాడు మహారాష్ట్రలోని భాల్కిలో సైనికులు రామదాసు పండిట్‌ని నరికి చంపుతారు. అయితే రామదాసు పండిట్ డబుల్ క్రాస్ చేసిండు. దక్కన్ నుంచి ఫ్రెంచ్‌వారిని తరిమికొట్టే ఉద్దేశంతో వారి గుట్టుమట్లన్నీ బ్రిటీష్ వారికి అందజేస్తూ ఉండడంతో ఆయన హత్యకు గురయ్యిండని ఛాబ్రా రాసిండు. రామదాసు చనిపోయిన సమయంలో సలాబత్ జంగ్ హైదరాబాద్‌లో ఉన్నడు. అయితే తన దివాన్‌లో అత్యంత సమర్థులయిన లష్కర్ ఖాన్, షానవాజ్ ఖాన్‌లను ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్‌కు రమ్మని ఆహ్వానం పలికిండు. వారిద్దరు వచ్చిన తర్వాత లష్కర్ ఖాన్‌ని దివాన్‌గా నియమిస్తాడు. ఇతను ఘాజియుద్దీన్‌కు చాలా దగ్గరి మనిషి. అందుకే అన్నదమ్ముల మధ్యన యుద్ధ వాతావరణం నెలకొన్నప్పుడు విజ్ఞతను ప్రదర్శించి దాన్ని నివారించాడు. బుస్సీని కూడా అందుకు ఒప్పించిండు.

దివాన్ (ప్రధానమంత్రి)గా నియమితులైన లష్కర్‌ఖాన్ ఫ్రెంచ్‌వారి పంజరంలోంచి సలాబత్ జంగ్‌ని బయటపడేయటానికి ప్రయత్నించాడు. అనారోగ్య కారణాల వల్ల బుస్సీ రాజధానికి దూరంగా ఉన్న సమయంల ఈయన సలాబత్ జంగ్‌ని ఒప్పించి తన సైన్యంలో భాగమైన మొత్తం యూరోపియన్లను వెనక్కి పంపించేందుకు ఏర్పాట్లు చేసిండు. అయితే అనారోగ్యం నుంచి కోలుకున్న బుస్సీ ఈ విషయం తెలుసుకొని లష్కర్ ఖాన్ స్థానంలో షానవాజ్ ఖాన్‌ని దివాన్‌గా నియమింప జేసిండు.

1762లో నిజాం అలీఖాన్ అధికారం చేపట్టిన తర్వాత షానవాజ్ ఖాన్ స్థానంలో రాజా పర్వత్ వంత్ అనే మరో బ్రాహ్మణున్ని దివాన్‌గా నియమించుకున్నడు. ఈతని గురించి తర్వాత వివరంగా తెలుసుకుందాం.

దీన్ని బట్టి అర్థమయ్యేదేమిటంటే కుతుబ్‌షాహీల కాలంలోనే కాదు ఆ తర్వాత కూడా హిందువులను ముఖ్యంగా బ్రాహ్మణులను దివాన్‌లుగా నియమించే పరంపర కొంతమేరకు కొనసాగింది. నిజాం రాజులు సున్నీలయితే ప్రధానమంత్రులుగా షియాలను లేదంటే హిందువులను నియమించుకునేవారు. ఈ పరంపర చివరి వరకూ కొనసాగింది. బ్రాహ్మణ ప్రధాన మంత్రుల చీకటి కార్యక్రమాలు ఇంతవరకూ తెలుగు పాఠకులకు అంతగా తెలియవు. అంతేగాదు మొదటి నిజామ్–రెండో నిజామ్ మధ్యన దక్కన్ సుబేదార్లుగా నిలిచిన నిజామ్ కుటుంబీకుల పాలన గురించి కూడా సమగ్రంగా ఎక్కడా రికార్డు కాలేదు. అయితే ఇంగ్లీషు పుస్తకాల్లో, అప్పటి ట్రావెలాగ్స్, ఉర్దూ చారిత్రక గ్రంథాల్లో కొంత మేరకు రికార్డయింది. వాటి ఆధారంగా ఈ వ్యాసం తయారయింది. చీకట్లో కనుమరుగవుతున్న తెలంగాణ చరిత్రను వెలుగులోకి తెచ్చే ప్రయత్నమిది. అందులో భాగమే ఈ వ్యాసం.

జెడిబి గ్రిబుల్, బ్రిగ్స్, సయ్యదలీ బిల్‌గ్రామి, ఇంకా అనేకమంది నిజాముల తొలి పాలన గురించి సవివరంగా రాసిండ్రు. ఆనందరంగ పిళ్ళై డైరీల్లోనూ ఆనాటి హైదరాబాద్ చరిత్ర చాలా వరకు తేదీలతో సహా నమోదయింది. ఉర్దూ పుస్తకాల్లోని సమాచారం చాలా వరకు హైదరాబాద్‌లోనే అందుబాటులో ఉన్నప్పటికీ ఇప్పటికీ తెలుగులోకి రాలేదు. ఇరు భాషా ప్రేమికుల మధ్య తర్జుమా సంబంధాలు ఉన్నట్లయితే ఆ యా విషయాలు అందరికీ తెలిసేవి. అట్లా అందరికీ అందుబాటులోకి ఆకరాలు వచ్చినప్పుడే చరిత్ర సమగ్రమయితది.

*(సమాప్తం)*

–సంగిశెట్టి శ్రీనివాస్,
m : 9849220321
e : sangishettysrinivas@gmail.com

# కల్లోల కలల కాలం

## (సలాం హైదరాబాద్ - రెండవ భాగం : నవలా పరిచయం)

### ఒక మనిషి - అనేక జీవితాలు

నవల సమకాలీన సమాజ చరిత్రను, జీవన సంబంధాలలోని వైరుధ్యాలను, మానవ జీవిత సంబంధాలలోని సంఘర్షణలను, విలువలను వ్యాఖ్యానించే ఆధునిక వచన సాహిత్య కళా ప్రక్రియ నవల. దీనినే సాంఘిక నవల అంటున్నాం. ఇందులో సమకాలపు చరిత్ర ఘటనల గతిక్రమం నేపథ్యంగా ఉండవచ్చు. పాత్రలు, ఇతివృత్తం కల్పితాలై ఉంటాయి. కానీ కథ కల్పితమైనా సమకాలపు వాస్తవ సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక పరిణామాలు గుర్తించదగిన పోలికలతో ఇతివృత్తంలో భాగమైతే అది డాక్యుమెంటరీ నవల. నిజమైన ప్రజలు, నిజమైన ఘటనలు నాటకీయ శిల్పంతో చెప్పబడటం డాక్యుమెంటరీ నవల లక్షణం. మాలపల్లి, చివరకు మిగిలేది, అతడు- ఆమె వంటి నవలలలకు అటువంటి లక్షణం ఉంది. రచయిత స్వీయ జీవిత అనుభవాలు కాల్పనిక ఇతివృత్తంతో మిళితమైనప్పుడు అది ఆత్మచారిత్రాత్మక నవల అవుతుంది. కొడవటిగంటి కుటుంబరావు చదువు, జీవితం వంటి నవలలు అలాంటి ఆత్మచారిత్రాత్మక నవలలు. అటు డాక్యుమెంటరీ నవల లక్షణాన్ని, ఇటు ఆత్మచరిత్రాత్మక నవల లక్షణాన్నికలుపుకొన్న సరికొత్త ప్రయోగం లోకేశ్వర్ గారి 'కల్లోల కలల కాలం' నవల. ప్రథమపురుష కథనం కాకపోతే 'స్వీయ చరిత్ర' అనటానికి వీలున్న రచన కూడా ఈ నవల. ఈ పద్ధతికి తెలుగులో ఇదే మొదటిది.




అంతేకాదు. ఈ నవలకు మరొక ప్రత్యేకత వుంది. లోకేశ్వర్ నవలా పరంపరలో ఇది రెండవది. పదిహేనేళ్ల క్రితం ఆ కాలానికి అవసరమైన, అద్భుతమైన నవలగా చర్చలోకి వచ్చిన 'సలాం హైదరాబాద్' లోకేశ్వర్ మొదటి నవల. దానికి కొనసాగింపు ఈ "కల్లోల కలల కాలం" నవల. దీనికి కొనసాగింపుగా మరొక నవల వచ్చే అవకాశం కూడా ఉంది. స్వతంత్ర నవలగా ప్రత్యేకమైన శీర్షికతో, కథాక్రమంతో ఉంటూనే ఒక సాధారణ కథాంశంతో, పాత్రలతో ఒక సుదీర్ఘ కాలక్రమంలో సంభవించే సామాజిక పరిణామాలను చిత్రిస్తూ వ్రాయబడే నవలలు ఇవి. వీటిని 'సీక్వెల్ నవలలు' అని కూడా అంటారు. ఇలాంటి నవలల రచన చేసినవాళ్లు తెలుగులో ఇద్దరు ముగ్గురిని మించి లేరు.

వీళ్లకు ఆద్యుడు ఉప్పల లక్ష్మణరావు గారే కావాలి. 1950లో ప్రచురించిన 'అతడు- ఆమె' నవలకు కొనసాగింపుగా అదే పేరుతో, అవే పాత్రలతో మరొక మూడు భాగాలు 1986 వరకు అప్పుడప్పుడూ ప్రచురించారు. అవి వేటికవిగా చదువుకోదగినవే. జాతీయోద్యమ కాలం నుండి ప్రత్యేక తెలంగాణా (1969) ఉద్యమం వరకు దాదాపు అర్ధ శతాబ్ది కాలం మీద సంభవించిన పరిణామాలను ఆరు పాత్రల (ముగ్గురు స్త్రీలు - ముగ్గురు పురుషులు) ముఖంగా వ్యాఖ్యానిస్తూ వ్రాసిన నవల అది. 1969లో వ్రాసిన 'అంపశయ్య' నవలకు కొనసాగింపుగా నవీన్ రవి అనే ప్రధాన పాత్రను అలాగే కొనసాగిస్తూ అతని జీవితంలోని భిన్నదశలు వస్తువుగా ముళ్లపొదలు (1976) 'అంతస్స్రవంతి' (1991) నవలలు వ్రాసారు. ఆ తరువాత మళ్ళీ ఆయనే 1944 నుండి 1994 వరకు యాభై ఏళ్ల కాలం మీద తెలంగాణ సమాజ చరిత్రను రాజకీయ ఆర్థిక పరిణామాలను చిత్రిస్తూ రాజు అనే పాత్ర జీవిత గమనాన్ని వస్తువుగా చేసి 2001లో వ్రాసిన నవలలు కాలరేఖలు (2002), చెదిరిన స్వప్నాలు (2003) బాంధవ్యాలు (2001).

లోకేశ్వర్ 2005లో ప్రచురించిన 'సలాం హైద్రాబాద్' నవల ఇతివృత్తంలో 1578 నుండి 1970 జులై వరకు గడచిన కాలంమీద, హైదరాబాద్ చరిత్ర, సంస్కృతీ సంప్ర దాయాలు, నగర జీవితం ఒక పాయ. ఆకాలంలో, ఆస్థలంలో నడిచిన రాజకీయాలు, ఉద్యమాలు మరొక పాయ. ఆ రెండింటి సంబంధంలో ప్రధాన పాత్ర స్వామి జీవిత పరిణామాలు మూడవపాయ. వెరసి మూడుపాయల జడ అల్లిక ఆ నవల. ఆ నవలలో కథ నిజానికి 2005 జూన్ 10 వతేదీన ఇరానీ హోటల్లో కూర్చొని చార్మినార్‌తో స్వామి చేస్తున్న ఏకాంత సంభాషణ దగ్గర ప్రారంభమై గతించిన జీవితపు జ్ఞాపకాల తలపోతగా 1969 అంతటా పరుచుకొని 1970 జులైలో ఆగుతుంది. ఆ నవలలోని స్వామి జీవితపు కొనసాగింపు ఈ నవల. 1969లో 17 సంవత్సరాల వయసు పిల్లగాడైన స్వామి

అనుభవాలు, చింతన మొదటి నవలలో చిత్రించ బడితే 'కల్లోల కలల కాలం' నవల లోకథ 1970 సెప్టెంబర్ ఆఖరి వారంలో ప్రారంభమై 1989 వరకు ఇరవైఏళ్ళ కాలం మీద విస్తరించుకొని హైద్రాబాద్ కేంద్రంగా జాతీయ అంతర్జాతీయ రాజకీయార్థిక పరిణామాలను పరామర్శిస్తూ వాటికి స్పందిస్తూ పరిణమిస్తున్న స్వామి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తుంది. నిజానికి ఇందులో కథ 2013 నవంబర్ 17 ఆదివారం ఉదయం స్వామి పేపర్ చదువుతూ కృష్ణా టాకీసు కూల్చివేత వార్తతో కలత చెందటం దగ్గర ప్రారంభమై అతని జ్ఞాపకాల తలపోతగా 1970 సెప్టెంబర్ దగ్గరకు వెళ్లి స్వామి జీవిత సంఘర్షణలను, పరిణామాలను చిత్రిస్తూ విస్తరించింది.

పుట్టి పెరిగిన ఊరి మీద ప్రేమ ఎవరికైనా సహజం. ఆ ఊరి చరిత్రను సృజన రూపంలో ఆవిష్కరించటం కొందరికే సాధ్యం. పుట్టుక, ఎదుగుదల, జీవితం అన్నీ హైద్రా బాద్ తోటే ముడిపడి వున్న లోకేశ్వర్ వ్యక్తిత్వంలో అది విడదీయరాని భాగం. అందుకనే హైద్రాబాద్ నగరం గురించి వ్రాయాలనుకుంటే అనివార్యంగా అది అతను తనను తాను తెలుసుకొంటూ తన అనుభవకోణం నుండి నగరాన్ని దర్శించి ప్రదర్శించటంగా ఈ నవల రూపొందింది..




లోకయాత్ర మహా ఇష్టమైన మనిషి లోకేశ్వర్. స్కూటర్‌పై ఛత్తీస్ ఘర్ యాత్ర, సిల్క్ రూట్ సాహస యాత్ర, యూరప్ యాత్ర, నల్లమల దారులలో యాత్ర చేసి వచ్చి యాత్రాకథనాలను వ్రాసి ప్రచురించిన అభిరుచి ఆయనది. ఆ యాత్రికుడి స్వభావం ఈ నవల కథనంలోనూ కనబడుతుంది. హైద్రాబాద్‌లో స్వామి తిరుగాడిన ప్రాంతాలు, ఇతివృత్తంలో ప్రధాన ఘటనలు సంభవించిన స్థలాలను, పాత్రల కార్యక్షేత్రాలను పరిచయం చేసే సందర్భాలలోను పాత్రల మధ్య జరిగే సంభాషణల రూపంలోనూ హైద్రాబాద్ నగరంలోని కోమటికుంట వంటి చెరువులను గౌలీ గూడా బస్ డిపో, లాల్ దర్వాజా, అప్సరా టాకీస్, ఫూల్ బాగ్ చమన్, శాలిబండా రూప్ లాల్ బజార్ చమన్, లలితాబాగ్ బస్తీ, ఉప్పుగూడా హరిజన బస్తీ, అలియాబాద్ బస్తీ, నయాపూల్, సైదా బాద్, నౌబత్ పహాడ్, ఎల్బీ స్టేడియం, సుల్తాన్ బజార్, హిమాయత్ నగర్, బీహెచ్ఇఎల్ టౌన్ షిప్, హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఆబిడ్స్, సికింద్రాబాద్ ఇలా అనేక ప్రాంతాలను మనకు పరిచయం చేస్తారాయన. స్వామి ఇష్టపడి పెళ్లిచేసుకున్న అక్క కూతురు ఆంజల్య కోసమో, కమ్యూనిస్టు పార్టీ శిక్షణ తరగతులు, సభలు సమావేశాల కోసమో వరంగల్, విశాఖ వంటి ఊళ్లకు వెళ్లిన సందర్భాలలో ఆ ఊళ్ళు కూడా ఒక భౌగోళిక భౌతికత, రాజకీయ తాత్వికత కలగలసిన స్వామి చూపు నుండి అవి పాఠకులకు పరిచయం అవుతాయి. పొరకల దొర దాసరి లక్ష్మీకాంతం గురించి తెలుసుకొనటానికి వరంగల్ నుండి బెల్లంపల్లి, ఆసిఫాబాద్, కాగజ్ నగర్, పాల్వంచ వరకు స్వామి చేసిన ప్రయాణంలో మనమూ అతనితో పాటు ఉన్నట్లే, తెలుసుకొంటున్నట్లే ఉంటుంది. అందువల్ల యాత్రాచరిత్ర లక్షణాలు కలిగిన నవలగా కూడా దీనిని గుర్తించవచ్చు.

1970 నుండి 1990 వరకు భారతదేశంలో రైల్వే సమ్మె, ఎమర్జెన్సీ, ఎన్నికలు, ప్రభుత్వాలు మారటం, స్వర్ణదేవాలయంపై ఆపరేషన్ బ్లూస్టార్ పేరిట జరిగిన దాడి, ఇందిరాగాంధీ హత్య అనంతర పరిణామాలు వంటి అనేక చారిత్రక ఘటనలతో, ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాలను సహించలేని అణచివేత ప్రక్రియలతో పార్లమెంటరీ ప్రజాస్వామ్య గమనం ఎలా సాగిందో దానిని వెలుగునీడలతో సహా మనుషుల అనుభవ కోణం నుండి తెలుసుకొనటానికి ఈ నవల ఒక మంచి వనరు. ప్రత్యేకించి ఆంధ్రదేశంలో హైద్రాబాద్ కేంద్రంగా ఉభయ కమ్యూనిస్టుపార్టీల నుండి నక్సలైట్ పార్టీల వరకు ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాల నిర్మాణ ఆచరణల స్వభావం గురించి సాధికారమైన విమర్శనాత్మక చర్చ ఈ నవల ఇతివృత్తంలో సహజ భాగం అయింది. హైద్రాబాద్‌లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల నిర్మాణ కార్యాచరణలలో భాగమైన స్వామి అతని మిత్రబృందం అనుభవాలు సంభాషణలు హైద్రాబాద్ పారిశ్రామిక జీవనాన్ని, కార్మిక చైతన్యాన్ని తెలియచేస్తాయి.

నక్సలైట్ విప్లవ రాజకీయాలకు తొలి సిద్ధాంత కర్త అయిన చారుమజుందార్ దగ్గర నుండి విరసం రచయితలు, కళాకారులపై మోపబడిన కుట్రకేసులు, అరెస్టులు, జైళ్లు మొదలైన విషయాలు, హైద్రాబాదులో ఆ మధ్యకాలంలో జరిగిన రాజకీయ సభలనుండి సాహిత్య సభల వరకు అనేకం, అనేకమంది రాజకీయ సాహిత్య కళా సాంస్కృతిక రంగాలకు చెందిన వ్యక్తులు, రచనలు కళ్ళముందు కదిలిపోయే దృశ్యాలు. అలాగని ఇది కేవలం రాజకీయ నవల కాదు. వాటితో పెనవేసుకొని, సంఘర్షిస్తూ మారుతూ మార్పిస్తూ, విభేదిస్తూ, అర్థం చేసుకొంటూ సాగిపోయే మానవసంబంధాల స్రవంతి బహు ఆసక్తికరంగానూ, ఆహ్లాదంగానూ కూడా ఉంటుంది. సామాజిక సంవేదనా శీలిగా నూతన సమాజాన్ని కలలుకనే యువకుడుగా చేసిన ప్రయాణంలో స్వామి కుటుంబం పట్ల బాధ్యతగా ఉండటం కూడా ఒక భాగమే. అతనికి అందమైన ప్రేమకథ కూడా ఉంది. అక్క కూతురు ఆంజల్య పుట్టుకతోనే నిర్ణయించబడిన వధువు అయినా ఇద్దరిలో పరస్పరం మొగ్గతొడిగి వికసించిన స్నేహానురాగాల నుండి భావాలు, ఆదర్శాలు కలిసి చేసుకొన్నపెళ్లే వాళ్ళది. వాళ్ళిద్దరిమధ్య నడిచిన ఉత్తరాలు అందుకు నిదర్శనం.

ఆంజల్య వరంగల్ అమ్మాయి. ప్రభుత్వ పింగిళి కళాశాల

విద్యార్థి. ఆ అమ్మాయి స్వామికి వ్రాసిన ఒక ఉత్తరంలో హైద్రాబాద్ నుండి పీవోడబ్ల్యూ లలిత వాళ్ళు వచ్చి ఒక మీటింగ్ పెట్టిన విషయం ప్రస్తావించబడింది. అది ఆ కాలేజీ బిఎ విద్యార్థిగా నేను కూడా అప్పుడు ఆ మీటింగ్‌కు హాజరైన సంగతిని గుర్తుకు తెచ్చింది. సమకాలీన సమాజచరిత్రతో నడుస్తూ సర్వేంద్రియాలతో తాను గ్రహించినదానిని చైతన్యంతో విలువకడుతూ లోకేశ్వర్ వ్రాసిన ఈ 'కల్లోల కలల కాలం' నవల ఇతివృత్తానికి ఉన్న భిన్న సామాజిక రాజకీయ సంఘటనల విస్తృతి దృష్ట్యా, భిన్న సామాజిక అనుభవ అంతరాలతో ఉన్న ప్రజల జీవితాన్ని చుట్టుకొని నడిచినందువల్ల ఒక ఐతిహాసిక స్వభావాన్ని పొందింది.

ఈ నవలకు నన్ను మొదటి పాఠకురాలిని చేసి ఈ మాటలు వ్రాసే అవకాశం ఇచ్చిన లోకేశ్వర్ గారికి కృతజ్ఞతా పూర్వకమైన అభినందనలు.

**– కాత్యాయనీ విద్మహే**
పశ్యంతి, వరంగల్.
('కల్లోల కలల కాలం'కి ముందుమాట)

× × ×

**ఇం**కా స్పష్టంగా చెప్పాలంటే ఇది మా తరం కథ. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో జన్మించిన వారి కథ. 1948లో హైద్రాబాద్ రాజ్యంపై పోలీస్ యాక్షన్ జరిగి 1951 నాటికి తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ముగిసిన మధ్య కాలంలో జన్మించిన మా తరం వారి కథ. వ్యక్తిగతంగా, సామాజిక – రాజకీయ పరంగా మాతరం అనుభవించిన 'ఆత్మక్షోభ' కథ. "కాలం కత్తుల వంతెన" మీద కదను తొక్కిన "కన్నీటి కాలం కథ". నెత్తురు నిండి శక్తులు మండిన మా తరం కన్న కలలన్నీ కల్లోలానికి గుర్రై కల్లలుగా మారి జీవితమే ఒక "పగిలిన అద్దం"లా మిగిలిన మా తరం కథ.

ఖండిత శిరస్సు తెగపడి నేల వాలినా ఆ కళ్లల్లోని ధిక్కార స్వభావాన్ని మాత్రం కోల్పోని తరం మాది. స్వాతంత్ర్యోద్యమ తరానికి ఎటువంటి సమున్నత "స్వాభిమానం" ఉండేదో సరిగ్గా అట్లాంటి "స్వాభిమానమే" మా తరానిది కూడా! చేసిన యుద్ధాలలో క్షతగాత్రులమైనా, మనసులోపలి గాయాలు మానకుండా ఇంకా పచ్చిగానే సలుపుతున్నందున, గతం చేసిన గాయాలను గానం చేసి ఈ తరం వారికి అర్థం అయ్యేలా చెప్పటం కోసమే చేసిన యాత్ర ఈ "అక్షర యానం". సుదీర్ఘంగా ఎడతెగని ఈ "విషాదగానం". స్వాతంత్ర్యానంతరం కాలం కనిన బిడ్డల "కన్నీటి గానమే" ఒక దుఃఖపూరిత గానంగా, ఒక పురాగాథగా ఒక సుదీర్ఘ కావ్యంగా, ఒక అక్షర సత్యంగా మీ ముందు నిలబడింది.

"సలాం హైద్రాబాద్" నవల మొదటి భాగం వచ్చి (2005) దాదాపు పదిహేను సంవత్సరాలు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధనలో ఆ నవల తన వంతు పాత్రను నిస్సందేహంగా నిర్వహించింది. ఆ నవల వచ్చిన కొత్తలో చాలా మంది మిత్రులు, పాఠకులు రెండవ భాగం కూడా త్వరగా రాయాలని తొందరపెట్టారు, కోప్పడ్డారు. మరికొంతమంది అలిగి స్నేహం మానుకుంటామని బెదిరించారు. రెండవ భాగం రాయటంలో ఆలస్యానికి కారణం ఉద్యమంలో నేను చురుకుగా వివిధ ప్రజాసంఘాలలో పాల్గొనటమే గాక నడుస్తున్న ఉద్యమాన్ని సాంఘీక శాస్త్రాల విద్యార్థిగా అనేక కోణాల నుండి పరిశీలించటం. రాష్ట్ర సాధన జరిగి ఐదు సంవత్సరాలు ముగిసిన తర్వాత ఇప్పుడు ఇట్లా మీ ముందుకు ఈ రెండవ భాగంతో హాజరవుతున్నాను.

"సలాం హైద్రాబాద్" మొదటి భాగం 1970 జులైలో ముగిసింది. ప్రస్తుతం ఈ రెండవ భాగం నవలలో 1970 నుండి 1989 చివరి వరకు ఇరవై సంవత్సరాల కాలాన్ని రికార్డు చేసాను.

**–పరవస్తు లోకేశ్వర్,** m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com










**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో** బాలచెలిమి ప్రచురించిన **'గాడిద తెలివి', 'అంతరిక్ష దొంగలు'** (2018 నవంబర్), **'గుల్లేరు బాలుడు', 'టంగ్ యంగ్'** (2018 డిసెంబర్) అనే నాలుగు కథల పుస్తకాలు వెలువడినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. ప్రతులు కావల్సిన వారు ఈ క్రింది చిరునామా నుండి పొందవచ్చును.

విడి ప్రతి వెల: రూ.30/-
'Bhoopathi Sadan' 3-6-716, Street No.12, Himayathnagar,
Hyderabad-500029, Telangana. Mob: 9030626288
మరియు
● Nava Telangana ● Manchi Pustakam
● Nava Chetana ● Navodaya Book House

**బాల చెలిమి** పిల్లల మాసపత్రిక 52 పేజీలు రంగులతో ఫిబ్రవరి మాసం నుండి మీ చేతుల్లోకి.

# ప్రేమావరణం

"నేను నీవై
నీవు నేనై
నా శ్వాస నీదై
నీ శ్వాస నాదై
మనిద్దరిదీ ఒకటే ధ్యాసై"
ఇవన్నీ
ఒట్టి ఇల్యూజన్సాఫ్ ఎమోషన్స్

వద్దు
మనకొద్దు
ఈ అసంబద్ధ అసంగతాలు మనకొద్దు...



నీవు నీవులా వుంటూ
నేను నేనులా వుంటూ
మనం మనంలా వుందాం
కలిసుందాం...విడిపోదాం...కలిసుందాం...
మనకి
ఎప్పుడు
ఏది యిష్టమైతే అలా వుందాం...

ఆధిపత్యానికీ బానిసత్వానికీ
చోటులేని చోటు కదా..
ఈ ప్రేమావరణం..

-జుగాష్ విలి
m : 98482 66384
e : jugashvili.15@gmail.com







**మీ గడపలోకి అడుగిడనున్న బాలచెలిమి**

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో 1990 మరియు 1991 సంవత్సరములలో వెలువడిన పత్రికకు మంచి ఆదరణ పొందిన 'బాలచెలిమి' పిల్లల వికాస పత్రికను పునరుద్ధరించామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. బాలలలో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన వినోదాలను అందించాలన్న లక్ష్యంతో త్వరలోనే 'బాలచెలిమి' మీ ముందుకు రాబోతున్నది. 'బాలచెలిమి'కి రచయితల నుండి బాలల రచనలను ఆహ్వానిస్తున్నాం.

మీ రచనలను పంపవలసిన మా చిరునామా:
ఎడిటర్, 'బాలచెలిమి', చంద్రం, 3-6-712/2, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, తెలంగాణ.

Mobile : 9030626288
Email : desk.chelimi@gmail.com
Website : www.balachelimi.com

# పర్యావరణం - శాస్త్రం - నైతికత - తాత్త్విక దృక్పథాలు

(గత సంచిక తరువాయి)

## Environmental Ethics (పర్యావరణ నైతికత)

"Environmental ethics is a systamatic account of the moral relations between human beings and their natural relations between human beings and their natural environment" (page:11, Environmental philosophy)

మనుషులు తమచుట్టూ ఉన్న సహజ పర్యావరణంతో కలిగి ఉండే నైతిక సంబంధాల క్రమ పరిగణననే పర్యావరణ నైతికత అనవచ్చు.

Environmental ethics ఏమి భావిస్తుందంటే నైతిక నియమాలు సహజ ప్రపంచాన్ని మానవ ప్రవర్తన గౌరవించేట్లు చేస్తుంది. అందువల్లనే Environmental ethics సిద్ధాంతం ఈ నైతిక నియమాలు ఏమిటనే వాటిని గురించి వివరిస్తుంది. ఇవి ఎవరికి అనేవి అనే వాటిని వివరిస్తుంది. మనుషులు ఎటువంటి బాధ్యతలను కలిగి ఉన్నారు. ఆ బాధ్యతలకు న్యాయం చేయడమెట్లా అనే వాటి విషయాలను కూడా వివరిస్తుంది.



ఎన్విరాన్‌మెంటల్ ఎథిక్స్‌కు సంబంధించిన భిన్న సిద్ధాంతాలు, విభిన్నమైన సమాధానాలను ఈ ప్రశ్నలకు అందిస్తాయి.

కొంతమంది తాత్త్వికులు మానవ బాధ్యతలకు సంబంధించి చెప్పే అంశం ఏమంటే - బాధ్యత పరోక్షమైనవి. వనరులను పరిరక్షించడం అనేది ఇతర మానవుల పట్ల మన బాధ్యతలు ఎటువంటివి అనేది అర్థం చేసుకోవడంతో కూడి ఉంటుంది. వీటిని Anthropocentric ethics చెప్పాలి. దీనిలో మానవులు నైతిక విలువలను కలిగి ఉంటారని తెలుపుతుంది. (మనుషులు మాత్రమే) మనకు ప్రకృతి ప్రపంచం పట్ల బాధ్యతలు ఉన్నప్పటికీ అవి సహజ ప్రపంచానికి సంబంధించిన మన బాధ్యతలు పరోక్ష మైనటువంటివి.

తొలి దశాబ్దాలలో పర్యావరణ ఉద్యమానికి సంబంధించిన తలెత్తిన వివాదాలు అన్నీ గాలి, నీటి కాలుష్యం, వ్యర్థ విష పదార్థాలు, క్రిమి సంహారకాల దుర్వినియోగం మొదలైన వివాదాలన్నీ మానవ కేంద్రక ఎథిక్స్ (Anthropocentric ethics) దృక్పథం నుంచి ఉద్భవించినవే కావటం గమనార్హం. క్రిమి సంహారకాలలో కలుషితమైన నీరు, ఆహారం మానవుల ఆరోగ్యానికి ప్రత్యక్ష ముప్పును కలిగిస్తున్నాయి. ఆ విధంగా మానవ కేంద్రక ఎథిక్స్ అత్యంత సరళంగా ప్రమాణబద్ధ నైతిక సూత్రాలను కొత్త సమాజానికి సమస్యలకు అన్వయింపజేస్తూ ఉన్నాయి.

మానవకేంద్రక ఎథిక్స్ విస్తరణ భవిష్యత్ తరాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఉనికిలోకి వస్తుంది. మనుషులు వస్తువులుగా నైతిక బాధ్యతలను కలిగి ఉన్నారు. ఈ పద్ధతిలో కేవలం మనుషులు మాత్రమే నైతికంగా పరిగణనలోకి వస్తారు. అయితే దీని విస్తరణ అప్పటికి ఉనికిలో ఉండని మానవుల అస్తిత్వానికి మన బాధ్యత ఏమిటి? మన పూచీ ఏమిటి అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. తిరిగిమళ్లీ పర్యావరణ ఉద్యమ సిద్ధాంతాలను ఈ తరహా ప్రశ్నలన్నీ లేవనెత్తాయి. వాటిల్లో వనరుల conservation ఒకటి కాగా అణువ్యర్థ పదార్థాలను పారవేయటం ఈ రెండూ కూడా Anthropo ethical perspective లోంచే చూడబడినాయి.

ఇతర తాత్త్వికుల వాదన ఏమంటే సహజ ప్రపంచంతోటి మనం ప్రత్యక్ష బాధ్యతలను కలిగి ఉన్నాం. కేవలం మానవులు కాదు మానవేతర ప్రాణుల పట్లకూడా ఇది non anthropoentric ethics. మనకు ఈ దృక్పథం నైతిక ధైర్యాన్నిస్తుంది. జంతువు, మొక్కలు మొదలైన సహజ ప్రాణుల పట్ల మనకి ఉన్న బాధ్యత ప్రత్యక్షమే. ఈ విధానం మరికొంత విస్తరణను ప్రమాణబద్ధ ఎథికల్ సూత్రాలను పునరుద్ధరించాల్సి ఉంది. ప్రాణుల పట్ల అంతరించిపోతున్న మొక్కల జాతుల పట్ల చెలరేగిన వాదవివాదాలు దీనిలో భాగమే.

ఇక మూడవది Holistic ethics విడి ప్రాణుల నుంచి మొత్తం ప్రజాతులపైకి మారటం ఇందుకు ప్రధానం. ఇందులో Collections లేదా Wholes ముఖ్యం. Species, populations,ecosystems. holistics ethics. చెప్పే విషయము మనకు అన్నిటి పట్లా బాధ్యతలున్నాయి అని individuals కంటే మొత్తంగా చూడాలి అంటుంది.

ఉదాహరణకు ఎంపిక చేసిన వేటను ఇది అనుమతి ఇస్తుంది. విడి ప్రాణాలను వేటాడవచ్చు. నియమం ఏమంటే అవి అంతరించి పోయే ప్రమాదం ఉండనట్లయితే వేటకు అనుమతి ఉంది. అంటే అవి endangered speciesగా ఉండకూడదు. Holism Science of ecology తో ప్రభావితమైంది. అంతేకాదు గంభీరమైన తాత్త్వికమైన సమస్యలను అది లేవనెత్తింది. Individual ethics కంటే తీవ్రమైంది ఇది.

ethics అనే పదం గ్రీకు పదమైన e'thos' నుండి నిష్పన్నమైంది. దీనర్థం 'custom' అని. ఈ అర్థంలో ethics దేనిని సూచిస్తుందంటే సాధారణ విశ్వాసాలు, వైఖరులు లేదా సంప్రదాయబద్ధ ప్రవర్తనను నడిపే ప్రమాణాలను సూచిస్తుంది. అట్లా సమాజం దానిదే అయిన ఎథిక్స్‌ను కలిగి ఉంటుంది. అంటే కొన్ని రకాల విశ్వాసాలు, ప్రమాణాలు ఏది customary అనే దానిని

నిర్ధారిస్తాయి. గ్రీకు తత్వశాస్త్రం తొలినాళ్లనుంచి philosophical ethics సంప్రదాయబద్ధమైందే హక్కుగా భావించడాన్ని అంగీకరించడంతో సంతృప్తి చెందలేదు.

ఎథిక్స్ తత్వశాస్త్రపు శాఖగా వివరణాత్మక పరిశీలన చేస్తుంది. సంప్రదాయం ఏం చెపుతుంది. ఎట్లా జీవించమని ఆదేశిస్తుందనే వాటిని పరిశీలిస్తుంది. సోక్రటీసుతో ఉద్భవించిన పాశ్చాత్య తత్వశాస్త్రం జీవితకాలం విమర్శనాత్మక పరిశీలనచేసింది గ్రీకు సమాజపు సంప్రదాయ నియమాలు ఏమిటనే విషయంగానే.

ఈ విమర్శనాత్మక పరిశీలు రెండుస్థాయిల్లో మనం ఒకడుగు వెనక్కివేయడం లేదా మన సాధారణ అనుభవాన్ని అమూర్త పరచుకోవడం ఇమిడి ఉంది. మనసాధారణ, సంప్రదాయ అనుభవానికి సంబంధించి మనకు కొన్ని విశ్వాసాలు, వైఖరులు, విలువలు ఉంటాయి. వాటిని మనం కలిగి ఉంటాం. అనుభవం నుంచి ఒకడుగు వెనక్కివేసి విమర్శనాత్మకంగా ప్రతిఫలనం చూపమని తత్వశాస్త్రం కోరుతుంది. మనం విశ్వసించే విషయాలను మనమెందుకు విశ్వసిస్తాం. మనం మన వైఖరులను మార్చుకోవాలా? మన విలువలు సమంజసమైనవేనా? ఈ తొలి స్థాయి అమూర్తత, సంప్రదాయ ప్రవర్తన పరిశీలనకు గురికావాలి. ఒక నియమానికి, ప్రయాణానికి appeal చేయాల్సింది ఒకటుంటుంది. ఏది జరగవలసి ఉంది. ఏది జరగాలి అనే దానికి సంబంధం ఉంటుంది.



మన ఎథికల్ మరియు పర్యావరణ చైతన్యం విషయంగా ఉండే విషయములను తేటతెల్లం చేయటమే రాబోయే అధ్యాయాలలో మనం చూడాలి. ఈ ఎథిక్స్ సంబంధించిన చర్యలు కొంత మనకు అసహనాన్ని కలుగజేసే అవకాశం ఉంది. అందుకు ఈ చర్యలను మనం పరిశీలించేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించాలి. అనేక పర్యావరణ వివాదాలు ప్రపంచానికి సంబంధించి మన సంబంధం తదితర అంశాలు భిన్నవైఖరులు, విలువల మీద ఆధారపడి ఉంటాయి. కొన్ని విషయాలు అసహనానికి గురిచేస్తూ ప్రాథమిక దృక్పథాలను సవాలు చేస్తాయి. కానీ, మనం కొంత ఓపెన్‌గా ఉండాల్సిన అవసరం ఉంది. మనం కొన్ని సార్లు ఎథికల్ ఇగ్నోరెన్స్‌లో ఉంటాం. ఫిలాసఫికల్ ఎథిక్స్ యొక్క ప్రాథమిక లక్ష్యం నిరంతరంగా మన అవగాహనను, దృక్పథాన్ని, చైతన్యాన్ని విస్తరింప జేసుకుంటూ పోవటం జరగాలి. ఈ విధంగా చేయడం వల్ల సంప్రదాయ ఆలోచనా విధానం నుండి వైదొలగడానికి ఇది దోహదపడుతుంది.

నైతిక తీర్పులు చేయడానికి, సలహా ఇచ్చేందుకు ఏం చేయాలనే విషయంపై మూల్యాంకనం జరిపేందుకు Normative ethicsతో సంబంధం ఉండాలి. మొదటి స్థాయి అమూర్తమైనటువంటిది. ఇది నైతిక హేతువుతో ముడిపడి ఉంటుంది. ఎక్కువమంది ఈ స్థాయిలో సం.... ఉంటారు. 'Normative judgements' ప్రవర్తన ఎలా ఉండాలో తెలియచెపుతాయి. నిర్దేశిస్తాయి. "పెస్టిసైడ్ల వాడకం తగ్గించాలి", "కర్మాగారాలు నీటిని కలుషితం చేయకూడదు" Endangered ప్రజాతులు పరిరక్షించబడాలి"

'Normative judgements' బాహ్యంగాను, అంతర్గతంగా ఏదో ఒక నియమాన్ని నైతిక ప్రవర్తనకు ప్రమాణాన్ని నిర్దేశిస్తాయి.

ఎన్నో పర్యావరణ వివాదాలు ఈ Normative ethicsతో ఏర్పడే తగవులను కలిగి ఉంటాయి. ఒక పక్షం అణువిద్యుత్ ప్లాట్లు విధ్వంసకరం అని విశ్వసిస్తాయి. మరో పక్షం మన జీవన విధానాలు కొనసాగాలంటే అణువిద్యుత్ అవసరమని విశ్వసిస్తాయి. వాదిస్తాయి. ఇరు పక్షాలు ఆధారాలను చూపుతాయి. తీర్పులకు మద్దతు ఇవ్వమని కొన్ని నియమాలను కూడా రూపొందిస్తాయి. Normative disputes విసుగును, అసహనాన్ని కలగజేస్తాయి. వివాదాలకు తావివ్వడం వల్ల మనం మరోసారి ఆమూర్తల్లోంచే బయటపడి ఏ ప్రత్యేకమైన అంగీకారం కుదరని విషయాలు ఉంటాయో వాటిని చూడాలి. పరిశీలించాలి. ఏ విలువలు సంఘర్షణకు గురయ్యాయో చూడాలి. అసలు సంఘర్షణకు మూలమైన కారణాలను కనుగొనాలి. అమూర్త ఆలోచనవైపు కదలటం అంటే నార్మేటివ్ నుండి ఫిలాసఫికల్ ఎథిక్స్ వైపు మారటమే.

ఎథికల్ రీజనింగ్ యొక్క తృతీయ స్థాయి పిలాసఫికల్ ఎథిక్స్, పిలాసపికల్ ఎథిక్స్ అనేది అధిక స్థాయిలో జరిగే సాధారణత, అమూర్తత అందులో నం సాధారణ తీర్పులను విశ్లేషించటం, తీర్పు ఇవ్వడం ఉంటుంది. అందుకు ఆలంబనగా నిలిచే కారణాలను పేర్కొనడం జరుగుతుంది. ఇందులో సాధారణ భావనలు, సూత్రాలు, సిద్ధాంతాలు ఉంటాయి. వీటికి డిఫెండింగ్‌గా ఉంటూ నార్మేటివ్ క్లెయిమ్స్‌ను వివరిస్తుంటాయి. ఈ స్థాయిలో తాత్వికులు సౌకర్యంతో ఉంటారు. అంతేకాదు చాలా విషయాలు ప్రస్తావించడానికి ముందుకొస్తారు. ఈ అర్థంలో Environmental ethics is a branch of philosoply involoving the systematic study and evaluation of the normative judgements that are so much a part of envirommentalism"19

"ethical theory refers to any attempt to provide systematic answers to the philosophical questions raised by descriptive and normative approaches to ethics"

ఈ ప్రశ్నలు వ్యక్తి నైతిక దృష్టికోణం నుండి మరియు సమాజ దృష్టికోణం లేదా పబ్లిక్ పాలసీ వరకు విస్తరిస్తాయి. నేనేం చేయాలి? నేను ఎటువంటి వ్యక్తిగా ఉండాలి? నేను దేనికి విలువ ఇస్తాను? నేనెలా జీవించాలి? ఇవి వ్యక్తికి సంబంధించినవి. సామాజిక తత్వ శాస్త్రం లేదా పబ్లిక్ పాలసీకి సంబంధించిన ప్రశ్నలు. ఏ తరహా సమాజం ఉత్తమమైనది? ఏ విధమైన విధానాలను ఒక సమూహంగా

అనుసరించాలి? ఏ సామాజిక ఏర్పాట్లు, ఆచరణలు వ్యక్తి సంక్షేమాన్ని సంరక్షిస్తాయి? విడి వ్యక్తులు ఆమోదించకపోతే ఏం చేయాల్సి ఉంటుంది. మొదలైనవి తత్వశాస్త్రం తొలినాళ్ళ నుంచి ఉన్నవే. ఎథిక్స్ వ్యక్తి, సమాజ నైతికతలకు సంబంధించిన ప్రశ్నలను ఇందులో కూర్చాయి. విస్తృతార్థంలో ఎథికల్ థియరీ తాత్విక విశ్లేషణ నైతిక, రాజకీయ, ఆర్థిక, న్యాయ, సామాజిక ప్రశ్నలను ముందుకు తెస్తుంది.

సాధారణ పరిభాషలో ఎథిక్స్ అధ్యయనం పర్యావరణ వివాదాలను పరిపూర్ణంగా మూల్యాంకన పరచడానికి అవసరమేనని గుర్తించాలి. అయితే ఎథికల్ థియరీ అధ్యయనం కూడా ప్రాసంగికమే. సాధారణ పరిగణనలు సిద్ధాంతాన్ని ప్రాసంగికం చేస్తాయి. ఎథికల్ సిద్ధాంతాలు సాధారణ భాషను రూపొందిస్తాయి. ఎతికల్ ఇష్యూస్ వర్తించడానికి అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. పర్యావరణ ఎథిక్స్ అసంఖ్యాక వివాదాలను లక్షణీకరించుకుని ఉంటాయి. చాలా స్పష్టంగా అవసరమైన మొదటి అడుగు ఈ వివాదాలను పరిశీలించడానికి, పరిష్కరించడానికి వీటిని సంపూర్తిగా, కచ్చితంగా అర్థం చేసుకోవాలి. ఎథిక్స్‌కి సంబంధించిన వర్గీకరణలు, ప్రాథమిక భావనలు – హక్కులు, బాధ్యతలు, ఉపయోగం. అందరికీ మేలు, ఈ భావనలకు మధ్యనున్న సంబంధాలు ఉభయత్రా వీటిని లేదా సంభాషణను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ఎథికల్ సిద్ధాంతాలు ప్రత్యేకమైన వివాదాల్లో ఉన్న అంతర్గతంగా ఉన్న వాటిని సాధారణార్థంలో గ్రహించడానికి, పద్ధతి ప్రకారం అవగాహన చేసుకోవడానికి ఉపకరిస్తాయి. తాత్త్విక ఎథిక్స్‌ను భాషను నేర్చుకోవడం ద్వారా మనం చక్కగా వీటిని అర్థం చేసుకోవడానికి, మూల్యాంకన పరచడానికి, వాటిని తిరిగి ఇతరులకు తెలియజెప్పటానికి ఉపకరిస్తుంది.



అయితే ఇది – తత్ఫలితంగా పర్యావరణ చర్చల్లో సాధికారికంగా పాల్గొనేందుకు వీలు కల్పిస్తుంది. హేతుబద్ధమైన సంభాషణ కొనసాగించడానికి ఫిలాసఫికల్ ఎథిక్స్ ఒక సాధారణ భాషను కల్పిస్తుంది. పర్యావరణం ఎథిక్స్‌ను, తాత్విక ఎథిక్స్‌ను అధ్యయనం చేయటం ద్వారా వాగ్గేయకారులు ఏ నైతిక సూత్రం మీద నిలబడి ఆలోచించారో అర్థమవుతుంది.

ఈ దృష్ట్యా పర్యావరణ తాత్త్వికులు ఇచ్చిన కొన్ని భావనలను ఇక్కడ పరిచయత్మాకంగా అర్థం చేసుకోవడం అవసరం. వీటిల్లో ప్రధానంగా ఉపయోగితావాదం, సోషల్ ఎకాలజీ, గుప్తపర్యావరణ అధ్యయనం, పర్యావరణ స్త్రీవాదం, జీవకేంద్రక నైతికత అంతర్గత విలువలు, పర్యావరణ విమర్శ అనేవి ప్రధానమైనవి.

**ఉపయోగితావాదం**

పర్యావరణ నైతికతను అధ్యయనం చేయడానికి ఉపకరించే మరొక సంప్రదాయమే ఉపయోగితావాదం (Utilitarianism). జెర్మీబెంతామ్. స్టూవర్ట్‌మిల్‌ల రచనల్లో ఈ సంప్రదాయానికి సంబంధించిన ప్రకటనలు కనిపిస్తాయి. నేటికీ ఈ వాదం పర్యావరణ పరమైన ఆలోచనలమీద ప్రభావం నెరపుతూ ఉన్నది. ఇది ప్రధాన స్రవంతికి చెందిన ఆర్థిక దృష్టికోణాలను పర్యావరణ నిర్ణయ విధానాలకు గాను ఒక సిద్ధాంత ప్రాతిపదికను సమకూరుస్తుంది.

ఉపయోగితావాద హేతువు అర్థశాస్త్రం, ప్రజావిధానం, ప్రభుత్వ నియంత్రణ లాంటి అంశాలపై ప్రభావం చూపుతుంది. స్థూలార్థలో ఉపయోగితావాదం అందరికీ మేలును అధికం చేయుట లేదా ఎక్కువ మందికి అధికాధికంగా సంక్షేమం సమకూర్చటం గురించి తెలుపుతుంది. ఈ వాదం రెండు అంశాలమీద ఆధారపడి ఉంటుంది. ఒకటి ఏది మంచిచేస్తుందో పరిగణన చేయటం, ఇక అన్ని రకాల చర్యలను, నిర్ణయాలను నిర్ణయించడానికి కావలసిన నియమం లేదా సూత్రాలను ఇవ్వడం. మరి ఇవి ఏం చేస్తాయనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీనిని ఈ విధంగా పేర్కొనవచ్చు. “The rule tells us to look to the consequences of any particular act and judge the ethical status of the act interms of those consequences”. చర్యల వలన నిర్ణయాల వలన కలిగే పర్యవసానాలను, ఆ పర్యవసానాల ఆధారంగా నైతికస్థితి ఇక్కడ ప్రధానం. ఒక ప్రత్యేక నిర్ణయం లేదా చర్య మంచి పర్యవసానాలను కలిగిస్తే నైతికం లేదా చర్య మంచి పర్యవసానాలను కలిగిస్తే నైతికంగా అది ఒప్పు. అట్లా కానప్పుడు అది తప్పు అని నియమం నిర్ణయిస్తుంది.

దీనిలో రెండు విషయాలున్నాయి. ఒకటి విలువను కొలవటం. దీని కొలమానం ఏమిటంటే సంతోషాన్ని పరిగణించటం లేదా నిర్ణయ ఫలితంగా పక్ష సంక్షేమం. ఏది ఉత్తమమైన ఐచ్ఛికం అవుతుందటే, ఏ పర్యవసానాలు ప్రభావిత ప్రతినిధుల సంతోషాన్ని రెట్టింపు చేస్తుందో అది మంచిది. దీనికి మంచి చర్య ఏమంటే సంక్షేమంలో అధికంగా మెరుగుదల ఉండటం.

కాబట్టే ఈ ఉపయోగితావాదం మూడిటి గురించి మాట్లాడుతుంది. ఆ మూడూ ఇవి.

1. “It is welfarist : The only thing that is good in it self and not just a means to another good is the happiness or well-being of individuals.

2. It is consequentialist : Whether an action is right or wrong is determined solely by its consequences.

3. It is aggregative maximissing approach : We chose the action that produces the greatest total amount of well being”

పై మూడంశాలను అంచనావేస్తుంది ఉపయోగితావాదం. అయితే ఈ మూడిటిపై తత్వశాస్త్రం, అర్థవాస్త్రం, రాజకీయ సిద్ధాంతాలలో ఎన్నో వివాదాలకు కూడా ఇవి కారణమయ్యాయి.

ఉదాహరణకు సంక్షేమం అనేదే తీసుకుంటే అసలు సంక్షేమం అంటే ఏమిటి? సంక్షేమం వల్ల కలిగే సంతోషం ఏమిటి? సంక్షేమాన్ని లేదా సంతోషాన్ని ఎట్లా కొలుస్తారు. ఒకవేళ కొలవగలిగినా లాభనష్టాలను ఇతర బృందాలపరంగా ఎట్లా అంచనా వేస్తాం అనేవి ముఖ్యంగా చర్చకొస్తాయి. మానవ చర్యలకు ఎదురయ్యే అవరోధాలు పర్యవసానాలతో సంబంధం లేకుండా ఉంటాయా? ఒక చర్యయొక్క మంచి చెడులనేవి పర్యవసానాలు కేవలం విషయమేనా? సాధారణ సంక్షేమం నిమిత్తమే అయినా ఎవరినైనా బాధకు గురిచేయవచ్చా? అనేవి సంక్షేమ సంబంధిత ప్రశ్నలు ముందుకొస్తాయి. సంతోషాలు లేదా సంక్షేమం అధికం చేయడమనే కోణానికి సంబంధించి చూస్తే వివిధ విడి వ్యక్తుల సంతోషం కంటే మొత్తం సంక్షేమం పరిగణనకు వస్తుందా? లేక ప్రతి విడివ్యక్తి సంక్షేమం మొత్తం సంక్షేమంలో విడిగా లెక్కకు వస్తుందా అనేవి ముఖ్యమవుతాయి. సంక్షేమం అధికం చేయడంలో, విధాన నిర్ణయంలో సంక్షేమం అందిరికీ పంచటంలో స్వచ్ఛత, న్యాయం అనే వాటి మాటేమిటి. వస్తువులు పంపిణీ అయితే చాలా? దానికతే సంక్షేమంగా మారుతుందా? ఇతరులకంటే తక్కువ సంక్షేమం కలిగి ఉన్న వారిపై పర్యావరణ ప్రభావాల పేరిట, కాలుష్య నియంత్రంలో భాగం వారి సంక్షేమాన్ని మరింత కుదించటం సమంజసమేనా లాంటివి కూడా ఈ పర్వారణ సందర్భంలో ముందుకొస్తాయి.

ఉపయోగితా వాదంలో రెండు విధాలైన పరిగణన ఉంది. ఒకటి ఆనందం లేదా సంతోషాన్ని దానికది ఉత్తమమైనదిగా విలువ కడుతుంది. అంటే బాధ లేక పోవటం ఇందులో ఉంటుంది. ఆనందం, బాధారహితంగా ఉండటం సార్వత్రికంగా కోరదగినవి. ప్రజలు సంతోష ఆనందాలను వదులుకొని బాధను కోరుకుంటున్నారంటే నిర్హేతుకంగా వర్తిస్తున్నారని సందేహించాల్సి వస్తుంది. ఆనందం విశ్వజననీంగా విలువైనది. దీనిని సుఖవాద ఉపయోగితావాదంగా పిలవచ్చు.

ఇక రెండోది మంచిని 'సంతోషంగా' పరిగణిస్తూ మన కోర్కెలను సంతృప్తి పరచుకునే క్రమంలో ఉత్పన్నమైనదిగా సంభావించటం. ఈ దృక్పథంలో ప్రజలు ఎప్పుడు సంతోషంగా ఉంటారంటే వారు ఆశించింది పొందగలిగినప్పుడు, వారి కోరికలు సంతృప్తి చెందినప్పుడు. దీనిబట్టి చూస్తే ఉత్తమ ప్రపంచం ఏదవుతుదంటే " A worl in which as many people have as much of what they desire as possible would be ethically best world" అని పేర్కొంటున్నారు. ప్రజలు కోరినంత మేరకు దానిని కలిగి ఉండటం సాధ్యమయ్యే ప్రపంచమే నైతికంగా ఉత్తమమైనదని చెపుతారు. ప్రాదాన్యాలను సంతృప్తి పరచుకోవటంలోనే సంక్షేమం ఉంటుంది. సంక్షేమ ఆర్థికాల్లో ఈ ప్రాధాన్యం ఉపయోగితావాదం ప్రభావితపరుస్తున్నది. అత్యధికులకు అత్యధిక సంక్షేమం, సంక్షేమం మొత్తాన్ని అధికం చేయటం అనే వాటితో పోలిక, కొలత వేయటం అనేవి ఉన్నాయి. అన్ని కోరికలు ఒకేటనా? అన్ని సంక్షేమాలు ఒకలాగానే ఉంటాయా? అన్ని సంతోష ఆనందాలు గుణాత్మకంగా ఒకటే అవుతాయా అనే ప్రశ్నలు ఎప్పుడు మిగిలే ఉంటాయి. దీనికి ఉపయోగితావాదుల ప్రకారం సమాధానం ఈ విధంగా ఉంటుంది. According to the Utilitarian, no particular act, in and of it self is ever right or wrong. The ethical states of any act always depends on some thing else: its consequences. Right and wrong always depend upon the context and therefore, always depend on factors outside the individuals control".

ఈ విధమైన వివరణలో నైతిక సంబంధం, బాధ్యత లేనిదిగా ఉపయోగితావాదాన్ని భావించగల అవకాశం కల్పిస్తుంది. సందర్భం పైన ఆధారపడి తప్పొప్పులు ఉంటాయనేది వాస్తవమే. అయితే తప్పొప్పులు అనేవి నిర్ణయించగల సామర్థ్యం వ్యక్తుల నియంత్రణకు బాహ్యంగా ఉండే కారణాల మీదకు ఆధారపడి ఉంటాయనటంలోనే ఉపయోగితావాదం పర్యావరణా హితానికి, మితానికి అతీతంగా ఉండాలని ఆశిస్తున్నట్లు ప్రస్ఫుటమవుతుంది. సూత్రప్రకారం కొన్నిసార్లు ఒకతప్పుడు నిర్ణయం అమలు జరిగి అది మేలుకలిగించే పర్యవసానాలను కలిగించవచ్చు. మరికొన్నిసార్లు సూత్రబద్ధంగా సరైన నిర్ణయం అనుకొని అమలుపరిచినది ఆశించిన మేలుకంటే పర్యవసానాలు ప్రతికూలంగా రావచ్చు. అందువల్లనే విమర్శకులు ఈ సిద్ధాంతాన్ని అసమగ్రమైనదిగా గుర్తిస్తారు. పర్యావరణం విషయంగా ఉపయోగితావాదం ఎప్పుడూ వివేకవంతమైన ఆలోచనలకు దారితీసేందుకు చర్చను సజీవంగానే ఉంచుతుంది.

*(ఈ అధ్యాయంలోని మిగతా భాగం వచ్చే సంచికలో)*

**-డా॥ ఆర్. సీతారామారావు,**

m : 9866563519

e : sitametaphor@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# మూడు రాతియుగాల రాతిచిత్రాలతో గుండ్లపోచంపల్లి ఆవాసాలు

హైదరాబాదుకు 30 కి.మీ.ల దూరంలో కొంపెల్లి గ్రామానికి చేరువలో మేడ్చల్ మండలంలో వున్న గుండ్లపోచంపల్లికి 2 కి.మీ.దూరంలో ప్రభుత్వ అటవీభూముల అంచున 3శిలాశ్రయాలలో(Rock shelters) కొత్తగా రాతిచిత్రాలు (Rock Arts) కనుగొనబడ్డాయి. ఈ చిత్రిత శిలాశ్రయాలు భౌగోళికంగా 17.5820 డిగ్రీల అక్షాంశాలు, 78.4617 డిగ్రీల రేఖాంశాలపై, సముద్రమట్టానికి 545మీ.ల ఎత్తున వున్నాయి. గుండ్లపోచం పల్లికి చెందిన సాయికృష్ణ, దక్కన్ యూనివర్సిటి చారిత్రక పరిశోధక విద్యార్థి, యువ ఇంజనీర్ చరిత్రపై ఆసక్తితో తన అన్వేషణను తనవూరి నుండే మొదలుపెట్టి సఫలీకృతంగా ఈ మూడు చిత్రిత శిలాశ్రయాలను గుర్తించాడు. మా తెలంగాణ చరిత్రబృందాన్ని ఆహ్వానించి వాటిని చూపించాడు. ఈ చారిత్రక యాత్రలో మొదటిసారి శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణ, బెల్లంకొండ సంపత్ కుమార్, చంటి, ఫారెస్టుగార్డ్, సాయికృష్ణ తోడుగా పాల్గొన్నారు. రెండవసారి యాత్రలో తెలంగాణ చరిత్రబృందంతో కట్టా శ్రీనివాస్, కట్టా జ్ఞానేశ్వర్‌లు ఉన్నారు.



మొదటి రాతిచిత్రాలతావు ఒక పెద్దరాతిగుండు పడిగెరాయి కింద రాతిగోడమీద వున్నాయి. 8,9 అడుగుల ఎత్తున్న ఈ రాతిగుండు లోపలి తెరుచుకున్న గుహవలె వుంది. ఈ తావు వెడల్పు 12 అడుగులను మించి వుంది. రాతిచిత్రాల కాన్వాస్ ఎత్తు 5అడుగుల మాత్రమే వుంది. ఈ చోటు పరిసరాలలో రాతిచిత్రాలు వేయడానికి వాడే పదార్థాలలో ఒకటైన హెమటైట్ పిగ్మెంట్స్ దొరికాయి. ఈ రాతిచిత్రాలమీద మా బృందం సైంటిస్టు కట్టా జ్ఞానేశ్వర్ రామన్ స్పెక్ట్రోగ్రఫీతో విశ్లేషణ చేసినపుడు ఈ ఎరుపురంగు రాతిచిత్రాలు గీయడానికి వాడిన పదార్థాలలో హెమటైట్ వాడినట్లు తేలింది.



ఈ Rock shelterలో మధ్యశిలాయుగం, నవీన శిలాయుగం సంధికాలానికిచెందిన రాతిచిత్రాలున్నాయి. ఈ చిత్రాశ్రయంలో చాలా అందంగా చిత్రించిన ఎరుపురంగు పెద్దకొమ్ముల అడవిదున్నల చిత్రాలు ఆధునిక చిత్రకారుల పెయింటింగ్సునే సవాలు చేసేంత గొప్పగా కళాత్మకంగా వున్నాయి. రెండడుగుల ఎత్తు, మూడడుగుల పొడవున్న ఈ చిత్రాలు తెలంగాణ పూర్వయుగచరిత్రకు కొత్తపేజీలు. ఈ రాతిచిత్రాల వెనక మలిగిపోయిన మరికొన్ని రాతిచిత్రాలు అగుపిస్తున్నాయి. వాటిలో కొన్ని నేలమీద పడివున్న మనుషుల బొమ్మలను పోలివున్నాయి.

ఇక్కడే కొన్ని రాతిపనిముట్లు లభించాయి. వాటిలో బూమరాంగు వంటి వంపుగల రాతిపనిముట్లు, పెచ్చురాళ్ళతో ఒకవైపు చెక్కిన గొడ్డళ్ళు, బొరిగెల వంటివి, రాతికత్తులు, మరొక నునుపైన రెండు వైపుల చెక్కిన రాతిగొడ్డలిముక్క (నవీనశిలా యుగానికి చెందినది)వున్నాయి.

రెండవ శిలాశ్రయం చాలా ముఖ్యమైనది ఎక్కువచిత్రాలు వేర్వేరుకాలాలలో ఒకదానిపై మరొకసారి గీసిన లేదా అధ్యారోపణంచేసిన (superimposed) రాతిచిత్రాలు చాలా వున్నాయి. ఒకచోట అందమైన మొదటి శిలాశ్రయంలోని అడవిదున్నలతో పోలికలున్న చిత్రణతో మూపురమున్న ద్విశూలం వంటి వంపు కొమ్ములతో ఒక ఎద్దు, దాని పక్కన గొప్ప చిత్రకారుని చేతిలో రూపుదిద్దుకున్న చిత్రం వంటి రెండెద్దులబొమ్మ, ఒక ఎద్దు ఎదురుగా మరొక ఎద్దు వాటి మూపురాలు కలిసివున్నాయి. తలలు, కొమ్ములు వ్యతిరేకదిశలో ఒకబొమ్మలో మరొక బొమ్మ సగం కలిసి అగుపిస్తుంటాయి. ఈ చిత్రమే దేవాలయాల్లో ఎద్దు, ఏనుగు తలలు కలిపి చెక్కే శిల్పాలకు మార్గదర్శకమా అనిపిస్తుంది. అదొక ప్రేమచిత్రంలెక్క కనిపిస్తుంది. వీటికి దగ్గరలో ఒక దుప్పిబొమ్మ చిత్రించిన తీరు మనోహరంగావుంది. ఈ పెద్ద చిత్రాల కాన్వాసులో మరొకచోట సన్నని గీతల ఏనుగు బొమ్మవుండడం విశేషం. మెదక్ జిల్లా అస్తలాపూర్ తర్వాత ఏనుగు కనిపించడం ఇక్కడే. చిత్రాల అంచులలో



గ్రూప్ డ్యాన్స్, జింక, ఏనుగు

అంతటా ఈటెలు, తాళ్ళవలలు ధరించిన వేటగాళ్ళబృందాలు కనిపిస్తున్నాయి. అవి కొంచెం ఎక్కువగా Fade అయి వున్నాయి. ఇంకొక చోట సామూహికనృత్యం చేస్తున్న ముగ్గురు ఆదిమానవుల దృశ్యం గొప్పచిత్రం. ఇదికూడా హస్తాల్పూర్ రాతిచిత్రాలలోని 3వరుసల సామూహికనృత్యాన్ని గుర్తుకు తెస్తుంది. వాళ్ళ పక్కన పడివున్న జంతుదేహాలు కనిపిస్తున్నాయి. వేటపండుగ కావచ్చు. ఈ కాన్వాస్ లోనే అందమైన నెమలిబొమ్మ చిత్రించబడి వుంది. తెలంగాణాలో నెమళ్ళ రాతిచిత్రాలు మెదక్ జిల్లాలోని కంచనపల్లిలో, రత్నాపూర్ రాతిచిత్రాలలోను, తర్వాత గుండ్ల పోచంపల్లిలో గుర్తించబడ్డాయి. ఈ రాతిచిత్రాలలో వేటదృశ్యంలో అడివిదున్నను వేటగాడు ఈటెవంటి ఆయుధంతో చంపుతున్న బొమ్మ ప్రత్యేకమైనది. ఇటువంటి టెర్రకోట ముద్ర మనకు హరప్పా-మొహంజోదారోలో కనిపిస్తుంది. ఈ రెండవ శిలాశ్రయం 20 అడుగుల ఎత్తులో వుంది. దాదాపు 16 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పైన ఈ చిత్రిత శిలాశ్రయం వడగరాయికింద ఇంటికప్పులెక్క రెండువైపుల వాలుతలంతో వుంది.



మూడో శిలాశ్రయంలో రాతి చిత్రాలన్నీ మాసిపోయివున్నాయి. పెద్దవి, పొడవైన కొమ్ములున్న మగజింక(ఇర్రి) వంటి జంతువు చిత్రించబడి వుంది. మరికొన్ని జింకలవంటి అస్పష్టచిత్రాలు అక్కడ అగుపిస్తున్నాయి. ఈ శిలాశ్రయం 30 అడుగుల ఎత్తులో వుంది. ఈ శిలాశ్రయం రాతిగుండ్లపేర్పుమీద పైరాతిగుండు పడిగెరాయి ఆవాసంగా వుంది. అడుగున రాతిగుండ్ల మధ్య ఖాళీగా, వర్షం సమయంలో, వేట సమయంలో దాచుకునే మంచిచోటుగా వుంది. ఈ చిత్రిత శిలాశ్రయంలో వున్నవి పది దాటని రాతిచిత్రాలే కాని, స్పష్టంగా కనిపించేది 1,2 ఇర్రులే. వాటి జననాంగాలు చిత్రించ బడడం చేత అవి మగజింకలని తెలుస్తున్నది. బొద్దుగీతలు, మొరటు బొమ్మలశైలి మనకు మధ్యరాతియుగం రాతిచిత్రాలలో, పాతరాతి యుగం అంతిమదశలో గీసిన రాతిచిత్రాలలో కనిపిస్తాయి. ఠాకూర్ రాజారాం సింగ్ నర్రా ఏశాలపల్లిలో బొద్దుగీతల్లో గంటుబొమ్మల్ని గుర్తించి అవి మధ్యరాతియుగం కాలంనాటివని నిర్ధారించాడు.

ఈ చిత్రిత శిలాశ్రయాలు మూడుయుగాల ప్రతినిధులు. మూడో శిలాశ్రయం ప్రాచీనశిలాయుగంలో అంతిమదశకు, మధ్యశిలా యుగానికి కూడా చెందినది. ఇక్కడి బొద్దుగీతల బొమ్మలు చాలా రఫ్ గా వున్నాయి. అంత ఎత్తున ఆదిమానవుల నివాసాలున్నది మధ్యశిలాయుగాలకు ముందటికాలంలోనే. దట్టమైన అడవిలో కూరజంతువుల నుండి రక్షణకై ఇంత ఎత్తులలో వుండడం సహజంగా మధ్యశిలాయుగంనాటి లక్షణం. రెండవ శిలాశ్రయంలోని బొమ్మలు రెండుతరాలకు చెందినవిగా అగుపిస్తున్నాయి. సన్ననిగీతల బొమ్మలు, వీటిలో ఆడవాళ్ళబొమ్మలు లేవు. వేట దృశ్యాలు వీటి ప్రత్యేకత. చాల్కోలిథిక్ పీరియడ్లో వేసిన బొమ్మల వలె జననేంద్రియాల చిత్రణ లేదు వీటిలో. వేసిన బొమ్మలమీదనే బొమ్మలు వేసి వున్నాయంటే తర, తరాలుగా ఆదివాసుల ఆవాసంగా ఈ ప్రదేశం వుండి వుంటుంది. రెండోతరం బొమ్మలన్నీ Fine Arts, కళాత్మకత వుట్టిపడుతున్నాయి. రెండెద్దుల బొమ్మలోని చిత్రకళానైపుణ్యం ఆది మానవుల ఈస్థటిక్సుని తెలియ చేస్తున్నది. రెండవ చిత్రిత శిలాశ్రయం మీద ఎన్నో పరిశోధనలు చేయవచ్చు.

మొదటి శిలాశ్రయం రాతిపనిముట్ల వల్ల మధ్యశిలా యుగానిదని, రాతిచిత్రాల వల్ల నవీనశిలాయుగానిదని తెలుస్తున్నది. ఒకేచోట ఆదిమానవుల సాంస్కృతిక వైభవాన్ని చూడగలగడం ఒక అద్భుతం, అపూర్వం.

**ఆధార సూచికలు:**


1. Annual Report - 1986-87. 1990. V.V. Krishna Sastry (ed.), Department of Archaeology and Museums, Govt. of Andhra Pradesh, Hyderabad.
2. CHANDRAMOULI, N. 1994. Rock Art of Andhra Pradesh-South India, Purakala 5 (1-2).
3. CHANDRAMOULI, N. 2003a. Rock Art of Andhra Pradesh, in M.L.K. Murthy (ed.) Pre and Proto Historic Andhra Pradeshup to 500 BC, vol.I (Comprehensive History of Andhra Pradesh Series), Orient Longman, Hyderabad.
4. CHANDRAMOULI, N. 2003b. Rock Art of Telangana, A Report of the minor research project (UGC unassigned grants) submitted to the School of History, Culture and Archaeol-



గ్రూప్ డ్యాన్స్, పోట్లాడుతున్న ఎద్దులు

ogy, PottiSreeramulu Telugu University, Srisailam, Andhra Pradesh, unpublished.

5. CHANDRAMOULI, N. 2012. Beginning of Cattle domestication in Andhra region: Perspectives of rock art and archaeology, Purakala 22.

6. CHANDRAMOULI, N. 2013.Rock Art of Andhra Pradesh A New Synthesis, Indira Gandhi National Centre for the Arts (Aryan Books International), New Delhi.

7. GNANESWAR RAO, KATTA, SRIRAMOJU HARAGOPAL, KATTA SRINIVASA RAO and VEMUGANTI MURALIKRISHNA 2017. Identification of Natural Pigments used in Rock Paintings from different Rock shelters in Telangana with portable Raman Spectroscope, a paper presented in 22nd Congress of The Rock Art Society of India (RASI) held at Deccan College Post Graduate and Research Institute, Pune from 26-28 October.

8. HARAGOPAL, SRIRAMOJU and VEMUGANTI MURALIKRISHNA 2018. A Rock Art Site at Ratnapur in Telangana, Purakala 27-28.

9. INDIAN ARCHAEOLOGY -- A REVIEW: 1959-60, 1963-64, 1964-65, 1967-68, 1973-74, 1974-75, 1975-76, 1976-77, 1977-78, 1983-84.

10. KESEV V. GENTELA, ARAVIND KUMAR and K. JOHN MILTON 2018. A Study of Rock Art Sites at Devarlamorey and Peerollaloddi in Lower Godavari Valley, Telangana, Purakala 27-28.

11. KRISHNA MURTHY, L. S. 1941. Geology of parts of Mahabubnagar and Gulbarga District, The Journal of Hyderabad Geological Survey 4 (1).

12. KRISHNA SASTRY, V. V. 1983. The Proto and Early Historical Cultures of Andhra Pradesh, Department of Archaeology and Museums, Govt. of Andhra Pradesh, Hyderabad.

13. MURALIKRISHNA, VEMUGANTI 2017. Rock Art in Vargal in Telangana State (in Telugu), a paper presented in 21stCongress of The Rock Art Society of India (RASI) held at Dept. of AIHC & Archaeology, Sri Venkateswara University, Tirupathi from 16-18 February.

14. NEUMAYER, ERWIN 1993. Lines on Stone: The Pre historic Rock Art of India, Manohar Publishers and Distributors, New Delhi.

15. NEUMAYER, ERWIN2011. Rock Art of India: The Pre-historic cave-Art of India, Oxford University Press, New Delhi.

16. REDDY, B. M. 2016. Discovery of the Rock Art sites in Andhra Pradesh and Telangana in 2015-16, Purakala26.

17. REDDY, B. M. 2018. Discovery of Rock Art sites in Telangana State reported during 2016-2017, Purakala27-28.

18. SAIKRISHNA, E.2017. New Rock Art findings in Gundla pochampally, Medchal District, Telangana, a paper presented in 22nd Congress of The Rock Art Society of India (RASI) held at Deccan College Post Graduate and Research Institute, Pune from 26-28 October.

-శ్రీరామోజు హరగోపాల్
m : 9949498698
e : akshara25@gmail.com

ద

## రచయితలకు :

- కథ, వ్యాసం రెండు రెండున్నర (ఎ4 సైజ్) పేజీలకు మించరాదు.
- కవిత 20-22 లైన్లు మించకూడదు.
- పుస్తక సమీక్షలు, విశ్లేషణలు రెండు పేజీలకు మించరాదు.
- రెండు కాపీలు విధిగా పంపాలి.
- ప్రతి రచయితా తమ రచనతో పాటు, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్, పోస్టల్ అడ్రస్ తప్పనిసరిగా ఇవ్వాలి.
- మ్యాటర్ టైప్ (డిటిపి) చేసి ఉంటే ఓపెన్ & పీడీఎఫ్ ఫైల్ పంపాలి.

## పాఠకులకు :

సామాజిక అంశాలు, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యావరణం, పర్యాటకం లాంటి అంశాలతో పాటు కథ, కవితలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, విశ్లేషణతో 'దక్కన్ ల్యాండ్' మీ చేతుల్లో ఉంది. ఇందులో ప్రచురితమైన రచనల పట్ల మీ అభిప్రాయాలను లేఖల రూపంలో తెలియ జేయగలరు.

చిరునామా :

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com



# ఆమెదే

ఊరు
ఏరు
మేల్కోకముందే
లేచి
ఇల్లూ వాకిలి ఊడ్చి
కల్లాపు చల్లి
ముగ్గులెట్టి
స్నానించి
ధవళ వస్త్రాలు ధరించి
పిలిస్తే
కొలిస్తే –
గగనతలం సంధించిన
తొలికిరణం ఆమెదే...

– కోటం చంద్రశేఖర్
m : 9492043348
e : kotamshekar111@gmail.com


## దక్కన్ ఎనిమిది సంవత్సరాల ప్రస్థానం...




తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2019 సెప్టెంబర్ సంచికతో 85 నెలలు పూర్తిచేసుకుంది. ఈ ఏడు సంవత్సరాల కాలంలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తిచేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' కృషి చేసింది. ఇప్పటి వరకు వెలువడిన సంచికలను 12 నెలలకు ఒక సంపుటిగా (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో వచ్చే సంచికలను కూడా ఇదేవిధంగా తీసుకువస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తికలవారు ఒక్కో సంపుటిని రూ.400/-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం). 'ఐఎస్ఎస్ఎన్' ఆమోదం పొందిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక పట్ల చూపుతున్న ఆదరణకు ధన్యవాదాలు.




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288

Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAKMAHINDRABANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007




# సుస్థిరమైన సమాజ అభివృద్ధిలో సాహిత్యం, కళల కీలక పాత్ర

- **సినిమాలు నిజజీవితాన్ని ప్రతిబింబించాలి - ప్రముఖ సినీ దర్శకులు ఆదూర్ గోపాలకృష్ణన్**
- **ఘనంగా ముగిసిన హైదరాబాద్ సాహితీ ఉత్సవాలు**
- **ఆకట్టుకున్న సృజనాత్మక కళారూపాలు, చర్చలు, ప్రదర్శనలు**

సుస్థిరమైన సమాజ నిర్మాణం కోసం సాహిత్యం, కళలు, సంస్కృతి, వారసత్వ సమ్మేళనాలు, కళాత్మకమైన ఉత్సవాలు కీలకపాత్ర పోషిస్తాయి. హైదరాబాద్ సాహితీ ఉత్సవం 2020, జనవరి 24 నుండి 26 వరకు మూడు రోజులపాటు విద్యారణ్య పాఠశాలలో ఘనంగా జరిగింది. విద్యార్థులు, కవులు,చిత్రకారులు, రచయితలు, సినీ కళాకారులు, విద్యావేత్తలు, సాహితీవేత్తలు, సామాజికవేత్తలను ఒకే వేదికమీదకి తీసుకు వచ్చి ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేసి వినూత్న ప్రపంచాన్ని సృష్టించాలనే ప్రయత్నం అపూర్వం. గత పదేండ్ల నుండి ఈ ఉత్సవాల్లో వర్క్‌షాపులు, సంభాషణలు, ప్యానెల్ చర్చలు, రీడింగులు, పుస్తక ప్రదర్శనలు ద్వారా సాహితీకారులకు కొత్త అనుభూతిని కలిగించేలా కృషి చేస్తుంది. సమాజాన్ని సుసంపన్నం చేయాలంటే ఇలాంటి సాహిత్య పండుగలు ఎంతో అవసరం.



**క్రియేటివ్ రైటింగ్స్, సైన్స్ అండ్ టెక్నాలజీలపై చర్చలు :**

హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్ 2010లో ఆవిర్భవించింది. విభిన్న కోణాలకు చెందిన సాహిత్యం, కళారూపాలు, అకడమిక్, క్రియేటివ్ రైటింగ్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సమకాలీన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలు, వాటిపై చర్చాగోష్టులు, సదస్సులు, పుస్తకావిష్కరణలు.. ఇలా వేటికవే ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాహితీ పండుగ భావప్రకటన స్వేచ్ఛకు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా చర్చలు, సంభాషణలు, ప్యానెల్ చర్చలు, వర్క్‌షాపులు, పుస్తక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

**సాహిత్య అధ్యయన వేదిక :**

నూతన సమాజ ఆవిష్కరణకు కళలు, సాహిత్యం, సంస్కృతి ప్రధానపాత్ర పోషిస్తాయి. అన్ని రకాల కళలు, సాహిత్యం, సంస్కృతి, వారసత్వానికి ఒక వేదికను ఏర్పాటు చేసి సమాజంలో భావ చైతన్యవ్యాప్తిని ప్రోత్సహిస్తుంది. అందరికీ సమాన అవకాశాలు కల్పించి, తోటి వారిని ఆదరించాలి. లైంగిక వేధింపులు ఏ స్థాయిలో ఉన్నా దానిపై చర్చ జరగాలి. పర్యావరణ అనుకూలతల వైపు అడుగులు వేయాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు వస్తు సామాగ్రిని పునర్వినియోగం, రీ సైకిల్ యొక్క విశ్వసనీయతను అమలు చేసేలా హెచ్ఎల్ఎఫ్ చైతన్య పరుస్తుంది. ఈ 2020 ఫెస్ట్‌లో ఆస్ట్రేలియా ఆతిథ్య దేశంగా హైదరాబాద్ రావడం గర్వకారణం. ఆ దేశం నుండి వివిధ రంగాలకు చెందిన 13 మంది నిపుణులు హాజరయ్యారు. దేశీయ స్థాయిలో ఈసారి మలయాళ సాహిత్య రంగం నుంచి కవులు, రచయితలు, కళాకారులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. సాహిత్యం, కళలు, సంస్కృతిపై లోతైన అధ్యయనం చేయడమే ధ్యేయంగా లిట్ ఫెస్టివల్ పనిచేస్తుంది.

**ఆకట్టుకున్న పిల్లల సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు :**

యంగిస్తాన్ నుక్కడ్ బృందం హైదరాబాద్ సాహితీ ఉత్సవాల ప్రాంగణంలో కొత్త ఉత్సాహం తీసుకొచ్చింది. నిర్విరామంగా సాహిత్య, సంగీత ప్రదర్శనలతో ఉద్రూతలూగించారు. ఉత్సవాల్లో భాగంగా ఒకవైపు చర్చలు జరుగుతుండగా మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా పిల్లల కథలు అమితంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ కథకులు కోయిలీ ముఖర్జీ క్రక్స్ పేరిట ఔత్సాహికులకు కథలు చెప్పారు. ప్రముఖ స్టోరీ టెల్లింగ్ సంస్థ భూమిక బృందం గరికపాటి ఉదయభాను, విద్యాసాగర్, హరీత్ చిలువేరు, ప్రియాంక పుంటంబేకర్, రావన్‌లు పిల్లల కోసం చెప్పిన సాహసాల కథలు ఎంతో ఆకట్టుకున్నాయి. బాలలకు శాస్త్రీయ అంశాలపై అవగాహనను రోహిణి చింత కథలు ద్వారా కల్పించారు. ప్రముఖ దర్శకుడు, మలయాళ రచయిత అదూర్ గోపాలకృష్ణ రూపొందించిన చిత్రాలను ప్రదర్శించారు. సామాజిక సమస్యలపై నిర్మించిన చిత్రాలు, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్న పలు చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



**దేశవిదేశాల నుండి హాజరైన సాహితీ ప్రేమికులు :**

దేశ విదేశాల నుండి సాహితీ ప్రేమికులు సాహిత్య ఉత్సవానికి వేలాది మంది హాజరయ్యారు. ఈసారి మలయాళ సాహిత్యరంగం నుండి కవులు, కళాకారులు ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. వివిధ రంగాల నిపుణులు ప్రదర్శనలతో ఔత్సాహికులను ఆకట్టుకున్నారు. పలువురు ప్రముఖ కథకులు పురాణ, నిజజీవిత కథలతో స్ఫూర్తి నింపారు. నగరంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు యంగిస్తాన్ నుక్కడ్ వేదిక మీద నృత్యాలు, పాటలతో అలరించారు. దేశవ్యాప్తంగా 11 ప్రదేశాల్లో సాహితీ ఉత్సవాలు జరుగుతుండగా హైదరాబాద్‌లో ఇతర ప్రాంతాలకు భిన్నంగా సాహిత్యంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారు. అన్ని రకాల కళాకారులు తమ కళలను ఇక్కడ ప్రదర్శించడం ప్రత్యేకమనే చెప్పాలి. కథా రచనలు, కార్యశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంగణం సందడిగా కనిపించింది.



**సినిమాలు నిజ జీవితాలను ప్రతిబింబించాలి : ప్రారంభోత్సవ సభలో దాదాసాహేబ్ పాల్కే అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకుడు అదూర్ గోపాలకృష్ణన్**

ప్రజల నిజ జీవితాలను ప్రతిబింబించేలా నేటి సినిమాలు రావాలని ప్రముఖ సినీ దర్శకుడు అదూర్ గోపాలకృష్ణన్ అన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై.. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లోకి తొంగి చూసి అద్భుత చిత్రాలు నిర్మించాలన్నారు. మలయాళం సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు ఉన్నాయని, వాటి గురించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఔత్సాహికులకు తెలియజేయాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ (చెన్నై) సుసాన్ మాట్లాడుతూ భారత్‌లో ఉన్న గ్రంథప్రియులు మరే దేశంలో లేరన్నారు. తెలంగాణ సాంస్కృతిక, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ వివిధ కోణాల్లో కళలు, కథలు వస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ సాహితీ ఉత్సవం తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని ఇనుమడింప జేసిందన్నారు.

తెలంగాణ సాహిత్యం – అనువాదం సెషన్‌లో తెలంగాణ భాష సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రముఖ అనువాదకులు దామోదర్‌రావు, కవి ఎలనాగ విశిష్ట ప్రసంగాలు చేశారు. పురాణాల్లో సీత పాత్ర గురించి జరిగిన సెషన్‌లో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ప్రసంగించారు. కవి సమ్మేళనాల్లో డా.ఎన్.గోపి, వసంత కన్నభిరాన్, కవి యాకుబ్ తదితరులు ఇతర భాషా కవులతో కలిపి తమ కవితలు వినిపించారు. గిరీష్ కర్నాడ్ రాసిన నాటకంలోని కొన్ని సన్నివేశాలను సినీనటులు శంకర్ మేల్కొటే, వందనాచక్రవర్తి తదితరులు ప్రదర్శించారు. దీనికి అనూహ్య స్పందన కనిపించింది.

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్, దక్కన్‌ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులతో వివిధ అంశాలపై తమ భావాలను పంచుకున్నారు.

ఈ మూడు రోజులు ఆక్స్‌ఫర్డ్ గ్రామర్‌స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ మూడు రోజుల సాహిత్య పండుగ తెలంగాణ సంస్కృతిలో ఒక భాగంగా నిలిచింది.

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com

## పాటమ్మను విడువక ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న

# పదాలకొండ దేవరకొండ బిక్షపతి పాట

కూలినాలి చేసుకొని బతికే కష్టజీవుల కుటుంబంలో ఉద్భవించిన పాట. ప్రజా కవుల అడుగుజాడల్లో పయనించిన పాట. కడుపుల పేగులు మాడినా, కాలికి బలపం కట్టుకొని పల్లవించిన పాట. నిర్బంధాల్ని, జైలుగోడల్ని లెక్కచేయని పాట. ఉద్యమానికి ఊపిరూదిన పోరుపాట. స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా ధూంధాం చేసిన పాట. తెలంగాణ గుండెల్లో మోగిన పాట. గుండెల్ని పిండిన పాట. అది పాటమ్మ బిడ్డ భిక్షపతి పాట. తెలంగాణ ప్రజా ఉద్యమాన్ని ఉగ్రూతలూగించిన ప్రజాకవి, గాయకుడు దేవరకొండ బిక్షపతి గురించి నేటి మన అలుగెల్లిన పాటలో..

మహబూబ్‌బాద్ జిల్లాలోని బయ్యారంలో కూలినాలి చేసుకుంటూ బతికే దేవరకొండ వెంకన్న-సత్తెమ్మ దంపతులకు రెండవ సంతానంగా 1976-78 ప్రాంతంలో జన్మించిన భిక్షపతి స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం మొదలు పెట్టి హాస్టల్లో ఉండి హైస్కూల్‌లో చేరినప్పటికీ పేదరికం కారణంగా పెద్ద చదువులు చదివే అవకాశం లేకుండా పోయింది. పెద్దగా చదివించక పోయినప్పటికీ చుట్టూ ఉన్న అడవి వాళ్ళకు అన్నీ నేర్పించింది. చిన్నప్పటి నుంచి అన్నల మాటలు, పాటలు విన్న భిక్షపతి సమాజాన్ని అవగాహన చేసుకుండు.



"ఊరు మనదిరా ఈ వాడ మనదిరా" అనే పాట పాడుకుంటూ బయ్యారం వచ్చిన జయరాజు, నాగన్నలను చూసి పాట వైపు ఆకర్శితుడయ్యిండు. భూస్వాముల, పెత్తందారుల గుండెల్లో గుబులు పుట్టించిన ఈ పాటే బిక్షపతిలో సాహిత్య బీజాలను నాటింది. అన్నలు పాడే పాటల్లోని సారాన్ని పట్టుకుండు. గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజుల పాటలను రోజుల తరబడి విని కాలం గడిపిండు. పదాలను పొందిచ్చి పాటలల్లిండు. పల్లెతల్లిని మరువలేనని బిక్షపతి రాసుకున్న ఒక పాట చివరలో

"కళాకారులను కన్నతల్లి ఖమ్మం జిల్లా/ విప్లవాల పోరుగడ్డ ఇల్లందు

పక్కనే మా ఊరు బయ్యారం / ఒక్కతే అక్కడెట్ల ఉన్నదో

ఒక్కసారి మా ఊరికి పోయిరావాలెరా"

అంటూ బయ్యారాన్ని తల్సుకుంటడు. ఊరు పట్ల తనకున్న అవ్యాజమైన ప్రేమను ప్రకటిస్తడు. విప్లవోద్యమాన్ని కలగంటడు. ఎప్పటికీ విప్లవమే జయిస్తదని అంటడు. క్రమంగా ప్రజా ఉద్యమానికి చేరువై విప్లవోద్యమ భావజాలంతో పాటలు రాసిండు. జయరాజుతో పెరిగిన సాన్నిహిత్యంతో బిక్షపతి పాట మరింత పదునుదేలింది.

"అమ్మా నన్ను అమ్మకే ఓయమ్మా.. నాన్నా నీకు దండమే..

నవమాసాలు నన్ను మోసినవమ్మా పురిటినొప్పుల బాధ పడ్డావమ్మా

పేగు తెంచుకు నన్ను కన్నావమ్మా పేరు పెట్టకముందే వేరు చేయాకమ్మా

నిన్ను విడిచి ఉండలేనమ్మా ఓయమ్మా నన్ను దూరం జేయబోకమ్మా.." అంటూ బిడ్డల్ని అమ్ముకునే తెలంగాణ దుస్థితిని అక్షరీకరిస్తడు. పదాలతో కన్నీరు బెట్టిస్తడు. సాధారణ వాడుక పదాలతో సులభశైలితో రాసిన ఈ పాట బిక్షపతిలోని ఆర్తిని, సామాజిక చైతన్యాన్ని బయటి ప్రపంచానికి పరిచయం చేసింది. మరో పాటలో స్వతంత్ర దేశంలోని అసమానతలను కడిగి పారేస్తడు. కుల మతాల హెచ్చు తగ్గులను గురించి జ్ఞానాన్ని పెంచుతడు. రాజ్యాంగబద్ధంగ ప్రజలకు దక్కవలసిన హక్కులను సాధించు కోవడం కోసం పోరాటమే శరణ్యమని పల్లెలను చైతన్య పరుస్తడు. "ఊరు ఊరు కదులుతుందిరా హక్కులకై / ఒక్కటిగా పల్లె పల్లె పయనమాయెరా" అంటూ తరతరాలుగా గోసబడుతున్న పల్లెల్ని కదిలిస్తడు. అనాదిగా భూములు అగ్రవర్ణాల చేతుల్లోనే ఉన్నయని, కుల మతాల కుమ్ములాటల్లోనే దళిత బహుజనుల బతుకులు తెల్లారిపోతున్నయని గొంతెత్తి గానం చేస్తడు. విప్లవోద్యమంతో మొదలైన దేవరకొండ బిక్షపతి పాటల ప్రస్థానం ఎన్నో నిర్బంధాలను చవిచూసింది. రాజ్యహింసను భరించింది.

"కొడుకా నా ముద్దు కొడుకా కొడుకా నా చిన్ని కొడుకా

ఎక్కడా బోతివిరా నేనొక్కదాన్నయితినిరా

అన్నల్లో కలిసిపోయే కొడుకు అదృష్టమందరికి రాదు

అన్యాయాన్నెదిరించినట్టి నాటి అమరుల బాటల నడువు

అమరుడు పెద్దన్న బందూకు అందుకోని ముందుకురుకు

నీకు బరువైతే చెప్పు కొడుకా నా బలమిస్తా పట్టు కొడుకా"

అంటూ పాట చివరలో రాసిన పదాలు చూస్తే బిక్షపతి తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఎంత బలంగా నమ్మిండో అర్థమైతది. అన్నల పోరాటానికి అమ్మల తోడ్పాటు ఎట్లుంటదో అక్షరీకరిస్తడు.

"ఓ వెలిగే వెన్నెలమ్మ చల్లాని జాబిలమ్మా / తెల్లాని మల్లేలమ్మ విరబూసిన జాజీకొమ్మ

నా కొడుకు యాడన్న కనిపించిండా/ నేననుకొని నీ ఒడిలో నిదరోయిండా” అంటూ గుండెల్ని పిండుతడు. కన్నపేగును కదిలిస్తడు. బిక్షపతి పాల్వంచకు చెందిన ప్రేమ్‌జిత్తును పెండ్లి చేసుకొని ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చిండు. బిక్షపతి తాను రాసిన ఒక ఆరు పాటలను తీసుకొని ‘గుండెల్లో పాట’గా రూపొందించి, గద్దర్‌తో ఆవిష్కరించిండు. గద్దర్ ముందుమాటతో వచ్చిన ఈ పాటల సి.డి. అత్యంత ప్రజాదరణ పొందింది. నిజానికి బిక్షపతి రాసిన ఎన్నో పాటలకు ప్రాణం పోసిన అశ్వని ఆయన మేనకోడలే. అశ్వని గొంతులో పాట అలలు అలలైతది. మనకు తెలువకుండనే హృదయం ద్రవిస్తది.

*“నిన్ను విడిచి ఉండలేనమ్మా ఓ పాటమ్మా*
*ఎన్నడు మరిచిపోనమ్మో నా పాటమ్మా*
*ప్రతి మదిలోన మొదలుతుంటవో పాటమ్మా*
*నా ఎదలోన పదిలంగుటవో పాటమ్మా”* అంటూ పాటెమ్మటే తిరుగతడు. అసహాయులకు ఆయుధమై, ఉద్యమ చైతన్యాన్ని రగిలిస్తడు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రాణప్రదమై నిలిచింది. నిజానికి తెలంగాణ ఉద్యమంలో ఎవరు ఏ పిలుపునిచ్చినా పాటే ముందు వరుసలో నిలబడ్డది. ఆ పాటలను మారుమూల తీసుకొని పోయే కళాకారుల జీవన చిత్రాన్ని కైగట్టిన బిక్షపతి పాట పాడని కళాకారుడు లేడు.



పాట గొప్పతనాన్ని, కళాకారుల త్యాగాన్ని, బైరాగి తత్వాన్ని గానం చేస్తడు. ఉద్యమం ఉధృతంగా నడుస్తున్న కాలంలో ఎన్నో పాటల్ని అప్పటికప్పుడు అశువుగా కైగట్టిన సందర్భాలు ఉన్నయి.

*“పల్లెతల్లిని మరిచిపోయి ఉండలేకపోతిరన్నా / నేనెక్కడున్నా నా పల్లె నల్లగుండాలిరన్నా*
*పాడిపంటలు సల్లగుండాలని యాడిదికోపాలి / ఆడిబిడ్డల పిలిసి ఊరువాడ వనభోజనం బోనీకె*
*దప్పు నారాయణతో సాటింపు వేసేది”* ఈ పాటలో కులవృత్తులు అడుగంటిపోతున్న వైనాన్ని, పల్లెల్లోని ఆత్మీయతలను వరుసబెట్టి చెప్పుకొస్తడు. బిక్షపతి ఏనాడు పాటను అమ్ముకోలేదు. బతికినంత కాలం పాటనే నమ్ముకొని, నీతి నియమాలకు కట్టుబడి నైతికంగ బతికిండు. సమైక్యపాలకుల నుంచి అనేక అవకాశాలు వచ్చినప్పటికి అడ్డగోలు పాటలు రాసి సంపాదించింది లేదు. ఉద్యమానికి ఊతమిచ్చి పాటను బతికించడమే పనిగా పెట్టుకున్నడు తప్ప ఉద్యమానికి తల పెట్టలేదు. ఇంటికింత తిన్నడు, లేనినాడు పస్తులున్నడు. ప్రజలమధ్యనే జీవించిండు. గుండెల్లో పాటతో పాటమ్మ తనకంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్నడు. పల్లెపల్లెకు వ్యాపించి, తెలంగాణ ద్రోహుల మీద దుమ్మెత్తిపోస్తడు.

రాష్ట్రం కోసం వేలాదిగా అసువులు బాస్తున్న అమరవీరులను గద్దెను ధిక్కరిస్తడు. దీనంగా అర్థిస్తడు. శాపనార్థాలతో శాసిస్తడు. ఇట్ల అనేక విధాలుగా తెలంగాణ చైతన్యాన్ని, అమాయకత్వాన్ని, త్యాగాన్ని గానం చేసిన బిక్షపతి పాట

*“తెలంగాణ వల్లేలల్ల లొల్లి లేసెరా / వలసవాదులకు ఒల్లు జల్లుమనేరా*
*సస్తెనే ఇస్తనంటే చెప్పవమ్మ సోనియమ్మ / ఒరిగిన వీరులకన్న ఎక్కువేమి గాదమ్మా*
*ఎంతమందిమి జస్తె ఇస్తవో లెక్కజెప్పు / మా ఉసురు దగిలి నాశనమయ్యిపోతవో...”* అంటూ ఆనాడు నల్లగొండ జిల్లా తిప్పర్తి సభలో పాడినప్పుడు హరీశ్‌రావు కంట కన్నీరు బెట్టిండు. పాట కవులు, కళాకారుల పదునైన పదాలను చూసి పొంగిపోయిండు. పాటలే ప్రజా ఉద్యమాన్ని సజీవం చేస్తున్నయని తన మాటల్లో చెప్పిండు. బిక్షపతి పాటల్లోని పదునైన భావాన్ని గుర్తుచేసిండు. ఇట్ల ఎందరో ప్రముఖుల్ని, పామరుల్ని మెప్పించి ఒప్పించిన పదాలే బిక్షపతి పాటలు. సందర్భానుసారం ఎన్నో విలువైన పాటల్ని అందించిన ప్రజాకవి, గాయకుడు రాష్ట్ర ఆవిర్భావంతో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ సాంస్కృతిక సారథిలో సభ్యుడై ఉద్యోగాన్ని సాధించిండు. అయితే ఆ ఆనందం ఎంతో కాలం నిలువలేదు. అనతికాలంలో భిక్షపతి అనారోగ్యానికి గురయ్యిండు. ఎట్లాంటి సందర్భంలో రాసుకుండో తెలువదు గాని, బిక్షపతి రాసుకున్న

*“ఉద్యోగం చేస్తానంటివిరో బిచ్చయ్య / ముద్దుగ నను జూస్తానంటివిరో బిచ్చయ్య*
*ఉద్యోగం ఏమో గాని బిచ్చయ్య / మద్దెల నన్నాగం జెయ్యకురో..”* పాటే నిజమైంది. జీవితం సగంలో ఆగమైంది. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా 2015 సెప్టెంబర్ 3న పాటమ్మ బిక్షపతి చనిపోయిండు. కొడుకు మీద బెంగతో గుండెలు పగిలేలా ఏడ్చిన బిక్షపతి తండ్రి కూడ దినాల రోజునే సెప్టెంబర్ 11న కుప్పకూలి పోయిండు. ఒకేసారి తండ్రి కొడుకులు మరణించడంతో ఆ కుటుంబం దిక్కులేనిదయ్యింది. భర్తను పోగొట్టుకున్న భార్య, కొడుకును పోగొట్టుకున్న తల్లి, తండ్రి లేని పిల్లలు అన్నట్లు బిక్షపతి కుటుంబం చిన్నాభిన్నమైంది. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ చొరవతో సారథి కళాకారులు రెండు లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందజేసిండ్రు. ఇది కొంత వరకు ఉపశమనం కలిగించినప్పటికి పాటమ్మ బిక్షపతి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుతం భిక్షపతి కొడుకు రచన్‌కుమార్ 10వ తరగతి, బిడ్డ దివిజ 7వ తరగతి చదువుతున్నరు. వీళ్ళకు ఓ దారి చూపించి, ఆ కుటుంబానికి తగిన ప్రభుత్వ తోడ్పాటు కావాలని తల్లి సత్తెమ్మ వేడుకుంటున్నది. పాటను కన్న ఆ తల్లి ఆవేదన తీరాలని కోరుకుందాం.

**-అంబటి వేకువ,**
m: 94927 55448
e: varji.ambati@gmail.com

# మిల్లెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ

తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా ఝరా సంగం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన రైతు వీర్ శెట్టి బిరాదర్. ఆయన గ్రాడ్యుయేట్. 13 ఎకరాల మెట్ట, 5 ఎకరాల మాగాణి ఉంది. చెరకు, కందిపప్పు, శనగలు, జొన్న, సజ్జ, కొర్ర, రాగి లాంటి పంటలు పండించే వారు.



ఒకప్పుడు ఆయన మహారాష్ట్రలో ప్రయాణిస్తుండగా, ఓసారి తినేందుకు ఆహారం ఏమీ దొరక లేదు. దాంతో ఆకలిబాధకు గురయ్యారు. ఇక అప్పుడే ఆయనకు ఆహారపంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. మహారాష్ట్ర నుంచి తిరిగిరాగానే భవిష్యత్తు తరాలకు ఆహార పంటలను అందించాలని సంకల్పిం చారు.

అలా ఆయన చిరుధాన్యాలను పండించడం ప్రారంభించారు. ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.ఎల్. పేరిట విలువ జో డించబడిన చిరుధాన్యాల ఉత్పాదనల కేంద్రాన్ని ప్రారంభించారు. ఏడేళ్ళ వ్యవధిలోనే ఆయన కంపెనీ జొన్న, సజ్జ, కొర్రలాంటి చిరుధాన్యాల నుంచి 60 విలువ జోడించిబడిన ఉత్పాదన లను అభివృద్ధి చేసింది.

ఏటా జూన్-జూలై నుంచి ఆయన సాగు ప్రారంభమవుతుంది. చిరుధాన్యాల్లో మంచి దిగుబడులు సాధించారు. (ఎకరానికి కొర్రలు 3 నుంచి 3.5 క్వింటాళ్ళు, సజ్జ 4-5 క్వింటాళ్లు, జొన్న 4-5 క్వింటాళ్లు, రాగులు 4-5 క్వింటాళ్లు). తక్కువ వర్షపాతం ఉన్న సందర్భాల్లోనూ సరైన యాజమాన్య విధానాలతో అధిక దిగుబడులను సాధించేవారు.

చిరుధాన్యాలను సూపర్ ఫుడ్స్‌గా అభివర్ణిస్తారు వీర్‌శెట్టి బిరాదార్. అందుకు ప్రధాన కారణం పక్షులబెడద మినహాయిస్తే, తెగుళ్ళు, వ్యాధులు వచ్చే అవకాశం




గౌడ, ఎంఎస్ఎస్ఆర్ ఎఫ్ (ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, జేపూర్,ఒడిషా) డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. రవీంద్రరెడ్డిల సాంకేతిక మార్గదర్శకత్వంలో విలువ జోడించబడిన చిరుధాన్యాల ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించారు.

విలువ జోడించబడిన చిరుధాన్యాల ఉత్పత్తుల రంగంలోకి ఆయన ప్రవేశించేందుకు మరో కారణం పట్టణ జనాభాలో జీవనశైలి వ్యాధులు పెరిగిపోవడం, యువతలో జంక్ ఫుడ్ విని యోగం అధికం కావడం. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ఆయన 2009లో హైదరాబాద్ చందానగర్‌లోని హుడా కాలనీలో ఎస్ఎస్ భవానీ ఫుడ్స్ ప్రై.లి. తక్కువ. రైతు, జవాను దేశానికి రెండు కళ్లలాంటివారని ఆ యన విశ్వసిస్తారు. రైతులను దృష్టిలో ఉంచు కొని ఆయన స్వయం శక్తి (హుడా కాలనీ, చందానగర్, హైదరాబాద్) అనే ఎన్జీఓను స్థా పించారు. సంగారెడ్డి జిల్లాలోని 8 గ్రామాల్లోని 1000 మంది రైతులకు ఇది తన సేవలను అందిస్తోంది. రైతులకు సకాలంలో వారికి అవసరమైన సమాచారాన్ని ఇది అందిస్తుంది. నూతన సాంకేతికతలను రైతుల గడప ముంగి ట్లోకి తీసుకెళ్తుంది.

హైదరాబాద్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిలెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) నుంచి ఆయన మిలెట్స్ ప్రాసెసింగ్, రకరకాల

యంత్రాలకు సంబంధించి సాంకేతిక మార్గదర్శక త్వం పొందారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రి కల్చరల్ రీసెర్చ్ (ఐసిఏఆర్) ప్రాజెక్ట్ ఫార్మర్ ఫస్ట్‌లో ఆయన ఐఐఎంఆర్‌తో కలిసి పని చేస్తున్నారు. 2017లో ఆయన మరో షాప్ ను కూడా ప్రారంభించారు. 'అండర్ యుటిలైజ్డ్ క్రాప్స్ ఫర్ న్యూట్రిషనల్ సెక్యూరిటీ' పేరిట ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ (జేపూర్, ఒడిషా) లో జరి గిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఒడిషా లోని రైతులకు కూడా ఆయన తన సహకారాన్ని అందించారు.

ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఒ క్కరికి కూడా ఏడాది పొడుగునా విలువ జో డించిన చిరుధాన్యాల ఉత్పత్తులు అందు బాటులో ఉం డాలని ఆ యన విశ్వసిస్తారు. చిరు ధాన్యాల ఆధారిత విలువ జోడించిన ఉత్పాదనలను అభివృద్ధి చేయడంలో ఆ యన ఎన్నో కష్టాలను ఎదు ర్కొన్నారు. పండ్లు ఉన్న చె ట్టుకే రాళ్ళ దెబ్బలు అనే సూ క్తిని గుర్తు చేసుకుంటారు ఆయన. ప్రస్తుతం ఆయన తన ప్రై. కంపెనీ నుంచి నెలకు రూ. లక్ష దాకా ఆదా యాన్ని పొందుతున్నారు.

చిరుధాన్యాల రంగంలో విలువ జోడించిన ఉత్పాదనల విభాగంలో చేసిన కృషికి గాను బిరాదర్ ఎన్నో అవార్డులు కూడా పొందారు. ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్, జేపూర్, ఒడిషా) నుంచి 2017లో ఆయన 'బెస్ట్ ఫార్మర్ అవార్డ్' ను పొందారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏ యూ) నుంచి 2017లో డాక్టర్ ఎం.వి.రావ్ మెమోరియల్ అవార్డ్ ను పొందారు. ఇండి యన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐ ఐఎంఆర్, హైదరాబాద్) నుంచి బెస్ట్ మిల్లెట్ మిషరయ్య అవార్డును పొందారు.

**– డాక్టర్ ముత్తన్న,** సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్),
**డాక్టర్ రవి నంది,** ప్రోగ్రామ్ మేనేజర్ (ఎఫ్‌టిఎఫ్ -ఐటిటి),
**షకీరా ప్రవీణ్,** ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్, (ఎఫ్‌టిఎఫ్ -ఐటిటి),
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్
(మేనేజ్), రాజేంద్ర నగర్, హైదరాబాద్ – 500030,
తెలంగాణ

(ఇన్‌స్పైరింగ్ స్టోరీస్ ఫ్రమ్ ఇన్నోవేటివ్ ఫార్మర్స్ – మేనేజ్)



# తెలిమిన్నపాట అనే వజ్రగీతం

వరువాత గట్లను ముట్టాలనే వేకువ తపనను
అర్థం చేసుకోకపోతే ఎట్లా
చీకటి సుడిగుండంలో చిక్కుకున్న శీతగాలిని
తెగ్గొట్టుకోకతప్పదుజి
దృశ్యాన్ని చూస్తున్న కళ్ళు
బుద్ధిని కోల్పోతే ఇంకేమున్నావుందా
వీస్తోంది కదా అని గాలిని
అసలు వడగట్టకపోతే మరణాన్ని పీలుస్తున్నట్లే
వెలుతురు ఎంత ఏకధాటిగా కాస్తున్నా
ఎక్కడన్న చీకటి మరకలున్నాయేమో చూసుకోవాలి
కదా
నిఘంటువులోదే కదా శబ్దం అని
పుటం పెట్టకుండావాడితే
అర్థం... నెప్పులు పడేదేప్పుడూ...? అన్వయం
పురుడు పోసుకునేదేప్పుడూ....?
నిన్ను పడద్రోసే వాంఛా గర్తం
ఊరిస్తూనేవుంటుంది
నువ్వుకోరుకునే చంక మలుపు అంకపాళి
మధుకరుడులా మోహరిస్తూనేవుంటుంది
మన భ్రమే మన మనసుకు
ఉద్యమాల ఉద్యోగం- గిల్లుకోవాలి
మన నడకే మన గమ్యానికి
లక్ష్య సాధనం- అల్లుకోవాలి
అమృత కలశం వంటి
మబ్బుకూజాను ఆకాశం దాచుకున్నట్టు
నైతికాంశం విడమరిచే
ప్రాకృతిక ధర్మాన్ని పరిరక్షించుకోవాలి
ఎలాగోలా బ్రతకటంవేరు
తూర్పులో తొగరులా బ్రతకటంవేరు
తొలి వెలుతురు సంపుటిలోనే
తెలిమిన్నపాట అనే వజ్రగీతం.

– సాంధ్యశ్రీ
m : 8106897404



# బాలల్లో చైతన్యం పెంపొందించే బాధ్యత పెద్దలదే..

- ప్రముఖ రచయిత, కాళోజీ సాహిత్య ప్రథమ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్
- బుక్ ఫెయిర్‌లో 22వ బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమం
- 60 మంది రచయితలు హాజరు

బాలల్లో దాగియున్న సృజనాత్మకతను వెలికితీసి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం కోసం చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి పిల్లల వికాస పత్రిక విశేషమైన కృషి చేస్తోంది. పిల్లలకు వైవిధ్యమైన విజ్ఞానాన్ని అందించేందుకు ప్రతి నెల రెండవ శనివారం 'బాలచెలిమి ముచ్చట్లు' కార్యక్రమాన్ని కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, బాలసాహివేత్తలతో నిర్వహిస్తుంది. ఇప్పటి వరకు 21 బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. హైదరాబాద్ రాజధాని ప్రాంతంలోనే కాకుండా వివిధ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిర్వహిస్తుంది. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో డిసెంబర్ 30న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని నోముల సత్యనారాయణ వేదికలో 'బాల చెలిమి 22వ ముచ్చట్లు' కార్యక్రమంలో భాగంగా 'బాలమేళలో బాలసాహిత్యకారుల సమ్మేళనం' అనే అంశంపై సదస్సు జరిగింది. నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్ పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జూలూరీ గౌరీశంకర్, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత అమ్మంగి వేణుగోపాల్, విశిష్ట అతిథిగా చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్, బాలసాహితీవేత్తలు పాల్గొన్నారు.

**పిల్లలు అల్లరి చేయడం మరిచిపోతున్నారు : కాళోజీ మొదటి పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్**

గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత, కాళోజీ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్‌గారు మాట్లాడుతూ యం. వేదకుమార్ గారు ఎంతో పట్టుదలతో బాల సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. బాలల్లో చైతన్యం మనమే పెంపొందించాలి. సమాజంలో బాగా నిర్లక్ష్యం చేయబడుతున్న బాల్యాన్ని గొప్పగా తీర్చిదిద్దవలసిన అవసర మెంతైనా ఉందన్నారు. పిల్లలు క్రమశిక్షణ పేరుతో వారి సహజ స్వభావం అల్లరి చేయడాన్ని మరచిపోతున్నారని, పదిమందిలో కలిసి మెలిసి వుండే తత్వాన్ని కోల్పోతున్నారని అది సరికాదని అన్నారు. పిల్లలు అందరితో కలిసిపోయినప్పుడే వారి వికాసాభివృద్ధి జరుగుతుందని అన్నారు.

**తెలుగు రాష్ట్రాల నుండి అతిపెద్ద బాలమేళను నిర్వహిద్దాం: హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరీ గౌరీశంకర్**

కలకత్తా, ఢిల్లీ తరహాలో హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు అపూర్వ ఆదరణ లభించడం గర్వకారణమని, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ, బాలచెలిమి నిర్వహిస్తున్నా ఈ 22వ బాలచెలిమి ముచ్చట్లకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి బాల సాహిత్య రచయితలు ఇంతమంది రావటం అభినందనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి అతి పెద్ద బాలమేళ నిర్వహిస్తామని, దీనికోసం తెలుగు ప్రజలు ఉండే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆహ్వానించనున్నట్లు తెలిపారు. బాలసాహిత్యాన్ని సృష్టించడమే కాదని, ఆ సాహిత్యాన్ని విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇది జ్ఞానానికి సంబంధించిన పెద్ద పని అన్నారు. ఎక్కడైతే జలాలుంటాయో, ఎక్కడైతే జ్ఞానముంటుందో.. అక్కడ సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలమేళా నిర్వహించడం వల్ల ఈ ప్రాంగాణమంతా పులకరించి పోయిందన్నారు. ప్రభుత్వ సహకారంతో జిల్లాలకు, గ్రామాలకు వెళ్లి బాల సాహిత్య విస్తృతికి కృషి చేస్తామన్నారు.




**సాహిత్యంపై ప్రేమతోనే బాలచెలిమి ముచ్చట్లు నిర్వహిస్తున్నాం : చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్**

సాహిత్యంపై ఉన్న ప్రేమ కారణంగానే కష్టమనిపించినా గత 22 నెలల నుండి బాలచెలిమి ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వేదకుమార్ మాట్లాడుతూ 22 నెలల నుండి ప్రతి రెండవ శనివారం నిర్వహిస్తున్నామని, గత మూడు నెలల నుండి జిల్లాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన దగ్గర జరిగే పండగల్లో పెద్ద పండుగ పుస్తకాల పండుగ అన్నారు. పుస్తక ప్రేమికులను విజ్ఞాన భాండాగారం ఎంతో ఆకర్షించినట్లు తెలిపారు. రీసర్చ్ స్కాలర్స్‌కు అన్ని రకాల పుస్తకాల ఇక్కడ లభ్యం కావడం గర్వకారణం అన్నారు. బాలచెలిమికారులు బుక్ ఫెయిర్ బాలమేళాలో బాలచెలిమి ముచ్చట్లు పెట్టాలని నిర్ణయించిన కారణంగా ఈ కార్యక్రమం రూపుదాల్చింద న్నారు. తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల 'బడిపిల్లల కథలు' వేద్దామని పిల్లలు రాసిన కథలను ఆహ్వానిస్తే మొత్తం 882 కథలు వచ్చినట్లు తెలిపారు. వాటిని ఒక కార్యశాల నిర్వహించి అందులో ప్రతి జిల్లాకు కథలు ఎన్నుకున్నట్లు తెలిపారు. 14 మంది ఆర్టిస్టులు 10 జిల్లాల నుండి వచ్చి కార్యశాల ద్వారా బొమ్మలు గీసి ఇచ్చినట్లు తెలిపారు. దాంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ 10 జిల్లాల బడి పిల్లల కథలు పుస్తకాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. బాల సాహిత్య రచయితలు రాసిన కథలను కూడా ఎన్నుకొని వాటికి బొమ్మలు గీసి సకాలంతో తీసుకొస్తున్నట్లు తెలిపారు. చదువురాని వాళ్లకు కూడా ఈ బడి పిల్లల పుస్తకాలు అర్థమవుతాయన్నారు. ఏది పిల్లలకు రాయ కూడదో, ఏది రాయాలో తెలుసుకుంటే బాలలకు చక్కని కథలు అందించవచ్చన్నారు. పిల్లల కోసం రాయనివాళ్లు కూడా ఇక నుంచి కథలు రాయాలన్నారు. తద్వారా ఇంకా గొప్ప సాహిత్యం తెలుగులో అందిస్తామన్నారు. ఇప్పటి వరకు జరిగిన 22 చర్చలను చిల్డ్రన్స్ అకాడమీ రికార్డు చేసిందని, త్వరలో దాన్ని పుస్తకం రూపంలో తీసుకొస్తున్నట్లు తెలిపారు. 2020లో తెలంగాణలోని 31 జిల్లాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇటీవల భూదాన్ పోచంపల్లిలో బాలచెలిమి గ్రంథాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. మరో ఐదు జిల్లాల్లో కూడా గ్రంథాలయాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. బాలసాహిత్యాన్ని నిండు మనస్సుతో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

**బాలచెలిమి పత్రికకు కొనసాగింపుగా బాలచెలిమి ముచ్చట్లు : నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్ పత్తిపాక మోహన్**

బాలచెలిమి పత్రికకు కొనసాగింపుగా 2017 అంతర్జాతీయ పుస్తక దినోత్సవంలో బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎన్‌బీటీ చైర్మన్ పత్తిపాక మోహన్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బాలల సాహిత్యాన్ని పెంపొందించడం కోసం బాలచెలిమి అకాడమీ విశేషంగా కృషి చేస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి దాదాపు 60 మందికిపైగా కథా రచయితలు, సాహితీవేత్తలు, కవులు తమ అనుభవాలను వేదిక ద్వారా పంచుకోవడం అభినందనీయం అన్నారు.

**శతకపద్యాల్లాగా శాశ్వతంగా నిలిచే ముచ్చట్లు : ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎస్.రఘు**

ఈ ముచ్చట్లు గాలిలో కలిసిపోయే ముచ్చట్లు కాదని, శతకపద్యాల్లాగా శాశ్వతంగా నిలిచిపోయే ముచ్చట్లని ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎస్.రఘు పేర్కొన్నారు. చాలా కొత్త కొత్త ఆలోచనల కోసం, కొత్త అభివ్యక్తి కోసం, ఇతివృత్తం కోసం అన్వేషిస్తున్నటువంటి వేదికగా ఇది మారిందన్నారు. ఈ బాలసాహిత్య వేదిక ద్వారా కొత్త రచయితలు, కొత్త పాటకులు ఉద్భవిస్తున్నట్లు చెప్పారు.

**బాలసాహిత్యం మీదనే బుక్ ఫెయిర్ పెట్టాలి : రచయిత గిరిజ**

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ వేదకుమార్ గారు ఏ పని మొదలుపెట్టిన విభిన్నంగా ఉంటుందని రచయిత గిరిజ అన్నారు. కేవలం పిల్లల కోసమే హైదరాబాద్‌లో బుక్ ఫెయిర్ పెడితే చూడాలని ఉందన్నారు.

**మంచి సాహిత్యానికి బాలసాహిత్యం దోహదపడుతుంది : రచయిత వీఆర్.శర్మ**

బాలసాహిత్యం రాస్తున్నవారిలో పెద్దవాళ్లు, చిన్నవాళ్లు ఉన్నారని, కాబట్టి ప్రతినెల సాహిత్యంపై ప్రతి మండలం లేదా జిల్లా ప్రాంతాల్లో కలిసి బాల సాహిత్యంపై చర్చిస్తే బాగుంటుందని రచయిత వీఆర్.శర్మ అన్నారు. ఇది పిల్లల్లో మంచి కవిత్వాన్ని తీసుకురావడానికి ఉపయోగ పడుతుందన్నారు. జీవితాన్ని, సమాజాన్ని అర్థం చేసుకునేవాళ్లు



ఉన్నారని, పిల్లలను నడిపించే బాధ్యత బాలసాహిత్యంపై ఉందన్నారు.

**పిల్లల బాల్యంలోకి వెళ్లి కథలు రాయాలి :**
**రచయిత డా.కె.బి.గోపాలం**

తన తమ్ముడు పార్థసారధితో కలిసి చిన్నతనంలో చాలా డ్రామాలు వేసినట్లు డా.కె.బి.గోపాలం అన్నారు. బాలసాహిత్యంలో ఆస్ట్రానమీ నుంచి హిస్టరీ వరకు అన్ని సబ్జెక్టులపై ప్రసంగిస్తే చాలా విషయాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. విష్ణుశర్మ నీతిచంద్రిక చెప్పినప్పుడు జంతువులను ఆధారం చేసుకొని రాజకుమారులకు తెలివి నేర్పినట్లు తెలిపారు. కాబట్టి మన బాల్యంలోకి వెళ్లి కథలు రాయడం కాదని, పిల్లల బాల్యంలోకి వెళ్లి కథలు రాస్తే చాలా సక్సెస్ అవుతారని చెప్పారు.

**అడ్రస్ ఇస్తే ఉచితంగా పుస్తకాలు పంపిస్తాను : రచయిత చెన్నూరి సుదర్శన్**

తాను జంతుశాస్త్ర లెక్చరర్‌గా పనిచేశానని, 2010లో పదవీ విరమణ పొందిన తర్వాత 2012 నుండి కథలు రాస్తున్నట్లు రచయిత చెన్నూరి సుదర్శన్ అన్నారు. తాను ఇప్పటి వరకు 120 కథలు రాశానని, తనకు ఎవరైనా అడ్రస్ ఇస్తే వారికి తప్పకుండా ఉచితంగా పుస్తకాలు పంపిస్తానన్నారు. పిల్లలకు అర్థమయ్యే స్థాయిలో కథలు రాయాలని గ్రహించి తాను రాసిన పుస్తకాలకు తానే బొమ్మలు గీసినట్లు తెలిపారు.

**పిల్లలకు దిశానిర్దేశం చేయాలి :**
**గేయ కవి, రచయిత, ఉపాధ్యాయులు తుమ్మూరి రామ్మోహన్‌రావు**

గేయ కవి, రచయిత, ఉపాధ్యాయులు తుమ్మూరి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తాను కథలు రాస్తున్నానంటే దానికి స్ఫూర్తి చందమామ కథలేనన్నారు. తమ ఇంట్లో నాలుగైదు వేల పుస్తకాలు ఉన్నాయంటే దానికి కారణం చందమామ పుస్తకం కారణం అన్నారు. పిల్లలకు దిశానిర్దేశం చేయాలని బాలచెలిమి కృషి చేస్తోందని అభినందించారు. పెద్దలుగా మనమంతా బాలసాహిత్యాన్ని ప్రోత్సహించాలన్నారు.

**బాలచెలిమితో బాలల సాహిత్య వికాసం: రచయిత ఉరిమిల్ల సునంద**

తమ పాఠశాల నుంచి ఐదారు పుస్తకాలను తీసుకొచ్చినట్లు రచయిత ఉరిమిల్ల సునంద అన్నారు. బాలసాహితీవేత్తలు అందరూ కూడా బాగా చదువుకున్నవాళ్లని, అదేస్థాయిలో పిల్లలచేత పెద్ద సంఖ్యలో రచనలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను ప్రోత్సహించడంలో తాను ఎంతో ముందుంటానని చెప్పారు.

**బాలసాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లాలి :**
**రచయిత సుతారపు వెంకటనారాయణ**

బాలసాహిత్యాన్ని అభివృద్ధి చేయడానికి కంకణబద్ధులై పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రచయిత సుతారపు వెంకటనారాయణ అన్నారు. బాలసాహిత్యాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

**గ్రంథాలయాలను ప్రోత్సహిద్దాం : కథా రచయిత గుర్ర చిదంబరం**

తమ చిన్నతనంలో బాలసాహిత్యం తక్కువగా ఉండేదని, ఇప్పుడు కూడా తక్కువగానే సాహిత్యం రావడం బాధాకరమని కథా రచయిత గుర్ర చిదంబరం అన్నారు. పేపర్లలో కూడా బాలసాహిత్యంపై తక్కువ పేజీలు వస్తున్నాయని, ఇంకా కొంచెం పేజీలు పెంచాలన్నారు. గ్రంథాలయాలను ప్రోత్సహిద్దాం, వాటి అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. బాలల కోసం సాహిత్యం రాసే పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

**సాహిత్యం భవిష్యత్‌తరాలకు నాంది : రచయిత పిట్టగుంట సురేష్‌కుమార్**

బాలచెలిమి ముచ్చట్లు గత రెండు సంవత్సరాల నుండి నిర్వహించడం అభినందనీయం అని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్‌తరాలకు ఉపయోగపడుతాయని రచయిత పిట్టగుంట సురేష్‌కుమార్ అన్నారు.

ఈ సందర్భంగా 60 మంది కథా రచయితలు, సాహితీవేత్తలు, కవులు తమ అనుభవాలను వేదిక ద్వారా పంచుకున్నారు. బాలచెలిమి కార్యక్రమంలో పాల్గొన్న రచయితలందరికీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయ చంద్రమోహన్, బాలచెలిమి చిత్రకారుల కార్యశాల కన్వీనర్ కూరెళ్ల శ్రీనివాస్, బాల సాహిత్యవేత్తలు సిఎ ప్రసాద్, గరిపల్లి అశోక్, సుతారపు వెంకటనారాయణ, చొక్కాపు వెంకటరమణ, దాసరి వెంకటరమణ, మంచి పుస్తకం సురేష్, వడ్డేపల్లికృష్ణ, డా.పరుశు రాం, పి.గిరిజ, శాంతకుమారి, ఎండ్ల లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

– రామకృష్ణ కాంపాటి,
m : 9866168863
e: ramakrishna.praja@gmail.com



# అతడికి మరణం లేదు

అవును...
అతడికి మరణం లేదు

అతడు నిత్యం చైతన్యప్రవాహమై
ప్రపంచాన్ని పహరాకాస్తూనే ఉంటడు
నదిలా కొత్తదారుల వెంట ప్రవహిస్తూనే
భూమండలమంతా పారుతూనే ఉంటడు
ప్రపంచ బాధను తనదిగా భావిస్తూనే
నిత్యం కలవరపడుతూనే ఉంటడు
ప్రపంచంలో ఏ మూలన ఏమి జరిగినా
మనసిరిగినట్టు విలవిల్లాడిపోతుంటడు

అతడు...అతడే
అతడికి మరణం లేదు

అన్ని కాలాల్లోనూ, అన్ని ఋతువుల్లోనూ
జరిగే సంఘటనలకు మౌనసాక్షవుతుంటడు
మది మెదళ్ళలో మెదిలే సంఘర్షణలకు
దిక్సూచియై లోకానికి దారిచూపుతుంటడు
అనేక ప్రశ్నలకు మౌనంగా సమాధానమిస్తూనే
ప్రజాస్వామ్యాన్ని ఎత్తిచూపుతూనే ఉంటడు
జీవితపు సుడిగుండంలో కొట్టుమిట్టాడుతుంటూనే
ఎన్నో గాయపడిన దేహాలకు లేపనమవుతుంటడు
అతడు...అతడే
అతడికి మరణం లేదు

అతడు ఒంటరిగా బతుకును సాగిస్తూనే
సమూహమై సమాజాన్ని ప్రక్షాళన చేస్తుంటడు
అంతరిక్షంలో ఎగిరే రాకెట్టులా దూసుకెళ్తూనే
లావాలా నిప్పుకణికలను ఎగజిమ్ముతుంటడు
చీకటికోణాలను చిటికెలో పట్టుకుంటూనే
నడిబజారు నగ్నత్వాన్ని బయలు చేస్తుంటడు
ఎన్నిసార్లు అతడు నెత్తినోరు మొత్తుకున్నా
ప్రజాస్వామ్య చిరునామా మనకు కనపడదు
అతడు...అతడే
అతడికి మరణం లేదు

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
m : 9032844017
e : srikanth.bheempally@gmail.com

## అగ్రి టెక్నాలజీ ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్

### జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, అనుబంధ రంగాల కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా వ్యవసాయ రంగంలో సుస్థిరమైన వృద్ధి సాధించడం లక్ష్యంతో అగ్రిటెక్ సౌత్ రెండో ఎడిషన్ పేరుతో మూడు రోజులు ఎగ్జిబిషన్, వ్యవసాయ రంగంలో అధునాతన అంశాలపై అగ్రివిజన్ పేరుతో రెండు రోజుల సదస్సును నిర్వహించనుంది.

జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో అగ్రిటెక్ సౌత్ 2020కి ఆతిథ్యం అందించనున్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, నూతన సాంకేతిక ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం అనే లక్ష్యాలతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

ఈ ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా విభిన్నమైన పంటలు పండించడం, మైక్రో ఇరిగేషన్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్స్, ఈ-నామ్ మరియు ఇన్సురెన్స్, వ్యవసాయంలో అనుసరించాల్సిన విధానాలు, వ్యవసాయంలో యాంత్రీకరణ, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, ఐఓటీ, ఏఐ డ్రోన్స్, డిజిటల్ అగ్రికల్చర్, వ్యవసాయ ఉత్పత్తులకు మరింత విలువ చేకూర్చడం, పోషకాహార కల్పన వంటి అంశాలున్నాయి.

### తెలంగాణ గ్రామీణ ధార్మిక జీవితం నుంచి శాస్త్రీయ ఆలోచనల దాకా

# ఘంటా మొగిలయ్య ప్రస్థానం

*నా అన్న నేల ఏదీ నాది కానప్పుడు*
*వలస ఒక ఎక్కిల్ల దుక్కం*
*జీవనయానం ఒక సంచారం*

**-అన్నవరం దేవేందర్**

ప్రజలే చరిత్ర నిర్మాతలు. ఈ మాట కొత్తదీకాదు. ఇప్పటిదీ కాదు. నిన్నటి చరిత్ర నేటికి కొనసాగింపుగా రేపటి చరిత్ర నిర్మాణానికి కారకంగా నిలుస్తుంది. అంటే చరిత్ర, మనిషి పరస్పర ప్రేరితాలు. ఏటవాలుకి కొట్టుకుపోయేవారు చరిత్ర నిర్మించలేరు. ఎదురీత చరిత్రకి మొదటి అక్షరం. జీవనయానంలో తొలి అడుగే అతని చరిత్రకి తొలి అక్షరమైంది. తెలంగాణలోని ఒక పల్లెనుంచి, దళితుల ఉపకులమైన పంబాల సాంప్రదాయ ఆచారాల నుంచి తన వారసత్వాన్ని శాస్త్రీయమైన తాత్వికత వైపు, అత్యాధునిక వైపు నడిపించిన చరిత్ర ఘంటా మొగిలయ్యది. కాలంతో నడుస్తూనే, నడుస్తున్న కాలానికి ఒక పరమార్థాన్ని కానుకగా యిచ్చిన దార్శనికుడు మొగిలయ్య.



మొగిలయ్య 1933వ సంవత్సరంలో కరీంనగర్ జిల్లా పెద్దపల్లి తాలూకాలోని బౌద్ధ ఆరామం ధూళికట్ట గ్రామంలో జన్మించాడు. తండ్రి దేవ సత్తయ్య, తల్లి శాంతమ్మ. మొగిలయ్య అసలు పేరు రాజమౌళి. రాజమౌళి వారికి ప్రథమ పుత్రుడు రాఘవులు, రామచంద్రం అనే తమ్ముళ్ళు, రాధమ్మ, తులశమ్మ, సుశీల అనే ముగ్గురు చెల్లెళ్ళు ఉన్నారు. రాజమౌళి మానేరు ఒడ్డున వున్న యాస్వాడ గ్రామంలోని మగపిల్లలు లేని కుటుంబానికి ఇల్లరికపు అల్లుడుగా వెళ్ళాడు. అప్పటికే భర్తలేని మల్లవ్వ రాజమౌళిని పెంపకానికి తీసుకుని, తర్వాత తన బిడ్డ జననితో పెళ్ళి చేసింది. రాజమౌళి పేరు పలకడం కష్టంగా ఉందని మొగిలయ్యగా మార్చింది. దేవ రాజమౌళి ఘంటా మొగిలయ్య అయ్యాడు.

మొగిలయ్య కులం 'పంబాల' కులం. ఇది గ్రామ పూజారులకు సంబంధించిన దళితుల్లో ఒక ఉపకులం. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ వంటి సప్త మాతృకల శక్తి దేవతలకు ఆరాధ్యులుగా, పూజారులుగా ఈ కులం వారు ఉంటారు. వీరిని తెలంగాణ ప్రాంతంలో బైండ్ల, ద్యావతల, పంబాల, ఎల్లమ్మ వాళ్ళు అని పిలుస్తారు. వీరికి రెండువేల సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు తెలుస్తుంది. నిజాంకాలంలో రాజవైద్యులుగా గుర్తింపు, గౌరవం పొందినట్లుగా ఆనాటి ఫర్మానాలు చెబుతున్నాయి. ఆకాలంలో ఒక్కో పంబాల కుటుంబానికి కొన్ని గ్రామాలు కేటాయించి, గ్రామ దేవతల పూజలతోపాటు, పశువులు, మనుషుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను కూడా అప్పగించేవారు. వీరిని వతన్‌దార్లు అంటారు.

మొగిలయ్య జనని ఇద్దరూ 6వ ఫారం వరకు చదివారు. 7వ



ఫారం చదివితే ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హులయ్యేవారు. కాని అప్పటికే మల్లవ్వ కుటుంబం వతన్‌దార్లుగా ఉన్నందున వీళ్ళు ఉద్యోగాల్లో చేరితే వతన్ పోతుందని చదువు మాన్పించింది. మొగిలయ్య మానకొండూరు పరిసరాల్లో జగ్గయ్య పల్లెకు వతన్‌దారుగా మారాడు. జగ్గయ్యపల్లె గ్రామ పూజారిగా 75 సంవత్సరాలకు పైగా ఉన్నారు. శక్తి దేవతలకు ఆరాధనలు, గ్రామ ఉత్సవాలు జరిపేవాడు. గ్రామ ఉత్సవ సంస్కృతిని రెండు చేతులతో కాపాడుకుంటూ వచ్చిన ధార్మిక సాంప్రదాయవాది మొగిలయ్య. ఆయుర్వేద డాక్టర్‌గా వీరికి స్వస్థత చేకూరుస్తూ మంచి పేరు సంపాదించు కున్నాడు. సాంప్రదాయ విలువలు కాపాడుకుంటూనే శాస్త్రీయ వైద్యంపై అవగాహన కల్పించేవారు.



మూఢ విశ్వాసాల పట్ల, మంత్రాలు- తంత్రాల పట్ల నమ్మకం లేకపోయినా తన వతన్‌దారీ జీవిక పద్ధతిననుసరించి మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని గౌరవిస్తూ వారి సమస్యలను సమ్యగ్ దృష్టితో పరిశీలించి వీరికి సంరక్షకునిగా నిలిచేవాడు.

మొగిలయ్య తన కుటుంబం మొత్తాన్ని తీర్చిదిద్దిన ఆలోచనా పరుడు, కార్యశీలి, సామాజిక మార్పులకనుగుణంగా తనలోని సాంప్రదాయ భావనలను, ఆచారాలను క్రమ క్రమంగా వదులుకున్నాడు. శాస్త్రీయ ఆలోచనలకు ఆహ్వానం పలికి తనను, తన కుటుంబాన్ని ప్రగతి వైపు నడిపించిన వాడు మొగిలయ్య.

తన వతన్‌దారీని బంధువులకు అప్పగించి వ్యవసాయాన్ని తన జీవికగా మలుచుకున్నాడు.

ఆడపిల్లలకు చదువు అవసరమని గుర్తించి తన బిడ్డలను చదివించాడు. గ్రామంలోని ఆడపిల్లలు చదువుకునేలా ప్రోత్సహించాడు. మొగిలయ్య పెద్ద బిడ్డ చంద్రమణి నాలుగవ తరగతి (ఆ స్కూల్లో అంతవరకే వుంది), రెండవ బిడ్డ కనకతార 6వ తరగతి, మూడవ బిడ్డ వసంత ఎం.ఏ, బిఈడీ చదివారు.

మగపిల్లల్లో పెద్దవాడు అశోక్ సత్యనారాయణ పాలిటెక్నిక్ ఇంజనీర్ చదివారు. చక్రపాణి ఎంఏ సోషియాలజీతో పాటు జర్నలిజంలో మాస్టర్ డిగ్రీ చేసి, తన పంబకుల సాంస్కృతిక వారసత్వంపై డాక్టరేట్ చేసారు.

ఓపెన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. తెలంగాణ సాధన మలిఉద్యమంలో మేధోవంతమైన పాత్ర పోషించారు. చక్రపాణి తెలంగాణ పునర్నిర్మాణ ప్రణాళికలు రూపొం దించారు. సామాజిక, చారిత్రిక విశ్లేషకుడు. తెలంగాణ రాష్ట్రం తొలి పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ అయ్యారు. దేశంలోని వివిధ కమీషన్లకు ఆదర్శంగా నిలబెట్టారు.

చంద్రశేఖర్ ఎం.ఎ, ఎం.సి.జె, డాక్టరేట్ పొందారు తెలంగాణ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు.

మొగిలయ్య సంతానం, కోడళ్ళు, మనవ సంతానం అందరూ ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

మానేరు డ్యాం వల్ల ముంపుకు గురైన యాస్వాడను ఖాళీ చేసి తను పుట్టిన ఊరు ధూళికట్టకు వెళ్ళి, 200 ఎకరాలు భూమిని రైతులతో కలిసి ఉమ్మడిగా తీసుకొని వ్యవసాయక్షేత్రాన్ని, యాస్వాడపల్లెని ఏర్పాటు చేసారు.

తర్వాత మల్కాపూర్‌లో పిల్లలు కట్టిన ఇంటిలో ఉన్నారు. 87 ఏళ్ళ వయస్సులో అనారోగ్య సమస్యల వల్ల చక్రపాణి ఇంట్లో ఉంటున్నారు. మోకాళ్ళ నొప్పులు, శ్వాస సంబంధించిన చికిత్సలకోసం 'నిమ్స్'లో చేరారు. కోలుకుంటు న్నారనుకున్న సమయంలో 2020 జనవరి 10వ తేదీ ఉదయం 8.45 గంIIలకు అల్పాహారం తింటూ గుండె నొప్పితో మరణించారు. వారికి ఘనమైన నివాళి.

ఒక తెలంగాణ గ్రామీణ నేపథ్యం నుంచి అత్యాధునికత వరకు చేసిన ఈ సుదీర్ఘ ప్రయాణమంతా ఒక సామాజిక పరిణామాల చరిత్రే.

*"మొగిలయ్య లాంటి మనుషుల కోసం*
*కాలం తలుపు తెరిచే ఉంచుతుంది" (– జూలూరి గౌరీశంకర్).*

**– జుగాష్‌విలి,**
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# రంగుల హరివిల్లు అప్జా తమ్మనాథ్

## దేశ, విదేశాల్లో పలు చిత్రకళా ప్రదర్శనలు

కృషి, పట్టుదల, ఆసక్తి ఉంటే చిత్రకళలో రాణించవచ్చని నిరూపిస్తున్నారు ప్రముఖ ఆర్టిస్టు అప్జా తమ్మనాథ్. కష్టపడటమేకాదు తాను ఎంచుకున్న రంగాన్ని ప్రేమించాలని, అప్పుడే విజయవంతం అవుతామంటున్నారు. సాహిత్య, చిత్రకళా కుటుంబంలో జన్మించిన హైదరాబాద్ నగరానికి చెందిన కళాకారిణి అప్జా తమ్మనాథ్ తన బాల్యంలోనే అందమైన పేయింటింగ్ రంగం పట్ల ఆకర్షితులయ్యారు. కళ తన ఆలోచనలను వ్యక్తపరిచే ఒక సాధనం లాంటిది అంటారు. ఇది ప్రపంచంలోని నిబంధనల నుండి తనను తాను విముక్తి పొందడం లాంటింది అని ఆమె చమత్కరిస్తారు. రంగుల పాలెట్‌లు, బ్రష్‌లతో నిండిన ఇంట్లో పెరిగిన అమ్మా తనకు తన తండ్రే ఆదర్శం ఆదర్శం అంటున్నారు. దేశంలో పేరు పొందిన చిత్రకారుల్లో ఈమె తండ్రి తమ్మనాథ్ ఒకరు. తన వైవిధ్యమైన పేయింటింగ్‌తో రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నారు. హైదరాబాద్ నుండి ఉద్భవించిన గొప్ప మహిళా చిత్రకారుల్లో అప్జా తమ్మనాథ్ ముందు వరుసలో ఉంటారు. తన వైవిధ్యమైన పేయింటింగ్స్‌తో ఎన్నో దేశాల్లో ప్రదర్శనలు నిర్వహించి ఔరా అనిపించారు. తండ్రి నుండి కళా వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ఆమె ఆస్ట్రేలియా, దుబాయ్, న్యూఢిల్లీ, హైదరాబాద్ మొదలైన నగరాల్లో చిత్రకళా ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఎన్నో కళాత్మకమైన బొమ్మలు గీసి మేటి చిత్రకారిణిగా గుర్తింపు పొందారు.



**ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్స్ :**

అప్జా తమ్మనాథ్ 1990లో హైదరాబాద్‌లో జన్మించారు. 2011లో జవహార్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ అండ్ అర్కిటెక్చర్ యూనివర్సిటీ, హైదరాబాద్ నుండి బ్యాచిలర్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశారు.

**సోలో షోలు :**

- 2019లో ట్రియో సోలో షో, ఆర్ట్ ఫెయిర్, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా
- 2018 ట్రియో సోలో షో, న్యూయార్క్ ఆర్ట్ ఫెయిర్,
- 2018 ట్రియో సోలో షో, వరల్డ్ ఆర్ట్ దుబాయ్, దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్
- 2017 ట్రియో సోలో షో, సింగపూర్ ఆర్ట్ ఫేర్, సింగపూర్
- 2017 సోలో షో, వరల్డ్ ఆర్ట్ దుబాయ్, దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్
- 2016 సోలో షో, వరల్డ్ ఆర్ట్ దుబాయ్, దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్

**గ్రూప్ షోలు :**

- 2019 క్లస్టర్, కుషి ఫౌండేషన్, న్యూఢిల్లీ
- వాల్యూ బియాండ్ గ్యాలరీ, చెన్నై







- 2018 ఎడెల్‌వైజ్ పాల్లెట్టీ ఆర్ట్ వాక్ 2018, న్యూఢిల్లీ
- 2018 జ్ఞాన ఆర్ట్ గ్యాలరీ, సింగపూర్
- 2017 ది కలాం అంజిరెడ్డి ఆర్ట్ ఫెస్టివల్, డాక్టర్ రెడ్డి ఫౌండేషన్, గ్యాలరీ స్పేస్ హైదరాబాద్
- 2017 దోయెన్ని, గ్యాలరీ స్పేస్..హైదరాబాద్
- 2016 విథిన్ రీచ్, గ్యాలరీ నవ్య, న్యూఢిల్లీ
- 2016 ఉమెన్స్ డే, గ్యాలరీ స్పేస్, హైదరాబాద్
- 2016 ఎడెల్‌వైజ్ పాల్లెట్టీ 16 ఆర్ట్ వాక్, ముంబై
- 2015 న్యూ ఉత్తరాంచెస్ - ఆర్ట్ ఆఫ్ ఎ డైనమిక్ జనరేషన్, దైరా సెంటర్ ఫర్ ఆర్ట్స్ అండ్ కల్చర్, హైదరాబాద్
- 2015 బ్లరడ్ గేజెస్, కళాకృతి ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- 2015 వ్యూ పాయింట్, నెహ్రూ ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- 2015 బీయింగ్ ఇన్ హర్ షూస్, కళాకృతి ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- 2014 ఈస్థటిక్స్ అండ్ యుటిలిటి, గ్యాలరీ స్పేస్, హైదరాబాద్
- 2014 శ్రిష్టి మేల్, అఫోర్డేబుల్ అండ్ యుటిలిటరైన్ ఆర్ట్ ఫెయిర్, సృష్టి ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- ఎయిడ్ ఫర్ హుద్ హుద్ విక్టిమ్స్, గ్యాలరీ మ్యూజీ, మార్మేట్, హైదరాబాద్
- 2014 ఆర్ట్ ఫర్ కాజ్, ఎయిడ్ ఆఫ్ హుద్ హుద్‌విక్టిమ్స్, గ్యాలరీ స్పేస్, హైదరాబాద్
- ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ కలర్స్, గ్యాలరీస్పేస్, హైదరాబాద్
- 2014 బ్రష్‌స్ట్రోక్స్ 2014 దక్కన్, తాజ్ దక్కన్, కొలోరెంటిక్.. లివింగ్ ఇన్ కలర్స్, హైదరాబాద్
- మాన్‌సూన్ షేడ్స్‌పై ఎగ్జిబిషన్, గ్యాలరీస్పేస్, హైదరాబాద్
- షేడ్స్ ఆఫ్ ఉమెన్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఎగ్జిబిషన్, రాడిసన్ బ్లూ అండ్ గ్యాలరీ స్పేస్, హైదరాబాద్
- 2014 కాంటెంపరరీ ఆఫ్ హైదరాబాద్, తమీ, నాత్ ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- 2013 75 ఇయర్స్ ఆఫ్ దక్కన్ క్రానికల్, కళాకృతి ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- 2013 ఫ్లవర్, దైరా సెంటర్ ఫర్ ఆర్ట్స్, హైదరాబాద్



- 2012 ఆర్ట్ జంబోర్, దైరాసెంట్, ఫర్ ఆర్ట్స్ హైదరాబాద్
- 2011 21 హైదరాబాద్ ఆర్టిస్టు, తాజ్ దక్కన్, హైదరాబాద్

**ఆర్ట్ క్యాంప్స్ :**

- 2017 కరా ఫెస్టివల్, గ్యాలరీ స్పేస్, హైదరాబాద్
- 2016 కలర్స్ ఆఫ్ స్టేట్‌హుడ్, కంటోర్స్ ఆఫ్ ఉమెన్ ఎక్స్‌పీరియన్‌సెస్, ముక్త- తెలంగాణ ఉమెన్స్ కలెక్టివ్, ఫైగా టూంబ్స్, హైదరాబాద్
- 2014 ఆర్ట్ తెలంగాణ, తారామతి, బరదారి, హైదరాబాద్
- 2011లో 21 ఆర్టిస్టు, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్.

**కలెక్షన్స్ :**

- ప్రైవేటు కలెక్షన్ సింగపూర్ కర ఫెస్టివల్ ఇండియా
- ముక్త తెలంగాణ ఉమెన్స్ కలెక్టివ్, ఇండియా
- ఇమగో ముంద్, లూసియానో బెనెట్టన్ కలెక్షన్, ఇటలీ
- ప్రైవేటు కలెక్షన్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
- ప్రైవేటు కలెక్షన్, దుబాయ్
- ప్రైవేటు కలెక్షన్, జర్మనీ ప్రైవేటు కలెక్షన్, మియామి ఆర్ట్, తెలంగాణ.

– దక్కన్‌న్యూస్,

m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# ఆదూర్ గోపాలకృష్ణన్

## భారతీయ సినిమాకు అంతర్జాతీయ కీర్తి పతాకం

సినిమా ప్రపంచంలో సృజనాత్మకతకు హద్దులు లేవని నిరూపించిన దర్శకుడు ఆదూర్ గోపాలకృష్ణన్. మలయాళంలో ఆయన రూపొందించిన చిత్రాలు జాతీయంగానే గాదు, అంతర్జాతీయంగా ప్రశంసలందుకున్నవి. తన యేభై ఏళ్ల సినీ జీవితంలో పుంఖాను పుంఖాలుగా శతాధిక చిత్రాలు తీసిన దర్శకుడేమీకాదు. కేవలం డజను చిత్రాలు తీసి సత్యజిత్‌రే తరువాత భారతీయ సినిమా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించిన దర్శక మేధావి ఆయన. 12 సినిమాలేనా? అని మనం ఆశ్చర్యపోనవసరం లేదు. ఆయన ప్రతి చిత్రము తనదంటూ ఒక ప్రత్యేక ముద్రను, విలక్షణతను సంతరించుకుని రూపొందుతుంది. ఆదూర్ మలయాళ సినిమా రంగానికో, భారతీయ సినిమాకో పరిమితం కాకుండా ప్రపంచ సినిమా రంగానికి తన చిత్రాల ద్వారా జీవశక్తిని అందిస్తున్నారు. అన్ని అవలక్షణాలను వంటబట్టించుకుని భ్రష్టుపట్టిపోయిన భారతీయ సినిమా రంగాన్ని ప్రక్షాళన చేయడానికి రక్తరహిత యుద్ధాన్ని 50 ఏండ్లుగా కొనసాగిస్తున్నారు. అందుకే ఆయన తీసే ప్రతి సినిమా కోసం ఆతృతగా ఎదురుచూసే ప్రేక్షకులు దేశమంతటా మాత్రమే కాదు ప్రపంచమంతటా ఉన్నారు.



కేరళలోని పథనం తెట్టా జిల్లా ఆదూర్‌లో 1941 జులై 3న భూస్వామ్య కుటుంబంలో గోపాలకృష్ణన్ పుట్టారు. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కథాకళి నాట్యకళారూపాన్ని ప్రోత్సహించారు. రోజూ తొమ్మిది మైళ్లు నడిచి స్కూలుకు వెళ్లే ఆదూర్ ఎనిమిదో యేటనే వీధి నాటకాలాడారు. ఒకసారి తన కుటుంబ సభ్యులే ప్రేక్షకులుగా మారితే తను రాసి దర్శకత్వం వహించిన నాటకాల్ని ప్రదర్శించడాన్ని తన బాల్యంలో మరిచిపోలేని జ్ఞాపకంగా చెప్పకుంటారాయన. హైస్కూలు రోజుల్లోనే గ్రంథాయాల్లో తకళి శివశంకర్ పిళ్లై, వైకం మహమ్మద్ బషీర్, కేశవదేవ్ వంటి వారి రచనలు ఆదూర్‌ని ప్రభావితం చేసినవి. మధురైలో కాలేజీ చదివారు. 1960లో డిగ్రీ అందుకున్న ఆదూర్ కాలేజీ రోజుల్లోనే 10 నాటకాలు రాయడం 20 నాటకాలకు దర్శకత్వం వహించారు. జీవిక కోసం నేషనల్ శాంపిల్ సర్వేలో ఉద్యోగం చేశారు. సాహిత్యం, కళలు ఆయన్ని ఉద్యోగ జీవితంలో అట్టే ఇమడనీయ లేదు. దాంతో 1962లో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి పూణే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో స్క్రిప్టు రచన, డైరెక్షన్‌లో శిక్షణ పొందారు. ఇందుకాయనకు మెరిట్ స్కాలర్‌షిప్ రావడం గొప్ప విషయం.



స్వయంవరం (1972)

పూణేలో శిక్షణ పొంది తిరిగి వచ్చిన తరువాత 1965లో తొలిసారిగా ఫిలిం సొసైటీని ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. చాలా తక్కువమంది ఇందులో చేరారు. ఆయనే ప్రొజెక్టర్ ఆపరేట్ చేశారు. చాలా మంచి మంచి చిత్రాలు ప్రదర్శించారు. అలా ప్రారంభమైన ఫిలిం సొసైటీల ఉద్యమంలో కేరళలో ఆదూర్ నిర్వహించిన భూమిక చారిత్రాత్మకమైంది.

ఈ సందర్భంలో ఆదూర్‌కి ముందు మలయాళీ చిత్రరంగం తీరుతెన్నుల్ని ప్రస్తావించుకోవాలి. 1938లో కేరళలో 'బాలన్'తో టాకీలు మొదలైతే అప్పటి నుండి దాదాపుగా పుక్కిటి పురాణ చిత్రాలకు దూరంగా మనగలుగుతూ వచ్చింది. 1950లో తిరువనంతపురంలో మెర్రిలాండ్ స్టూడియో రాకతో కొత్త శకం ఆరంభమయినట్లయింది. అప్పటి దాకా తెలుగు, తమిళ భాషల చిత్రాలే కేరళలో ప్రదర్శిత మయ్యేది. అప్పట్లో వచ్చిన 'నవలోకం', 'తిరుమాల', 'జీవితనౌక' వంటి సాంఘికాలతో కేరళీయులకు తమ దర్శక నిర్మాతలపై విశ్వాసంపెరిగింది. సామాజిక ఇతివృత్తం గల జీవితనౌక, కార్మిక సమస్యను ఎత్తిచూపిన నవలోకం వచ్చాయి. కేరళలో నాటి వర్ణ వివక్షతను నిరశిస్తూ ఓ హరిజన యువతి దీనగాథను రామూకారియత్ 'నీలక్కుయిల్'గా తీశారు. ఈ మధ్యకాలంలోనే పి.రాందాస్ అనే ఔత్సాహికుడు తన సహచరులందరితో కలిసి ప్రయోగాత్మకంగా 'న్యూస్‌పేపర్ బాయ్' తీసి 1955 జూన్‌లో అంటే సత్యజిత్‌రే 'పథేర్ పాంచాలి' కన్నా మూడు నెలల ముందుగా విడుదల చేసారు. ఈ రామూకారియత్ ఆ తరువాత 'మదినాయపుత్రన్', 'మిన్‌సోనుగ', మాదుపదు చిత్రాలను అందించి 1965లో "చెమ్మీన్"తో జాతీయ స్థాయిలో అవార్డు అందుకుని మలయాళీ సినిమా ప్రభావాన్ని

ఇనుమడింపజేసారు.

ఈ నేపథ్యంలో ఆదూర్ మొదటిసారిగా దర్శకుడై "చిత్రలేఖ ఫిలిం కోఆపరేటివ్"ని స్థాపించి 1972లో 'స్వయంవరం' నిర్మించారు. కేరళ సినిమా పరిశ్రమను మలుపు తిప్పిన చిత్రమే గాక స్వయంవరం ఒక మైలురాయిగా నిలిచిపోయిన సిగ్నేచర్ ఫిలిం. తూర్పు ఐరోపా దర్శకులు, రిత్విక్ ఘటక్, సత్యజిత్‌రేల ప్రభావంతో ఈ స్వయం వరాన్ని తీసారు ఆదూర్.

స్వాతంత్ర్యానికి పూర్వం భూస్వామ్య కదంబహస్తాల్లో కొట్టుమిట్టాడే కేరళ, ఆకస్మికంగా కమ్యూనిస్టుల ప్రాబల్యంలోకి రావడానికి దారితీసిన పరిణామాల్ని స్వయంవరం ప్రతిబింబించింది. ఇలాంటి సమాజంలో ప్రేమ మత్తులో పెళ్లాడి, జీవిత వాస్తవాల కనుగుణంగా బతికేందు కిష్టపడే జంటలోని భర్త అకస్మాత్తుగా మరణిస్తే పరిస్థితి ఏమిటనేదే స్వయంవరం ఇతివృత్తం.


ముఖాముఖం (1984)

పాత సంప్రదాయాలను పట్టకు వ్రేలాడే పెద్దల అభ్యంతరాలను త్రోసిరాజని తాముగా సమాజంలో స్వంతంగా, స్వయంశక్తితో బ్రతకగలమనే విశ్వాసంతో నగరంలోకి అడుగుపెడతారు సీత–విశ్వం. కానీ ఈ వ్యవస్థలో జీవితం పూలబాట కాదని అనుక్షణం ముళ్లే ఎదురౌతాయని చాలా ఆలస్యంగా గుర్తిస్తారు. విశ్వం తన ఆదర్శాలతో రచయితగా సమాజంలో మనలేకపోతాడు. దాంతో ఆదర్శాలను పక్కకు పెట్టి గత్యంతరంలేక కలప దుకాణంలో కొంతకాలం ట్యుటోరియల్ కాలేజీలో లెక్చరర్‌గా కొంత కాలం ఆ తరువాత మరొకటి ఎన్నిచోట్ల చేసిన స్థిరపడలేకపోతాడు. ఈ కష్టాల్లో సీతకు కొడుకు పుడతాడు. వీరి కష్టాలు మరిన్ని పెరుగుతాయి.

వాళ్లచుట్టూ బ్రతుకుతున్న వాళ్లు ఇలా సమస్యలతో జీవిత పోరాటాన్ని ఎంతో కాలంగా కొనసాగిస్తున్నారు. వారిలో ఒక్కొక్కరిదీ ఒక రకమైన జీవితం. వితంతువైన జానకి బియ్యం వ్యాపారం చేయగా, కళ్యాణి వేశ్యగా బతుకీడుస్తుంటుంది. వాసు స్మగ్లర్. వీరంతా జీవితంలో దగాపడిన వారే.


నాలు పెన్నుంగళ్ (2007)

ఇంతలో విశ్వానికి ఉన్నట్టుండి జబ్బుచేస్తుంది. భర్త బతకాలంటే మందులు కావాలి. వారిని ఆదుకునేవారు ఎవరూ లేరు. 'స్వయంవరం'లో తానెన్నుకున్న జీవితం ఇలా పరిణమించే సరికి సీతకు దుఃఖించడం మినహా మరో మార్గంలేదు. ఆమె వేదన, దుఃఖం విశ్వాన్ని బ్రతికించలేకపోతాయి. ఇపుడు సీత ఎలా బతకాలి. వాసు, కళ్యాణి, జానకమ్మల లాగా ఏ మార్గాన్ని అనుసరించాలి. ఇలా సమాజాన్నే ప్రశ్నిస్తూ ముగుస్తుంది చిత్రం.

ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం, ఛాయాగ్రహణం. శారదకు ఉత్తమ నటి అవార్డులతోబాటు నాలుగు కేరళ రాష్ట్ర అవార్డులు అందుకోవడంతో కేరళలో కళాత్మక, వాస్తవిక చిత్రాల నిర్మాణం ఊపందుకుంది.

'స్వయంవరం' సాధించిన సంచలనంతో ఒక్కసారిగా మలయాళీ చిత్రరంగ ప్రాభవం జాతీయ స్థాయిలో చర్చనీయాంశ మైంది. ఒక రకంగా ఆదూర్ రాకతో మలయాళ చిత్రసీమలో కొత్తశకం ఆరంభమైంది. ఆ తరువాత అరవిందన్ వంటి ఔత్సాహిక దర్శకులు చిత్రరంగ ప్రవేశం చేసారు.

'స్వయంవరం' తరువాత మరో అయిదేళ్లకి 1977లో గాని ఆదూర్ రెండో చిత్రం 'కొడియోట్టం' వచ్చింది. కొడియోట్టం అంటే ఎదగడం. పేరుకు తగ్గట్టుగానే ఆదూర్ ఎదిగిన ఆలోచనలకు దర్పణం ఈ సినిమా. ఐదేళ్లు శ్రమించి తీసిన ఈ చిత్రంలో పాత సంప్రదాయాలకు స్వస్తి చెప్పారు. పేరున్న తారలు లేకుండా తీశారు. సినిమా అంతా కథలు కథలుగా కళ్లముందు జరిగినట్లుంది. విశేషం ఏమిటంటే ఈ సినిమాలో నేపథ్య సంగీతం లేదు. పకృతి పరంగా సహజంగా వినబడే శబ్దాలనే రికార్డ్ చేశారు.

జులాయిగా తిరిగే వ్యక్తి ఇతరులపై ఆధారపడి జీవిస్తూ బాధ్యతా రాహిత్యంగా తిరుగుతుంటాడు. స్వశక్తిమీద జీవించకుంటే సమాజం ఎవరినైనా క్షమించదనే వాస్తవాన్ని తెలుసుకున్న ఆ వ్యక్తి జీవితం ఎలా మారుతుందన్న అంశాన్ని ఆదూర్ కొడియెట్టంలో చిత్రీకరించారు. 'కొడియెట్టం' పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో పాల్గొన్నడమేగాక జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రం, గోపీకి ఉత్తమ నటుడుగు అవార్డులు, కేరళలో మరో అయిదు అవార్డులు అందుకుంది.

ఆదూర్ ఇప్పటి దాకా తీస్తున్న చిత్రాలన్నీ ఆత్మకథాత్మకమైనవి. కేరళ సామాజిక, సాంస్కృతిక జీవనంలో స్వాతంత్ర్యం రాకముందు నుండి ఆ తర్వాత చోటు చేసుకున్న వివిధ పరిణామాలు ఆ చిత్రాల్లో మనకు స్పష్టంగా కనిపిస్తాయి. కేరళ జీవన మూలాలు ఆయన చిత్రాల్లో ఆవిష్కృత మవుతాయి. అయినా ఈ సినిమాలకు విశ్వ జనీనత ఉండటం విశేషం. నిర్దిష్టతను బలంగా పట్టించుకున్నందునే ఈ చిత్రాలకు విశ్వజనీనత ఉంటోంది. తన సినిమాలకు సంబంధించిన కథల విషయమై ఆదూర్ "నా చుట్టూ జరిగే మార్పులు వింత వింత అనుభవాల్ని, అనుభూతుల్ని మిగులుస్తాయి. ఆ అనుభవాలు, అనుభూతులు కొన్ని జ్ఞాపకాలలోకి వెళ్లిపోతాయి. "జ్ఞాపకాలు ఆలోచనల్ని రేకెత్తిస్తాయి. ఆ ఆలోచనలే కథా రూపం దాలుస్తాయి".

ఆదూర్ 1981లో తన మూడవ చిత్రం "ఎలిపత్తాయం" తీసారు. ఇది ఆయన తొలి కలర్ చిత్రం. సమాజంలో ఉమ్మడి కుటుంబాలకు

కాలం చెల్లుతున్న రోజులవి. భూసంస్కరణ ఫలితంగా గ్రామాల్లో పేదలు చైతన్యవంతులు అవుతున్న తరుణమది. యువకులు ప్రేమవివాహాలు చేసుకుంటున్న కాలమది. మారుతున్న కాలమాన పరిస్థితులతో రాజీపడలేక, సమస్యల్ని పరిష్కరించే ధైర్యంలేక అవి ఎదురైనపుడు పిరికివాడిలా ఎలుకల బోను (ఎలిపత్తాయం)లోకి పరుగెత్తే ఓ భూకామందు కథే ఎలిపత్తాయం.

'ఎలిపత్తాయాం'లో ముఖ్యపాత్ర పేరు 'ఉన్ని' మధ్య వయస్కుడు అవివాహితుడు. అతి నెమ్మదిగా ఆతని జీవన శైలి సాగుతుంటుంది. పెళ్లి వయసు దాటిన ఓ చెల్లెలు. కాలేజీ చదువుతున్న మరో చెల్లెలు. ఇదే ఉన్ని కుటుంబం. మార్పును కొత్త దనాన్ని చూసి తట్టుకోలేని మనస్తత్వం ఉన్నిది. అతనెంత బలహీన మనస్కుడంటే రాత్రివేళ తన గదిలో అలికిడి చేసే ఎలుకలు పెద్ద సమస్య. బద్ధకస్తుడు. కాలంతోపాటు కాస్తయినా కదలని అతని మనస్తత్వాన్ని ఇలాంటి సంఘటనలతో చూపుతాడు ఆదూర్. పెళ్లయిన పెద్ద చెల్లెలు ఆస్తిలో భాగం ఇవ్వమని తరచూ గొడవ పడుతుంది. రెండో చెల్లెలు రాజమ్మ పెళ్లివకుండా వయసు దాటిపోతుంటుంది. ఈమె ఉన్నితో కాస్త మానసికా అనుబంధం ఉన్న వ్యక్తి. ఈమె పెళ్లి సంబంధాలను ఏదోవిధంగా చెడగొడు తుంటూంది. ఇదంతా గమనిస్తున్న మూడో చెల్లెలు ప్రేమించిన అబ్బాయితో పారిపోతుంది. ఇది ఉన్నికి పెద్ద ఎదురుదెబ్బ. చెల్లెలి ద్వారా బాహ్య ప్రపంచంలో ఉన్న కాస్త బంధమూ తెగిపోవడంతో ఒంటరిదైన రాజమ్మ తొందరగా జబ్బుపడిపోతుంది. ఆమెను పట్టించుకోక పోవడంతో అపస్మారక స్థితిలో ఉన్న రాజమ్మను గ్రామస్తులు తీసుకుపోతారు. దీంతో పూర్తిగా ఒంటరివాడైనా ఉన్ని మనసు చెదిరి తన ఇల్లునే బోనులు తలుపులు బాగించుకుని అశాంతిపాలై తిరుగుతుంటాడు.



ఫ్యూడల్ వ్యవస్థలో దోపిడికి నలిగిపోయిన రాజమ్మ పాత్ర ఎన్నో ఇళ్లలో మనం చూసిన విధవాడపడచుల పరిస్థితికి స్త్రీలోని వ్యక్తిత్వాన్ని కొన్ని యుగాలపాటు నిర్వీర్యం చేసిన నెమ్మది తనం, నిర్లక్ష్య మనస్తత్వపు బదనికలు ఊపిరాడకుండా చేసి చంపేసినా చక్కని నీడనివ్వగల వృక్షం రాజమ్మ పాత్ర. తన బలహీనతలతో మగవాడు స్త్రీని ఎంత బలంగా అణచివేయగలడనే విజ్ఞానాన్ని సాహిత్యంలో చలం ఎంత తీవ్రంగా చెప్పారో అంత బలంగాను సినిమాలో చెప్పింది ఆదూర్. ఆదుర్ ఎలిపత్తాయంను వెండి తెరపై ఒక అధి వాస్తవిక కథగా చెప్పుకుంటారు నవ్య సినిమా అభిమానులు.

ఎలిపత్తాయం ఇండియన్ పనోరమాలో ప్రదర్శితమవడమే గాక ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ అవార్డు, కేరళలో 6 అవార్డులు, బ్రిటిష్ ఫిలిం అవార్డు అందుకొని, కెన్స్, లండన్, చికాగో, న్యూయార్క్ ఫిల్మ్ ఫెస్టివల్స్ పాల్గొన్నది.

ఆదూర్ సినిమాల్లో విస్తృతంగా చర్చలకు, విమర్శలకు తెరతీసినది 'ముఖాముఖం'. దీన్నొక రాజకీయ చిత్రమని, కమ్యూనిస్ట్ వ్యతిరేక చిత్రమని విమర్శలు రేగాయి. కాని 1957లో కేరళలో కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రభావం, 1965లో పార్టీ చీలిక ఫలితంగా ప్రజల్లో తలెత్తిన సంఘర్షణలకు సమాధానంగా ముఖాముఖం తీసారు. ఒకరకంగా ఈ సినిమాకు ఆ తరువాత ఆయన తీసిన 'కథా పురుషన్'కు ముందుమాటగా చెప్పుకుంటారు.

కార్మిక వర్గానికి ప్రతినిధి అయిన కమ్యూనిస్ట్ శ్రీధరన్ చిత్ర కథలో హీరో. అతనో చిన్న పట్టణంలో ఓ ఫ్యాక్టరీలో పనిచేసుకుని పొట్ట పోసుకునే కార్మికుడు. ఫ్యాక్టరీ యజమాని హత్యకు గురవడంతో శ్రీధరన్ తన కార్మికులతో కలిసి రహస్య స్థావరంలో తలదాచుకుంటాడు. తర్వాత చాలా ఏళ్లు గడుస్తాయి. ఈలోపల పార్టీలో రెండు చీలికలొస్తాయి. చివర్లో శ్రీధరన్ మళ్లీ తెరపైకి వస్తాడు. ఈసారి శ్రీధరన్‌లో చాలా మార్పులు కనిపిస్తాయి. ఆ తర్వాత అతను హత్య చేయబడతాడు. ఈ హత్యతో రెండుగా విడిపోయిన పార్టీ మళ్లీ ఒకటిగా రూపొందుతుంది. స్థూలంగా ఇదీ ముఖాముఖం చిత్రకథ. ఈ చిత్రంలో లెనిన్ దగ్గర్నుండి జన జీవనంలో ఏర్పడే సరికొత్త మార్పుల్ని గుర్తించి చర్చించారు ఆదూర్. ఈ చిత్రంపై విమర్శలకు సమాధానం చెబుతూ ఆదూర్ ఒక సందర్భంలో "నేను కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వానికి వ్యతిరేకం కాదు. ప్రాథమికంగా నేనొక దర్శకుణ్ని. నా చుట్టు జరుగుతున్న దానికి రియాక్ట్ అవుతాను. నేను ఫిలిం మేకర్‌ని కనుక నా చుట్టు జరుగుతున్న దానికి ప్రతిస్పందిస్తాను. ఫిలిం మేకర్‌గా నా ప్రతి స్పందన నా చిత్రాల్లో కనిపిస్తుందంటారు.

ఆదూర్ తను 1987లో రూపొందించిన 'అనంతరం' మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. అపారమైన తెలివితేటలున్న ఓ వ్యక్తి ఈ వ్యవస్థలో రాజీపడలేక సాధారణ వ్యక్తులతో కలిసి బతకలేక పడే అంతర్మధనాన్ని తెరకెక్కించారు. ఆదూర్ చిత్రాల్లో ఆలోచనకు పెద్దపీట ఉంటుంది. దాని ఆవిష్కరణలో విలక్షణత ఉంటుంది.

'స్వయంవరం' నుండి 'అనంతరం' వరకు తన స్వంత కథలతోనే సినిమాలు తీసిన ఆదూర్ తొలిసారిగా తన అభిమాన రచయిత వైకం మహమ్మద్ బషీర్ రాసిన 'మతిలుకల్' తీసారు. మానవ సంబంధాల్లోని సున్నితమైన ఆర్తిని, ప్రేమను తపనను అద్భుతంగా తెరకెక్కించారు ఆదూర్. జైలు గోడకు ఆవల ఉన్న ఒక మహిళా ఖైది కంఠ స్వరాన్ని విని ఆమెను గాఢంగా ప్రేమించిన ఓ ఖైదీ అంతర్లోకాల సంఘర్షణను ఆత్మీయంగా దర్శింపజేసే చిత్రం 'మతిలుకల్'. సెల్యులాయిడ్‌పై కవిత్వంలా సాగుతుంది 'మతిలుకల్' చిత్రం. ఈ సినిమా కవి మహమ్మద్ బషీర్ జైలుజీవితాన్ని చిత్రిస్తుంది. రూపారూపాల ప్రతీకలతో, ఊహాకల్పనలతో స్త్రీ పురుషుల కలయికకు సంబంధించిన సున్నిత మాధుర్యంలో మతిలుకల్ సాగుతుంది. సగటు ప్రేక్షకుని స్థాయిని మించిన ఉన్నతి ఈ చిత్రంలో కనిపిస్తుంది.

వైకం మహమ్మద్ బషీర్ కథతో తీసిన 'మతిలుకల్'కు లభించిన ఆదరణతో ఆదూర్ పాల్ జకరయ్య రాసిన నవల ఆధారంగా 1993లో 'విధేయన్' తీసారు. భూస్వామ్య వ్యవస్థలో స్త్రీ పురుష సంబంధాలను

విస్తృతంగా విశ్లేషించిన చిత్రం విధేయన్. నిర్దాక్షిణ్యంగా ఉండే సంపన్నుడైన యజమాని విధేయుడైన నౌకరు భార్యపై అత్యాచారం చేస్తాడు. లైంగిక సంబంధాన్ని కొనసాగిస్తాడు. అతని దుర్మార్గాన్ని భర్తకు చెప్పాలని, ఎదిరించాలని ఆమె ప్రయత్నించదు ఎందుకంటే వ్యవస్థలో సహజమైన పురుషాధిక్యత వల్లనే తన్ను లైంగికంగా దోపిడీ చేయడం జరుగుతుందని ఆమె భావిస్తుంది. పొగరబోతు యజమానిగా మమ్మట్టి, నౌకరుగా గోపకముల్ నటించారు. మమ్మట్టికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ నటుడి అవార్డు వచ్చింది. ఇండియన్ పనోరమాలో ప్రదర్శింపబడింది. కాగా తను రాసిన నవలను చిత్రానికి సంబంధంలేదని రచయిత జకరయ్య విమర్శించడంతో ఆ తర్వాత ఆదూర్ స్వంత కథమీదే సినిమాలు తీసారు. ఆ సినిమా 'కథా పురుషన్'.

కథాపురుషన్ 1984లో తీసిన 'ముఖాముఖం'కి కొనసాగింపు. కేరళ సమకాలీన చరిత్రలో అవిభాజ్యమైన కమ్యూనిజానికి రెండో పార్శ్వంగా రూపొందించిన చిత్రం 'కథా పురుషన్', నేషనల్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ఆఫ్ జపాన్ వారి సహకారంతో తీసిన 'కథాపురుషన్' గత 50 ఏళ్లలో కేరళలో వచ్చిన రాజకీయ, సాంఘిక మార్పులను ఆవిష్కరించింది.

బడుగుల కోసం ప్రాకులాడే కమ్యూనిస్ట్ నేతల్లో కొందరు పోలీసుల దాడులను భరించలేక ఉద్యమాన్ని విడిచి పోతారు. పోలీసుల నెదిరించి వ్యక్తి పోరాటం చేయడం సులభం కాదు. ప్రతి వ్యవస్థ తన్ను తాను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుంది. వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే ఆత్మవిశ్వాసం ఉద్యమకారులకు ఉండాలి. అపుడే అది సత్ఫలితాలనిస్తుందని 'కథాపురుషన్'లో చర్చిస్తారు. ఆదూర్ ఇది జాతీయ ఉత్తమ చిత్రంగా ఎన్నికైంది. టోకియో మోటోరంటో డెన్మార్క్, లండన్ చిత్రోత్సవాలలో సహా 26 దేశాల్లో ప్రదర్శితమైంది.


సత్‌జిత్‌రే, ఆదూర్, గిరీష్‌కర్నాడ్

ఆదూర్ 2002లో తీసిన చిత్రం 'నిళల్‌కుత్తు' ఇది స్వంత కథనే. స్వాతంత్ర్యానికి పూర్వం తిరువాంకుర్ సంస్థానంలో పనిచేసే ఒక తలారి జీవితకథను, రాజహింస తీరుతెన్నులను అత్యంత సున్నితంగా ఆవిష్కరించారు ఆదూర్.

నలభైవ దశకం నాటి ఈ కథలో కాళీయప్పన్ సంస్థానం నియమించిన తలారి రాజు నియంతగా అమలు చేసే ఉరితీతలకు ఈయన మౌన సాక్షి. ఉరి తీసిన తరువాత తాడును తెచ్చి పూజమందిరంలో ఉంచుతారు. తర్వాత దానిని కాల్చి రోగాలకు మందుగా వాడతారు. ఆయన కొడుకు మాత్రం గాంధేయవాది అతడు రాట్నం వడుకుతుంటాడు. మరోవైపు కాళీయప్ప ఉరి తాడు పేనుతుంటాడు. అలా అహింసకు చరఖా చిహ్నమైతే, రాజ్యహింసకు ఉరితాడు చిహ్నాలైతావి. గొప్ప ప్రతీకాత్మకంగా తీసిన ఈ సినిమాలో ఆదూర్ మరింత పరిణితి చెందినట్లు కనిపిస్తారు.

ఆదూర్ తరువాతి చిత్రాలు "నాలు పెన్నుంగళ్" (2007), ఒరుపెన్నుమ్(2008), పెన్నియమ్(2016). తకళి శివశంకర పిళ్లై రాసిన 4 కథల ఆధారంగా తీసిన చిత్రం 'నాలు పెన్నుంగళ్'. 1940–1960ల మధ్యకాలంలో రాసిన కథలివి. ఒక వేశ్య, ఒక అవివాహిత, ఒక గృహిణి, ఒక ఎగువ మధ్యతరగతి మహిళల జీవితాలను తెరకెక్కించారు. వాళ్లు తమ తమ స్వంత వ్యక్తిత్వంలో జీవించే శైలిని చిత్రీకరించారు ఆదూర్.

చివరి చిత్రం "పిన్నియమ్" ఒక క్రైమ్ డ్రామాగా తీశారాయన. 80లనాటి వాస్తవ సంఘటన ఆధారంగా నిర్మించారాయన. కావ్యామాధవన్, దిలీప్, విజయరాఘవన్, తదితరులు నటించారు.

'ఒక సినిమా మన సమకాలీన సమాజం నుంచే వస్తుంది. కానీ తప్పకుండా ఆ సమాజమే దాని ఆడియన్స్ కానవసరంలేదు" అని విభిన్నంగా అభిప్రాయపడే ఆదూర్ చిత్రాలన్నీ స్త్రీ జీవితాల చుట్టు పరిభ్రమిస్తాయి. స్వయంవరంలో సీత పాత్రతో మొదలు పిన్నియం వరకు ఆయన సినిమాలన్నీ స్త్రీ పాత్రల మనస్తత్వాలను, ఉన్నతంగా, స్వతంత్ర భావాలతో చూపిస్తారు. ఇదంతా తనకు తన తల్లి ప్రభావం వల్లనే సాధ్యమైందని అంటారాయన. శారద కావ్యామాధవన్ వంటి తారలు ఆయన పాత్రలకు ప్రాణం పోశారు. నాలు పెన్నుంగళ్‌లో ఆయన స్త్రీ పక్ష పాతం తారాస్థాయికి చేరుకుంటుంది. అందుకే భారతదేశంలో మొయిన్‌స్ట్రీమ్ సినిమాలు సాధించిన రికార్డుల ముందు ఆదూర్ చిత్రాలు కళాత్మకంగా, సామాజికంగా, అంతర్జాతీయంగా సాధించిన విజయాలు మరింత ఉన్నత స్థానంలో నిలుస్తాయి. ఆయన కథా చిత్రాలే గాకుండా 20 డాక్యుమెంటరీలు నిర్మించారు. ఎ గ్రేట్ డే (1965), ఎ డే ఎట్ కోవలమ్(1966), ది మిత్ (1967), యువర్ ఫుడ్ (1989), రొమాన్స్ ఆఫ్ రబ్బర్ (1971), గురు చెంగన్నూర్ (1974), చోళాహెరిటేజ్ (1980) వాటిలో కొన్ని.

50 సంవత్సరాల సినిమారంగ సేవలకు పద్మశ్రీ (1984) మహాత్మాగాంధీ, కేరళ విశ్వవిద్యాలయాల గౌరవ డాక్టరేట్లు, దాదాఫాల్కే 2004 అవార్డు, కేరళ సాహిత్య అకాడమి పురస్కారం, పద్మవిభూషణ్ (2006) భూపేన్ హజారికా అంతర్జాతీయ పురస్కారం, వారి సినిమాలకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లెక్కలేనన్ని అవార్డులు వచ్చినవి.

'స్వయంవరం' నుండి 'పెన్నియమ్' వరకు తీసిన 12 సినిమాలలో కనిపించే ఒరవడి ఒక ప్రత్యేకమైన లయను తలపింపజేస్తుంది. అది ఎక్కడా తప్పినట్లు కనిపించదు. ఆయన పదమూడో చిత్రం కోసం విభిన్న సినిమా అభిమానులు ఎదురు చూస్తున్నారు.

– హెచ్.రమేష్‌బాబు,
m: 7780736386
e:rameshbabuh99@gmail.com




# దేశ భవిష్యత్‌పై ఆందోళన అక్కరలేదు

## ఏపీ ప్రభుత్వ సలహాదారులు కె.రామచంద్రమూర్తి

### హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'సిటిజన్ యాక్టివిజమ్ ఇన్ ఇండియా' పుస్తకావిష్కరణ సభ

**భా**రత రాజ్యాంగానికి భరోసా ఇచ్చేది నేటి యువకులే అని, దేశ భవిష్యత్‌పై ఎవరికీ ఆందోళన అక్కరలేదని ఏపీ ప్రభుత్వ సలహాదారులు కె.రామచంద్రమూర్తి అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని సి.రాఘవచారి వేదికపై డా.ఎన్.భాస్కర్‌రావు రాసిన 'సిటిజన్ యాక్టివిజమ్ ఇన్ ఇండియా' పుస్తకావిష్కరణ సభ డిసెంబర్ 31న జరిగింది. ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ సలహాదారులు కె.రామచంద్రమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ యువకులు రాజ్యాంగాన్ని తమ భుజస్కంధాలపై మోస్తున్నారని కొనియాడారు. రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా దేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇటీవల దేశంలో జరిగిన పరిణామాలు దీన్ని సూచిస్తున్నట్లు తెలిపారు. పౌరసత్వం బిల్లును వ్యతిరేకిస్తూ ఒక్క ముస్లింలే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజలు రోడ్లమీదకు వచ్చి పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమర్జెన్సీ సమయంలో బెంగుళూరులో తాను ఆంధ్రప్రభలో పనిచేస్తున్నప్పుడు గోయింగ్ గన్‌కే ధిక్కారణ ఉద్యమాన్ని చేసినట్లు తెలిపారు. అటువంటి నిర్భయమైన, సాహసం చేసే విషయాలపై మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. డా.భాస్కర్‌రావు ఇప్పటి వరకు 16 పుస్తకాలు రాశారని, ఇంకా ఆయన మరికొన్ని పుస్తకాలు రాయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డా.భాస్కర్‌రావు సిటిజన్ పుస్తకం రాసేపాటికి సిటిజన్ ఎమెండ్‌మెంట్ దేశంలో ఇంకా అమలుకాలేదన్నారు. దాంతో ఆ విషయాలను ఈ పుస్తకంలో కవర్ చేయలేదన్నారు. పౌరసత్వ బిల్లుపై ముస్లింలతోపాటు హిందువులు, సిక్కులు, క్రిస్టియన్లు ఇలా అందరూ కూడా దేశవ్యాప్తంగా నిరసనలు చేసినట్లు చెప్పారు. ఇటువంటి ప్రజలు ఉన్నందుకు గర్వపడాలని, బాధపడాల్సింది రాజకీయ పార్టీలే అన్నారు. ఎన్నికల్లో చెప్పిన ఏజెండా పట్టించుకోకుండా రాజకీయ పార్టీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తాయని చెప్పారు. నిరసన తెలిపే ప్రదేశం లేనంతమాత్రాన నిరసన ఆగదన్నారు. నిరసన చేయడానికి వంద మార్గాలుంటాయని, ప్రజలు వాటిని వినియోగించుకుంటారన్నారు. 2019 ప్రథమార్థంలో ఉన్నట్లు, మౌనంగా, నిస్తేజంగా ఉండకూడదని, 2020లో ఉత్తేజంగా ఉండాలని, ధిక్కారస్వరం వినిపించాలని, రాజ్యాంగాన్ని ఊరేగింపుగా జరుపుకోవాలని ఈ పుస్తకం తెలుపుతుందన్నారు. ప్రజల హక్కులను కాపాడుకోవాలని చెప్తుతుందన్నారు. 2020లో రాజ్యాంగ దశాబ్దంగా నిర్మించుకోవాలని, అందుకు ఇలాంటి పుస్తకాలు దోహద పడతాయన్నారు. 2019లో రాజ్యాంగం ఊరేగింపు జరుపుకోవాలని ఈ పుస్తకం అభిలషిస్తుందని, పౌరహక్కుల రాజ్యాంగ దశాబ్దంగా నిర్మించుకోవాలన్నారు. నిర్భయమైన ప్రజా హక్కులు సాధించుకోవడమే ఈ పుస్తకం లక్ష్యం అన్నారు.

**సిటిజన్ యాక్టివిజమ్‌లో సోషల్ జస్టిస్‌పై క్లుప్తంగా వివరణ : ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్ మణికొండ వేదకుమార్**

సభకు అధ్యక్షత వహించిన ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ 'సిటిజన్ యాక్టివిజమ్ ఆఫ్ ఇండియా' పుస్తకంలో దేశంలో సోషల్ జస్టిస్, ప్రొటెక్టింగ్, రైట్స్, ఎన్విరాన్‌మెంట్, కలెక్టివ్ జస్టిస్ తదితర అంశాలపై డా.భాస్కర్‌రావు క్లుప్తంగా వివరించడం గర్వకారణం అన్నారు. దేశంలో నిరసన తెలిపే



డా. ఎన్. భాస్కర్‌రావు, నాగసూరి వేణుగోపాల్, జూలూరు గౌరీశంకర్, శోభాసింగ్

హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని విభిన్నకోణాల్లో వైవిధ్యంగా చెప్పినవిధానం ఆకట్టుకుందన్నారు. డా.భాస్కర్‌రావు రెండు దేశాల యూనివర్సిటీల నుండి మాస్ కమ్యూనికేషన్‌లో పీహెచ్‌డీ చేసిన తొలి తెలుగు బిడ్డ అని కొనియాడారు. ఆయన దేశంలోని అడ్వైజరీ రోల్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, న్యూఢిల్లీ చైర్మన్‌గా, స్టడీస్ ఆఫ్ సోషల్ జర్నలిజం వంటి పలు అత్యున్నత పదవులు నిర్వర్తించినట్లు తెలిపారు. సివిల్ సొసైటీ యాక్టివిజమ్, ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవడం ఎలాగో పుస్తకంలో క్లుప్తంగా వివరించినట్లు తెలిపారు.

**స్వేచ్ఛ లేకపోతే క్లోనింగ్ సమాజం తయారౌతుంది :**

**రచయిత కటికనేని విమల**

సిటిజన్ యాక్టివిజమ్ ఆఫ్ ఇండియా సరైన సమయంలో, సరైన పుస్తకంగా రావడం గర్వకారణం అని రచయిత కటికనేని విమల అన్నారు. దేశవ్యాప్తంగా సీఏఏ, మహిళలపై, ఆదివాసీలపై అత్యాచారాలు తదితర సంక్లిష్టమైన సందర్భంలో ఇలాంటి పుస్తకం చాలా ప్రాముఖ్యత సంతరించుకున్నట్లు తెలిపారు. ఈ పుస్తకం గవర్నమెంట్, గవర్నెన్ అనేది గుర్తించాలని పాఠకులకు చెప్తుందన్నారు. ఇటు గవర్నమెంట్‌కు అటు ప్రజలకు ఎలా ఉండాలో క్లుప్తంగా వివరిస్తుందన్నారు. వ్యక్తులు కావచ్చు, గ్రూపులు కావచ్చు..మనకు సంబంధించిన హక్కులకు సంబంధించిన అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుందన్నారు. అధికారుల దృష్టిలో నుంచి చూసినప్పుడు నిఘా గురించి చెప్తుందన్నారు. పౌరస్పృహ లేకపోతే సమాజంలో చాలా ఇబ్బందిగా మారుతుందన్నారు. స్వేచ్ఛ లేకపోతే క్లోనింగ్ సమాజాన్ని తయారు చేస్తారన్నారు. ఇంటర్నల్ విజిలెన్స్ రెండు వైపుల ఉన్నప్పటికీ అందులో ఉన్న తేడాలను గమనించకపోతే గవర్నెన్ కుప్పకూలిపోతుందన్నారు. నిజానికి గవర్నెన్ అనేది మంచి గవర్నెన్స్‌గా ఉండాలంటే సిటిజన్ సెన్సివిటిని పట్టించుకోవాలన్నారు.

**సిటిజన్ యాక్టివిజమ్ మంచి పుస్తకం :**

**తెలంగాణ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ జ్వాల నరసింహారావు**

సిటిజన్ యాక్టివిజమ్ పుస్తకం చాలా అద్భుతమైనదని, ఈ రచయితకు తనకు 30 ఏళ్ల నుంచి పరిచయం ఉందని తెలంగాణ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ జ్వాల నరసింహారావు అన్నారు. ఆ పరిచయంతో భాస్కర్‌రావు ఏ పుస్తకం రాసిన తాను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన రాసిన 15 పుస్తకాలతో తనకు మంచి సంబంధం ఉన్నట్లు తెలిపారు. 1997లో ఐకె గుజ్రాల్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో భారతదేశం 50 సంవత్సరాల స్వాతంత్ర్యం గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో భాగంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఢిల్లీలో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఏదైనా మంచి పని చేయాలని దేశంలోని అందరూ సీఎంలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి, 9.యాక్షన్ ప్లాన్ తీసుకొచ్చినట్లు తెలిపారు. అర్జెంట్‌గా సిటిజన్ సెంట్రిక్ ప్లాన్స్ గనక తీసుకురాకపోతే ప్రజలకు ప్రభుత్వాల మీద నమ్మకం పోతుందన్నారు. ఆరునెలల్లో మార్పురావాలని ప్లాన్ చేసినప్పటికీ దేశంలోని 18 నెలల తర్వాత ఏ ఒక్కరాష్ట్రంలో కూడా అది పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. 1960 నుంచి ఇప్పటి వరకు పౌరుల్లో స్పందన ఉందని, సిటిజన్ ఎప్పుడూ కూడా యాక్టివ్‌గానే ఉంటారన్నారు. కానీ 9 పాయింట్ల యాక్షన్ ప్లాన్‌ను ఆ రోజు నుంచి ఈ రోజు వరకు అమలు చేసి ఉన్నట్లయితే చాలా మంచి అభివృద్ధి జరిగి ఉండేదన్నారు. ప్రజలు ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉన్నట్లు తెలిపారు. సిటిజన్స్ ఎక్కడైతే యాక్టివ్‌గా ఉంటారో అక్కడ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. గుడ్ గవర్నెన్స్‌పై డా.భాస్కర్‌రావు మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు.

**దేశాన్ని పార్టీలే పరిపాలిస్తున్నాయి :**

**సిటిజన్ యాక్టివిజమ్ ఆఫ్ ఇండియా పుస్తక రచయిత డా.ఎన్.భాస్కర్‌రావు**

సిటిజన్ యాక్టివిజమ్‌ను దేశంలో టాప్ లెవల్ నుంచి గ్రామంలోని కింది స్థాయి వరకు చాలా మంది అపార్థం చేసుకుంటున్నారని పుస్తక రచయిత సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ న్యూఢిల్లీ చైర్మన్ డా.ఎన్.భాస్కర్‌రావు అన్నారు. ప్రభుత్వాలు, పార్టీలే దేశాన్ని పాలిస్తున్నాయని, ప్రజలు ఎక్కడున్నారోనని వెతుక్కోవాల్సి వస్తోందన్నారు. అందుకే ఈ పుస్తకం రాయాల్సిన అవసరం వచ్చిందన్నారు. అందుకనే గ్రామ, రాజకీయ, పరిస్థితులను గమనించి గత 70 సంవత్సరాలకుపైగా జరుగుతున్న సందర్భాలు, 17 ఎలక్షన్లు, 8 పార్టీలు ప్రభుత్వంలోకి వచ్చాయని, అయినా ప్రజల్లో పెద్దగా మార్పు రాలేదన్నారు. ఏ వ్యవస్థ కూడా సుప్రీం కాకూడదని, కానిస్టిట్యూషన్ ఏర్పాటు చేశారని, కానీ నేడు పొలిటికల్ పార్టీలే దేశాన్ని అన్ని రంగాల్లో



కె. రామచంద్రమూర్తి, జ్వాలా నరసింహారావు, యం. వేదకుమార్, కటికనేని విమల

ఆధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు పాత్ర ఇవ్వకపోతే అభివృద్ధి ఎలా చెందుతుందన్నారు. ప్రజలు చర్చించుకోవడానికి సరైన అవకాశం ఇవ్వాలన్నారు. ఒక సమస్య చర్చించుకోవాలని, అప్పుడే దానికి సరైన పరిష్కారం లభిస్తుందన్నారు. 35 నగరాల్లోనే కాకుండా, మిగతా నగరాల్లో విద్యాసంస్థలు నాశనమవుతుండటానికి కారణం ప్రజలకు సరైన అవకాశాలు ఇవ్వకపోవడమే అన్నారు. ప్రజలను మభ్యపెట్టి, పరిపాలిస్తున్నారని, ప్రజల మీద ప్రభుత్వం ఆధారపడాలి కానీ ప్రభుత్వం మీద ప్రజలు ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. దేశ రాజధాని మొదలుకొని గ్రామస్థాయి వరకు పౌరహక్కులకు భంగం కలుగుతుందని, గ్రామ రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకం రాసినట్లు తెలిపారు.

**35 నగరాలు, 105 సివిల్ సొసైటీ హాట్‌స్పాట్స్ గురించి ఈ పుస్తంలో రాశారు : రచయిత నాగసూరి వేణుగోపాల్**

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో మాట్లాడుతున్నామంటే ఇందిరాపార్కు వద్ద మాట్లాడుతున్నట్లు అనిపిస్తోందని రచయిత నాగసూరి వేణుగోపాల్ అన్నారు. ఒకవేళ ఇందిరాపార్కు ప్రాణం పోసుకొని మాట్లాడితే ఎన్నో వేదనలు, ఆక్రోశం, ఆవేదన, ప్రతిఘటనా స్వరం వినిపిస్తుం దన్నారు. ఈ పుస్తకం కూడా అలాంటి పుస్తకమే అన్నారు. సిటిజన్ యాక్టివిజమ్ ఎట్లా ఉంది, భారతదేశంలో దాదాపు 35 నగరాల్లో 105 సివిల్ సొసైటీ హాట్‌స్పాట్స్ గురించి పుస్తకాన్ని రచయిత వివరించినట్లు చెప్పారు. యాక్టివిజమ్‌పై గత 25 సంవత్సరాల నుంచి అబ్దుల్ కలాంతోపాటు చాలా మంది పుస్తకాలు రాసినట్లు తెలిపారు. ప్రతి రోజూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ఏదో ఒక అంశంపై నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. 2017లో నిరసన తెలపకూడదని ఒక నిర్ణయం వచ్చిందని, నిరసన తెలిపే హక్కు ఉండాలని మానవ హక్కుల కమిషన్ తీర్పు ఇచ్చిన విషయాలు కూడా పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ పుస్తకంలో రాజ్యం, పౌరులు, రాజ్యం ప్రభుత్వం మధ్య సంబంధాలు, ఎన్‌జీవోలు ఇలాంటి చాలా విషయాలపై కులంకుషంగా వివరించినట్లు తెలిపారు. యాక్టివిజమ్ ఆరో స్తంభం అని, చాలా వివరంగా పుస్తకం రాయడం గర్వకారణం అన్నారు. వ్యవసాయం, రైతులు, విద్యారంగం, అసంతృప్తి, ఆవేదన, మీడియా..ఇలా విశేషమైన సమాచారం, విభిన్నమైన అంశాల సమాచారం క్రోడికరించి యాక్టివిజమ్ పుస్తకం రాయడం అభినందనీయం అన్నారు.

ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ శోభాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

– కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com





# అప్పుడప్పుడు - 11

నిశ్శబ్దంలోకి
పెద్ద శూన్యంలోకి
ఎక్కడెక్కడికో
ఎందుకో
ఈ ప్రయాణం
అలుపుసొలుపు లెరగకుండా
అంతం లేకుండా.

నిర్మలత్వానికి
అంకురార్పణ చేసే
యజ్ఞ ఆహుతిలో
ఏ చోటని చెప్పను
ఏ సూత్రమని విప్పను
ఏ జపమాలలోని
అంకెల అక్షరాల
శూన్య ద్వారాల గుండా
ధగధగ మెరిసే
కిరీటాల తలలపై నుండి
దూసుక పోతోంటే
వింత వింత సంగీత ధ్వనులు
పుష్పవాసనలై
చుట్టు మూగుతూ ఉంటే
అదో విశ్వవాణీ
సంరంభంగా
ఉధృతంగా
ఉత్సాహం

కట్టలు తెంచుకోగా
ఓహఁ !

కాలం కళ్ళలో
వెలిగే లోకంలో
ఆకాశం అంచులతో
ఆడుకోవడానికి
గుండెల నిండా
గాలి పీల్చుకొని
గాలిపాటలు
పాడుకోవడానికి
నదీనదాలు
పర్వత శిఖరాలు
లోయలు
సెలయేర్లు
జలపాతాలు
మంచు శిఖరాలు
ఎడారుల ఈలపాటలు
అన్నీ ఆనంద సాగరాలే
అక్కడక్కడ
అసావేరి రాగాలు.

అడుగులో అడుగుపడి
నూతన సృష్టిలో
అన్నీ ఆనవాళ్ళకు ఆవల
ఒక పూర్తి వృత్తాకారానికి
నాలుగు కోణాలతో రాటుదేల్చి
వస్తే వస్తాను
మళ్ళీ మళ్ళీ
సుఖసంతోషాల గాలి పీల్చడానికి
గెంతడానికి
వరదలా ఉప్పొంగడానికి
సూర్యాస్తమయాల మధ్య
ఉయ్యాల లూగడానికి.

నా ఆనవాళ్ళు ఏమైనా ఉన్నాయా!
వాటిని ఎవరైనా గుర్తు పడ్తారా!
ఆనవాళ్ళు లేని నేలలో
నేలలాంటి ఆకాశంలో
ఆకాశంలాంటి అంతరంగంలో
విహరించేవాణ్ణి

అర్ధమరాత్రి
గుడ్డలన్నీ విప్పేసి
నగ్నంగా
మంచు సముద్రంలో
గభీల్మని దూకుతాను
నా కళ్ళముందు
రక రకాల రంగులు
తేలి తేలి పారుతుంటాయి
రేఖలు పోటీపడి
పరిగెత్తుతుంటాయి.

సుఖం దుఃఖం
ఎప్పుడో ఏట్లో కొట్టుకపోయాయి
ఇక ఉన్నది ఏమిటి?
ఒకే ఒక్కటి
అది చిరుమందహాసం
అది ఎప్పుడూ చెక్కుచెదరలేదు
మైనంతో కాదు
అది కంచుతో చెక్కబడింది.

కుటుంబం సమాజం
ఇవి చాలా చాలా
వాడి అరిగిపోయిన
పర్యాయపదాలు
వాయిస్తున్నప్పుడి
వేళ్ళ నెత్తురు చిందే
మనోవీణ మోతకు
సప్త సముద్రాలు
పోటెత్తుతాయి.
ఆగి ఆగి మోగేది
జీవభాషనే కావొచ్చు
భాషలేని తనమూ ఉంది
నిశ్శబ్దంతో
నగీషీలు చెక్కబడ్డ
మంచుశిఖరం
అమాంతంగా నా మీదపడి
కౌగిలించుకుంటుంది
నాకస్సలు ఊపిరి సలపదు.

మంచూ కౌగిలించుకుంటుంది
మంటా కౌగిలించుకుంటుంది
గాలి గమ్మత్తుగా వంకర్లుతిరుగుతు
నా గమనాన్ని అడ్డుకుంటుంది



రమ్మన్నది రాదు
పొమ్మన్నది పోదు
రాకపోకలమధ్య
ఏదో వింత గూడు
దోబూచులాడుతుంది.

ఏమవుతుందో
తెలుసుకునేందుకు
ఒక్కసారిగా
బిగ్గరగా అరుస్తాను
విచిత్రం
అసలు శబ్దమే లేదు
రాగం లేదు
తానం లేదు
రుతువూ లేదు
క్రతువూ లేదు
ఉన్నది లేదు
లేనిది ఉన్నది.

ఇదే క్రమం
ఇదే పరంపర
ఇదే మార్గం
ఇదే మంత్రం
ఒకొక్క అడుగే పడనీ
ఒకొక్క కలనే
నరుక్కుంటూ వెళ్ళిన
వీధులు లేవు
దిక్కులు లేవు
పక్కలు లేవు
వేటి అవసరమే లేదు
అవసరం అన్నది
తన అస్థిత్వాన్నే కోల్పోయింది.

రంగు రుచి
వాసన
ఇవైనా ఉన్నాయా
ఇవన్నీ
నవ్వు తెప్పించే మాటలు
అసలు నవ్వులు పువ్వులు ఉంటేగా
ఒకే ఒక
చెక్కిన
చిరు మందహాసం
మాత్రం
మొఖంపై

పళయ తాండవం
చేస్తూ ఉంటుంది.

ఎన్నింటిని తప్పించుకుని
ఇంత దూరం వచ్చాను
కాని ఈ దూరం
తప్పించుకోకుండా ఉంది
అందీ అందనట్టుగా ఉంది
అందాల భరిణను పోలి ఉంది
అంగబలం అర్థబలం
బుద్ధిబలం
చక్కగా సర్ది
ట్రంకుపెట్టెలో
బంధింపబడి ఉన్నాయి
మరి ఇక ఉన్నదేమిటి?
వెయ్యి కాళ్ళ జెర్రి

ఎన్ని కాళ్ళు విరిగినా
ప్రయాణం ఆగదు
అవి మళ్ళీ మళ్ళీ
పుట్టుకు వస్తూనే ఉంటాయ్!
ఏదీ ఆగదు
ఏదీ స్థిరంగా ఉండదు
అస్థిరంగానూ ఉండదు
అంతా ఉండీలేనట్టు
కేకను
గాలిలోకి విసిరినట్టు
కేకా వినబడదు
గాలి సోకినట్టూ తెలియదు.

ప్రయణం
నడుస్తూనా
గెంతుతూనా
దొర్లుతూనా
ఎగుర్తూనా
కొట్టుకపోతూనా
ఎలా తెలుస్తుంది
అది తెలిస్తే
ఆ ముడివిప్పితే
అన్ని ముడులు విప్పినట్టే
ఐనా
అన్నీ ఎందుకు తెలియాలి
తెలిసి చేసేదేమిటి?

తెలియకా చేసేది లేదు
'తెలిసీ తెలియక'
అన్నదే సూత్రమై ఉంటుంది.

రారా
రాజా
రావా
ఏమైనావ్
ఎక్కడికెళ్ళావ్
కనిపించవా
ఇక ఎప్పుడూ కనిపించవా?
వినిపించనే వినిపించవా!
తీసెయ్
జ్ఞాపకాల తెరని తోసెయ్
అదుగో
యెనబోతులా
తెరలు తెరలుగా
దొర్లుతూ వస్తుంది
అది ఏమిటో?
అది నా పైనుండి వెళ్తుందా!
కింది నుండి వెళ్తుందా!!
లేక నన్ను చీల్చుకొని వెళ్తుందా!!!

ఐతే
దాన్ని చీల్చుకొని వెళ్ళే
శక్తి నాకుందా?
ఏమో?
ఏది తెల్పిందని
ఇది తెలియడానికి.

ఇసుర్రాయి తిరిగే చప్పుడు
పెరిగి పెరిగి ఇంకా పెరిగి
భువనభోంతరాలను
చుట్టేసింది
ఇంకా నాకేమీ కనబడదు
వినబడదు.

మళ్ళీ సద్దుమణుగుతుందా!
అసలేమణుగదా!!
అగమ్యగోచరం...

-బి. నరసింగరావు

# నేత్ర పర్వంగా సోమనాథ కళాపీఠం పురస్కార ప్రదానోత్సవం

మహాకవి పాలకురికి సోమనాథుని జన్మస్థలమైన తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మినరసింహ స్వామి దేవస్థాన ప్రాంగణంలో 2019 డిసెంబర్ 29 ఆదివారం నాడు సోమనాథ కళాపీఠం పురస్కార ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. సభా కార్యక్రమానికి ముందు ప్రాంగణంలోని బసవేశ్వర, సోమనాథ విగ్రహాలకు నిర్వాహకులు పూలమాలలు వేసి శరణు ఘటించింద్రు. పీఠం కార్యదర్శి తమ్మి దిలీప్ కుమార్ సమావేశ పరచగా, అధ్యక్షురాలు రాపోలు శోభ రాణి సభాధ్యక్షత వహించింద్రు. గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ సభా సమన్వయం చేసింద్రు. పూర్వ పార్లమెంట్ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్, తెలంగాణ గిరిజన ఆర్ ప ృథ్వి' "వీరమనేని చలపతి రావు ప్రోత్సాహక సాహిత్య పురస్కారం"బీ రాఘవాపురం శాస్త్రవేత్త 'డాక్టర్ పెంతల సుధాకర్' "డాక్టర్ రాపోలు సోమయ్య స్మారక ప్రతిభా పురస్కారం" అందుకొన్నరు. కాగా, విజయవాడ నుంచి వచ్చిన 'శంఖుల శ్యామ్' సోమనాథుని సాహిత్యాన్ని ధ్వనిముద్రణ చేయిస్తున్నందుకు "సోమనాథ ప్రియ"బీ మంద్ర స్వర మాంత్రికుడు వరంగల్ వాసి 'పోగుల సాంబయ్య' "స్వర సాంద్ర" బిరుదులను స్వీకరించింద్రు.

ఈ పురస్కృతులను శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం, పోల్సాని వేణుగోపాల్ రావు, పందిళ్ల అశోక్ కుమార్ సోదరులు, వీరమనేని శేషగిరి రావు మెమోరియల్ ట్రస్ట్, రాపోలు సుభద్ర, దేవగిరి సోమన్న



సహకార సంస్థ మాజీ చైర్మన్ ధరావత్ మోహన్ గాంధీ నాయక్ ప్రత్యేక అతిథులుగా విచ్చేయగా, నేషనల్ బుక్ ట్రస్ట్ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల కార్యక్రమ అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు విశిష్ట అతిథులుగా సభను అలంకరించింద్రు. 2018 సంవత్సరానికి ఎంపికైన సాహితీ మూర్తులకు, ప్రతిభా వంతులకు అతిథుల చేతుల మీద పురస్కార ప్రదానం జరిగింది.

జమ్మలమడుగుకు చెందిన బసవ పురాణ పరిశోధకుడు 'డాక్టర్ సత్తెనపల్లి బాబు' "సోమనాథ సాహిత్య పురస్కారం"బీ మహబూబ్ నగర్ కు చెందిన బహుగ్రంథకర్త, విశ్వగురు పత్రిక సంపాదకుడు లింగైక్య 'కొండ బసవరాజు' పక్షాన ఆయన కుటుంబ సభ్యులు "సోమనాథ సామాజిక శోధన పురస్కారం"బీ పౌరాణిక నటుడు, పరకాల నివాసి 'ఏరుకొండ రామదాసు' "సోమనాథ రంగస్థల పురస్కారం"బీ వరదన్నపేట కవి, ప్రపంచ రికార్డ్ గీత రచయిత 'మౌనశ్రీ మల్లిక్' "విశేష పురస్కారం"బీ సిద్ధిపేట రచయిత 'ఐత చంద్రయ్య' "పందిళ్ల శేఖర్ బాబు రాజయ్య శాస్త్రి స్మారక స్వచ్ఛంద భాషా సేవ పురస్కారం"బీ రాజమహేంద్రవరం సాహితీవేత్త 'ఎస్ శర్మ సోదరుల సౌజన్యంతో అందచేసింద్రు.

రాజ్యసభ మాజీ సభ్యులు రాపోలు ఆనందభాస్కర్ ప్రత్యేక అతిథిగా ప్రసంగిస్తూ, సోమనాథుని భావజాలాన్ని భవిష్యత్ తరాలకు అందించ వలసిన అవసరాన్ని గుర్తు చేసింద్రు. పండిత భాష ప్రామాణికంగా ఉన్న రోజుల్లో ప్రజల వాణిలో, ప్రజల బాణిలో వ్రాసిన కవి పాల్కురికి సోమనాథుడు అన్నరు. అందుకే సోమనాథుడు కేవలం శివ కవిగా మాత్రమేగాక, ప్రజల కవిగా ప్రసిద్ధి చెందిండని, విప్లవ కవిగా కీర్తి పొందిండని రాపోలు చెప్పింద్రు. వ్యయ ప్రయాసల కోర్చి ఎంతో దీక్షతో 27 ఏండ్లుగా సోమనాథ కళా పీఠం కార్యకలాపాలను కొనసాగిస్తున్న నిర్వాహకులను ఆయన ఈ సందర్భంగా ఆయన అభినందించింద్రు.

నేషనల్ బుక్ ట్రస్ట్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఇన్ చార్జ్ డాక్టర్ పత్తి పాక మోహన్ మాట్లాడుతూ, తెలంగాణ సాహిత్య గడ్డ, అడ్డా అన్నరు. సోమనాథుడు తొలి స్వతంత్ర కవి, విజ్ఞాన కవి, విశేష కవి అని అన్నరు. ఇక్కడి పాలకుర్తి ప్రాంతంలో ఏదో తెలియని మహత్తు ఉందని, అందుకే ఇక్కడి నుంచి సోమనాథుడు, బమ్మెర పోతన మొదలు నేటిదాకా అనేక మంది కవులు, రచయితలు పుట్టుక

వస్తున్నరని అన్నరు.

ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఉషా దయాకర్ రావు మాట్లాడుతూ, సోమనాథ కవి రచనా విశిష్టతలను ఇప్పటి ప్రజలకు అందించ వల్సిన బాధ్యతను కవులు, రచయితలు తీసుకోవాలన్నరు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలను చేపడుతున్న పీఠం కార్యవర్గాన్ని అభినందించింద్రు. మంత్రి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో బిజీ గా ఉండటం వల్ల తాను వచ్చిన్నని సంతోషం వ్యక్తం చేసింద్రు.

తెలంగాణ గిరిజన సహకార సంస్థ పూర్వ చైర్మన్ మోహన్ గాంధీ నాయక్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంత రావు తదితరులు ప్రసంగించింద్రు. కార్యక్రమంలో కుమారి పోగుల చైతన్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, సాంబయ్య శివ పంచాక్షరి గానం అందరినీ అలరించినయి. అంధ కళాకారులు మారోజు భీష్మాచారి, శంకరాచారి సోదరులు వాద్య సహకారం అందించింద్రు.

ఇంకా ఈ కార్యక్రమంలో ప్రముఖులు గుండేటి శ్రీధర్, ఏ సోమేశ్వర్ రావు, పందిళ్ల అశోక్ కుమార్, డాక్టర్ పల్లేరు కళాధర్, ముస్కు రాంబాబు, మదార్, సర్వర్ ఖాన్, కొండ బసవరాజు కుమారుడు మహేశ్ చంద్ర, సాహితీ వేత్తలు డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, డాక్టర్ పల్లేరు వీరస్వామి, జిలుకర వెంకన్న, అవసరాల ప్రసాద శర్మ, సొన్నాయిల కృష్ణవేణి, ఏరుకొండ శశిరేఖ, పత్తిపాక చందన, మాన్యపు భుజేందర్, కూటికంటి సోమయ్య, గందె పుల్లయ్య, దేవస్థాన సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సిబ్బంది అశోక్, సతీశ్, సుధాకర్, నిరంజన్, అర్చకులు దేవగిరి రామన్న, దేవగిరి లక్ష్మన్న, డివిఆర్ శర్మ, అనిల్ శర్మ, మత్తగజం నాగరాజు, చిక్కమఠం పర్వతప్ప, పీఠం బాధ్యులు ఇమ్మడి దామోదర్, జక్కుల రవీందర్, మార్గం లక్ష్మీ నారాయణ, గుమ్మడి రాజుల సాంబయ్య, వీరమనేని వెంకటేశ్వర్ రావు, మేరుగు మధు, మామిండ్ల రమేశ్ రాజా, గూడూరు లెనిన్, మార్గం సాయి సందీప్ తేజ, శంకరమంచి శ్రీకాంత్, చిలుకమారి వాసుదేవ్, మోకాటి కుమార్ తదితరులు పాల్గొన్నరు.

–డాక్టర్ రాపోలు సత్యనారాయణ
m : 9440163211
e : somanathakalapeetham@gmail.com



# పసిపాపను నేను

నవమాసాలు అమ్మ కడుపులో
రక్తమాంసాల మధ్య పరిచయం
లేని ఒంటరి జీవితాన్ని గడిపిన పసిపాపను నేను

కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టి
నవమాసాల పాలబుగ్గ వయసులో
పాపాత్ముడి చేతిలో బలైన పసిపాపను నేను

పరాయివాడైనా పాపాయిలా నన్ను
నవ్విస్తాడనుకున్నాను కాని కామంతో
కవ్విస్తాడని కలలో ఊహించని పసిపాపని నేను

అమ్మఒడికి దూరమై ఆడి పాడే
వయసులో అందమైన ప్రపంచం
నుండి నేడు అదృశ్యమైన పసిపాపను నేను

కామంతో కళ్లు మూసుకుపోయి
సిగ్గులేని సభ్యసమాజంలో తలదించి
తనువును చాలించిన పసిపాపను నేను

ఏ ఘడియలో నిద్ర లేచానో కాని
మలి ఘడియ రాకముందే కానరాని
లోకానికి చేరుకున్న నేటి పసిపాపను నేను

పాలబుగ్గల నా పసి బాల్యం
తల్లిదండ్రుల సాక్షిగా కామాంధుడి
చేతిలో స్మశానానికి దగ్గరైన పసిపాపను నేను

– కమ్మరి శ్రీనివాస్ చారి
m : 9177324124
e : srinivascharydbd@gmail.com

# "దోస్తులు చెప్పిన కథల్లో జగదీశ్వర్ రచనా పరిపక్వత"

"బాలలే విజ్ఞాన హేతువులు
నేడురేపుల మధ్య సేతువులు
చంద్రబంధుర సుధాశీతువులు
మానవత్వవికాస ధాతువులు"

-శ్రీశ్రీ

బాలల కథకుడు పెండెం జగదీశ్వర్ అసువులుబాసి ఏడాది. ఆయన్ను సంస్మరించడం సాహిత్య అధ్యాపకుడిగా నా కర్తవ్యం.తెలుగులో బాలసాహిత్యం విస్తృతికి నల్లగొండ జిల్లా వాసిగా జగదీశ్వర్ వేసిన దారి వినూత్నమైనది.

ఆయన పూర్ణజీవనం గడిపి ఉంటే బాలసాహిత్య రంగంలో ఇప్పుడు అందరూ కీర్తిస్తున్నట్టుగానే మరింత ఖ్యాతి గడించేవాడు.తను రాస్తున్న విధానం అనుభవం మీద ఇంకింత పరిపక్వంగా రాటుదేలేది.మన కాలపు బాలసాహిత్యవేత్తలు రెడ్డి రాఘవయ్య, భూపాల్, తిరునగరి వేదాంత సూరి వంటి వారి సరసన నిలబడేవాడు. ఈ మాట అంటున్నది జగదీశ్వర్ కృషిని తక్కువ చేయడానికి ఎంతమాత్రం కాదు. రచయితలుగా మనందరం పరిపక్వంగా ఎప్పటికి రాయగలుగుతాం అనేది తెలిసిరావడానికి అంటున్నాను. ఇదే విషయాన్ని గురించి Ellison Wells అనే రచయిత్రి తన The life stages of a short story writer అనే వ్యాసంలో ఇట్లా As we grew within our writing experience we pass through different stages.You gain maturty,you just know thing you didn't understand before.This presents a feasible analogy with life and it s stages towards adulthood." అంటారు.ఈమె రచయితల రచనా జీవితాన్ని Baby Stage, Childhood Stage,Teenage,Young Adult, Adult Stageలుగా విభజించి విశ్లేషించారు. సైకాలజీలో మనిషి యొక్క 15-21 సంవత్సరాల మధ్య కాలాన్ని ప్రకృష్టాత్మ దశ (high self value age)అంటారు. ఈ దశ ఉత్తరార్థంలో రచయిత రచన ఆరంభిస్తాడు. అంటే 18-28 baby age,28-38 childhood, 38-48 teenage,48-58young adult age,58-68 adult age ఈ స్కేలు ప్రకారం పెండెం జగదీశ్వర్ శిశు,బాల్య,కౌమార దశలను మాత్రమే పూర్తి చేసుకోగలిగాడు.

జగదీశ్వర్ కృషిలో 'దోస్తులు చెప్పిన కతలు' హైద్రాబాద్ మంచిపుస్తకం వారు మే 2018లో ప్రచురించారు. ప్రముఖ చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్ పుస్తకానికి ముఖచిత్రంతో పాటు ఈ కథల్లో సన్నివేశాలకూ బొమ్మల్ని రూపుదిద్దాడు. ఈ కథలు పిల్లల్ని పెద్దల్ని తన లఘు పీఠికలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నట్టు నిజంగానే "జనపదాల్లోకి నడిపించే కథలు". ఇవి జగదీశ్వర్ స్వీయ సృజన కాదు. తనేచెప్పినట్టు "నా బాల్యంలో నా మిత్రులు ముఖతా విన్న అనేకానేక కథల్లోంచి ఇరవై కథల్ని ఎంపిక చేసుకొని ఇలా దోస్తులు చెప్పిన కతలుగా మీ ముందుంచుతున్నాను" అనడంతో ఇవి సేకరణ కథలు అని మనం గుర్తించాలి. అంటే వీటిలో తప్పొప్పులకు రచయిత బాధ్యత వహించాల్సిన పనిలేదు. ఐనా సేకర్తగా లేఖకుడిగా జగదీశ్వర్ కొంత సరిదిద్దితే బాగుండేది. సరిదిద్దడం అనే స్థాయి రచయిత రచనా మెళుకువలకు సంబంధించినది.ఇది పూర్తిగా వ్యక్తిగతమైనది, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించినది. విమర్శకుడి పరిధిలో రచయిత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడా చర్చించబడతాయి. యూరప్‌లో 1760-1840 మధ్య కాలంలో బాలల హక్కుల ఉద్యమం జరగడంతో బాలసాహిత్యం యొక్క అవసరం చర్చకొచ్చింది. ఆ తర్వాత మిగతా దేశాల్లో బాలల సాహిత్యం పురుడు పోసుకుంది. ఇరవైయ్యో శతాబ్దాన్ని బాలసాహిత్యానికి 'స్వర్ణ యుగం'అన్నారు సాహిత్య విమర్శకులు. జగదీశ్వర్ బాలసాహిత్య స్వర్ణయుగం తదనంతరం మరో నూతన ఒరవడికి వాకిళ్లు తెరిచే కాలంలో జన్మించిన తెలంగాణ బిడ్డ.

యూరప్‌లో 1760-1840 మధ్య కాలంలో బాలల హక్కుల ఉద్యమం జరగడంతో బాలసాహిత్యం యొక్క అవసరం చర్చకొచ్చింది. ఆ తర్వాత మిగతా దేశాల్లో బాలల సాహిత్యం పురుడు పోసుకుంది. ఇరవైయ్యో శతాబ్దాన్ని బాలసాహిత్యానికి 'స్వర్ణ యుగం'అన్నారు సాహిత్య విమర్శకులు. జగదీశ్వర్ బాలసాహిత్య స్వర్ణయుగం తదనంతరం మరో నూతన ఒరవడికి వాకిళ్లు తెరిచే కాలంలో జన్మించిన తెలంగాణ బిడ్డ.

ఏదేశంలోనైనా బాలసాహిత్య గ్రంథానికి ఉండాల్సిన ముఖ్యమైన నాల్గు లక్షణాలు ఇవి. 1. సాధారణ ఇతివృత్తం- ఆలోచన (Simple idea-theme), 2. వాస్తవిక పాత్రలు (Characters that are real),3.నీతిని చెప్పడం (Contain moral lessons), 4.పఠనీయ కథనం మరియు మనోహరమైన బొమ్మలు (Readable text and captivating illustration). ఈ నాలుగు అంశాలు 'దోస్తులు చెప్పిన కతలు' పుస్తకంలో సరిపడా ఉన్నప్పటికీ కథల్లో అవసరంలేని ఘటనలు, ఒక రసం నుంచి దానికి వ్యతిరేక రసంలోకి కథ మార్చబడిన అంశాలను నేను చర్చించాలనుకుంటున్నాను. ఈ చర్చ కథకుడికి గల ఖ్యాతిని భంగపరచడానికి కాదని మళ్లీ ఒకసారి విన్నవించు కుంటున్నాను. మొదటి కథ 'శెట్టుకు పుట్టిన గుర్రం'. ఎటువంటి వాళ్లకు అటువంటి వాతే పెట్టాలంటరు పెద్దలు.ఈ కథ అటువంటిదే.పిల్లల కథ కాబట్టి నక్క ఇందులో నక్క ఐంది.లేదంటే మనిషే .అవతలివాడు అడ్డంగా మాట్లాడితే అంతే అడ్డంగా మాట్లాడే మనిషే. బాలల కథాలక్షణాల్లో చోద్యం (Fantasticalness), ఔపదేశిక వాస్తవికత (Didactic realism) లు బాగా కుదరాలి. అందుకే "మీ వూర్లె శెట్టుకు గుర్రం పిల్ల పుట్టంగలేంది మా వూర్లె శెర్వు తలుగవడదా, శాపలు శెట్లెక్కయా?" అని నక్కతో మాట్లాడించారు జగదీశ్వర్. ఈ కథ విన్నా చదివినా ఎగిరి గంతేస్తారు పిల్లలు. రెండోకథ 'రాజుగారి

శిన్నబిడ్డె' మనుషుల మైండ్ సెట్‌ను వివరిస్తుంది.ప్రపంచం మీద మొత్తం మానవాళికి పదిహేను రకాల మైండ్ సెట్స్ ఉంటాయని మనోవైద్యశాస్త్రవేత్త ఎడ్వర్డ్ డి. బొనో చెబుతాడు. కథలో రాజుగారి పెద్ద బిడ్డలు ఆరుగురిది అసూయా మనస్తత్వం (Evvy mindset), చిన్నమ్మాయిది కృతజ్ఞతా మనస్తత్వం (Gratitude mindset). కథ కారుణ్య కథ కావటాన పసివాండ్లకు బాగా నచ్చుతుంది. భాషాపరంగా చూసినప్పుడు 'సమంగ, టైము, ఆహారం' అనే పదాలకు బదులు 'ఒక్క తీర్గ,అదను,తినంగ'అంటే కథాకాలపు భాషావరణం సిద్ధించేది. సేకర్త కథను రాసుకునేటపప్పుడు భాషావరణం దెబ్బతినకుండా చూసుకోవాలి.

మూడోకథ'అడిగింది ఒకటి అనుకుంది ఒకటి' గొల్లల అమాయకత్వాన్ని , ఆ అమాయకత్వంలోంచి వచ్చే ధైర్యాన్ని ప్రదర్శించే కథ.రాజు తనకు తట్టిన ఆధ్యాత్మిక ప్రశ్నకు జవాబును రాబట్టే కథ.కథ కట్టిన జానపదుడి ప్రకారమే చూస్తే ఒకటికి రెండిచ్చే మనస్తత్వం గల యాదవుడు మూడోగొర్రె దగ్గర వెనక్కి పోడు. ఐనా అడుగుతుంది రాజుగారు. ఒక్కటి ఎక్కువ ఇస్తే మంద ఏం తగ్గదు. ఏ గాలో ధూళో సోకి చచ్చింది అనుకుంటడు. మందల చచ్చింది మందల్నే పుడుతుంది అనేది యాదవుల విశ్వాసం. ఒకవేళ రాజు లెక్క ప్రకారమే ఐతే భూమి నలుమూలలు తిరిగే గొల్లనికి సృష్టి రహస్యాలు అందరికంటే ముందుగాలనే తెలుసు. శివుడు యాదవుల కులదైవం. విష్ణువు యాదవుల ఇంట పాలుమీగడ వెన్నెలలు తాగి పెరిగిన వాడు. విష్ణు తనయుడు బ్రహ్మ గీతను రాతను గొల్లలు నమ్మినట్లు సృష్టిలో మరెవ్వరూ నమ్మరు. దీన్ని గణనలోకి తీసుకుంటే కథ మరోరకంగా ముగిసేది. సాహిత్యంలో బహుజన దృక్పథం వెల్లివిరుస్తున్న తన కాలంలో ఇట్లాంటి కథ చెప్పడం వలన కథకుడి కాలస్పృహ అవగతమవుతుంది. ఈ కథ పిల్లలకు నిజంగా హాస్యం పరిధి దాటి అర్థమైతే జగదీశ్వర్ పిల్లలకు శత్రువు అవుతాడు.ఎందుకంటే ఇవాళ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నవాళ్లలో గొల్లకురుమల పిల్లలే అధికం.ఈ కథ రాజుల పిల్లలకు సరిపోతుంది. దిగువజాతుల బిడ్డలకు అంతగా అవసరపడదు. సబాల్టర్న్ వర్గాలను బుద్ధి హీనులుగా చిత్రించే కథలు వాటిల్లో ఎంత మెలిక (Twist) ఉన్నా సేకర్తలు పక్కన పెట్టాల్సిందే, లేదంటే సవరించాల్సిందే,కాదంటే కాన్షియస్ గా చేసిన సృజనాత్మక తప్పిదం అవుతుంది.నాల్గో కథ 'పైసలిచ్చే మేక'. ఇదీ గొల్లపిల్లవాడి అమాయకత్వాన్ని' రూకల్ని నూకలు' అనుకుని మందను పోగొట్టుకునే కథ. బాలబాలికలకు కథలు వినిపించడం ద్వారా మనం నీతి,న్యాయం, ధర్మం, సాహసం, కరుణ, ఔదార్యం నేర్పుతం.మరి ఈ కథ పైసలుంటే మస్తు మంది పనివాండ్లను పెట్టుకొని బ్రతకొచ్చు అనే భావన కల్గిస్తుంది.కథలో వినోదం పండినప్పటికీ , పైసలు రాల్తావుంటే పేదోళ్లకు పంచిపెట్టినరు అనే ఒక్క మాట కనుక చివర్లో ఉంటే ప్రపంచంలోనే గొప్ప బాలలకథ అయివుండేది. శ్రేష్ఠ వర్గ సంస్కృతి (Elites culture) మాయలో జగదీశ్వర్ ఒక మంచి కథకు గొప్ప కథకు చెడ్డ ముగింపు అనలేం కాని, ఇవ్వాల్సిన ముంగిపు ఇవ్వలేకపోయాడు అనే చెప్పాలి.

ఖననం, ఖండనం, హింస, జుగుప్స, వంటి అంశాలు పిల్లలకు ఎట్టిపరిస్థితిలోనూ చూపెట్ట కూడదంటాడు పిల్లల ప్రేమికుడు సుప్రసిద్ధ భారతీయ సాహిత్యవేత్త పద్మభూషణ్ రస్కిన్ బాండ్. ఐదో కథ 'యెవలుజేసుకున్న కర్మ ఆల్లే అనుబవించాలె'. ఈ కథలో మంత్రి ముక్కు చెవులు కోయించుకున్న దృశ్యం.

> **ఖననం, ఖండనం, హింస, జుగుప్స, వంటి అంశాలు పిల్లలకు ఎట్టి పరిస్థితిలోనూ చూపెట్ట కూడదంటాడు పిల్లల ప్రేమికుడు సుప్రసిద్ధ భారతీయ సాహిత్యవేత్త పద్మభూషణ్ రస్కిన్ బాండ్. ఐదో కథ 'యెవలుజేసుకున్న కర్మ ఆల్లే అనుబవించాలె'. ఈ కథలో మంత్రి ముక్కు చెవులు కోయించుకున్న దృశ్యం. రస్కిన్ బాండ్ అభిప్రాయాన్ని విభేదిస్తుంది.**

రస్కిన్ బాండ్ అభిప్రాయాన్ని విభేదిస్తుంది. ఆరో కథ 'మాయ గిన్నె'లో చివరి ఘట్టం అనవసరం. కథలో పొట్టోళ్లు పుట్టుకొచ్చి ఊరందరికీ శిరోముండనం చేయడం కథకు ఏరకంగానూ ఉపయోగపడదు.ఏ పాపం ఎరుగని జనానికి విందుకు వచ్చినందుకు గుండుగీకడం సామాజిక వ్యతిరేకత (Social antinomy) అవుతుంది.అది చిన్న కథైనా పెద్ద కథైనా కథాంశం (Plot)లో 1.ప్రవేశిక (Introduction), 2.చర్యోపక్రమణం (Rising of action), 3.పరాకాష్ఠ (Climax), 4.చర్యావనతం (Falling of action), 5.కడపటి సన్నివేశం (Denouement)లు ఉంటాయి. కడపటి సన్నివేశంలో 1.బాహ్యసంఘర్షణ (External struggle%), 2.అంతస్సంఘర్షణ (Internal struggle) ఉంటాయి. రాజ్యం తాలూకు అంశాల్లో తప్పితే కడపటి సన్నివేశంలో కుటుంబ గత ఫలితాన్ని సామాజం మొత్తానికి వర్తింప చేయరాదు.' యెవలన్న వొచ్చి అడిగితె తిర్పతికి వొయ్యొచ్చినం అని చెప్పుడు మొదల్వెట్టిర్రు 'అనే దగ్గర కథ ముగించి, కథకు 'మాయ గిన్నె' అనే పేరుకు బదులు 'తిర్పతికి వొయ్యొచ్చినం' అని పెడితే పిల్లలు లొటకలేస్తూ చదివేటోల్లు. ఆఖరి పేరాగ్రాఫ్ వలన సహజ హాస్యానికి బదులు అసహజ హాస్యం చాటున కథ బీభత్స రసానికి మళ్లింది. ముగియాల్సిన చోట కథ ముగియక పోతే చర్యావనతం, కడపటి సన్నివేశం తారుమారు అవుతాయి.ఈ తారుమారు వలన రసం మారుతుంది.రస మార్పిడి జరిగినపుడు కథ Theme,Point of view మారతాయి.ఈ కథలో ఇవే జరిగాయి. ఏడోకథ' బండిని మింగిన పులి'పెద్దల కథ.అన్నా చెల్లెళ్ల అనుబంధానికి సంబంధించినది.కుటంబ సంబంధాల్లో అసఖ్యతను తగ్గించి సఖ్యతను పెంపొందించాలే తప్ప వ్యక్తుల్లో దురాశా స్వభావాన్ని (Greed mindset) తారాస్థాయికి చేర్చి కథ చెప్పడం వలన పిల్లలకు పెద్దగా ప్రయోజనం ఉండకపోగా వ్యతిరిక్తత (Antagonism)కు దారులు తెరిచినవాళ్లం అవుతాం.ఈ కథ సరిగ్గా ఇటువంటిదే.ఎనమిదో కథ 'పాపిష్టి వదిన' కూడా ఏడో కథ లాంటిదే.

తొమ్మిదో కథ 'అంత మన మంచికే' పరోక్షంగా నరబలిని

ప్రోత్సాహించే కథ. కథలో ప్రథమాంశం దాని కూర్పు (Setting). దీనిలో స్థలం(Place), కాలం (Time) ఉంటాయి. జగదీశ్వర్ చెప్పినట్టు 'ఒగనాడు రాజు శాకుతోటి పండుగోస్తుంటె యేలు దెగింది' సంఘటనలో కూర్పు దెబ్బతిన్నది. రాజు స్వయానా శాకుతో పండు కోయడం అంతఃపురంలో ఉండదు. రాజుకు గాయం కావడాన్ని మరో రకంగా జగదీశ్వర్ చెప్పాల్సిన వుండె. పదోకథ 'నీ నోట్లకెల్లి ముత్యాలు రాలు గాక' వలయాకృత స్వభావ కథ. కథాంశాల్లో రెండోది కథలోని పాత్రలు (Characters). అవి 1.నాయక పాత్రలు (Protohonists) 2.ప్రతి నాయక పాత్రలు (Antagonists). ఇవి నాలుగు1. క్రియాశీల (Dynomic) 2.స్థిర (Static) 3.సమతల (Flat) 4.వలయాకృత (Round) చిత్తవృత్తి కలిగి వుంటాయి. బాలబాలికలకు క్రియాశీల పాత్రలు బాగా నచ్చుతాయి. జగదీశ్వర్ విని చెపుతున్న ఈ కథల్లో పాత్రలు డైనమిక్‌గా ప్రవర్తించవు. కాలాలు (Seasons) దేవతలుగా అవతారం ఎత్తడం వంటి ఫాంటసీ ఈ కథ కు ఒక మెరుపు. అయితే ఇందులో అత్తాకోడళ్లది వలయాకృత స్వభావం. అంటే ఘర్షణ నుంచి ఘర్షణకే చేరుకుంటాయి. చేరేలోగా పాత్రలు విలోమంగా మారతాయి. విలోమంగా మారినపుడు పాత్రకు సంబంధించిన క్షమ, సహనం, ఆదరణ , ప్రతీకారం, తొందరపాటు, అనాదరణ థీమ్(పాఠం)గా రూపం ధరిస్తాయి. వెంటనే కథ యొక్క దృక్కోణానికి లోపం ఏర్పడుతుంది. పదకొండో కథ 'దరిద్రపు మొకం'. ఇది మూఢ విశ్వాసాన్ని బలపరిచే కథ. అయితే 'బిచ్చగాడు రాజును ప్రశ్నిందం 'అనే కడపటి సన్నివేశం విద్యా తత్త్వవేత్త జాన్ డ్యూయీ వ్యావహారిక సత్తా వాదా (Pragmatism)న్ని ఇముడ్చుకున్నందు వలన పిల్లలు బాగా ఇష్టపడతారు. పన్నెండో కథ 'రమ్మంటావా? నన్ను రమ్మంటావా?'. ఇది Human vs Supernatural స్టోరీ. పైసల్ని కాళ్లతో తన్నరాదు అనేది ఈ కథలోని నీతి. చిన్నారులకు బాగా నచ్చుతుంది. పదమూడో కథ 'లడ్డూల వాన'. ఇందులో Fate theme జొప్పించ బడింది. దొరికిన సొమ్ము తో ధనవంతులు కావడం అనేది పిల్లలపై నెగెటివ్ ప్రభావం కనబరుస్తుంది. బంగారం దొంగలకు శిక్షపడక పోవడం రచనకు సంబంధించి Falling actionలో పెనులోపం. పద్నాల్గో కథ'యెముడు ఎందుకు కనవడడు?'. ఇది మృత్యువు ఆంతర్యాన్ని గురించిన కథ. బ్రాహ్మడు వైకుంఠం వెళ్లడం, యముడికి విష్ణు మూర్తి' 'అందర్కి కనవడేటట్టు వొయ్యి పానాలు తీస్కొచ్చుడు నువ్వు చేస్తున్న తెలివి తక్కువ పని 'అని హితవుచెప్పడం పిల్లల్లో అన్వేషణా (quest) తాత్త్వానికి పదును పెడతాయి. అయితే మహోపాధ్యాయుడు గిజుభాయి వధేకా చెప్పిన"పిల్లకు బాల్యంలో వివాహం చేయడం ఎంతటి అనర్థమో దేవుని గురించి మతం గురించి చెప్పడం అంతే అనర్థం"అనే భావనకు ఈ కథ పూర్తి వ్యతిరేకం.

**బ్రాహ్మడు వైకుంఠం వెళ్లడం, యముడికి విష్ణు మూర్తి' 'అందర్కి కనవడేటట్టు వొయ్యి పానాలు తీస్కొచ్చుడు నువ్వు చేస్తున్న తెలివి తక్కువ పని 'అని హితవుచెప్పడం పిల్లల్లో అన్వేషణా తాత్త్వానికి పదును పెడతాయి. అయితే మహోపాధ్యాయుడు గిజుభాయి వధేకా చెప్పిన"పిల్లకు బాల్యంలో వివాహం చేయడం ఎంతటి అనర్థమో దేవుని గురించి మతం గురించి చెప్పడం అంతే అనర్థం"అనే భావనకు ఈ కథ పూర్తి వ్యతిరేకం.**

పదిహేనో కథ 'యెలుగొడ్డు మొగడు'. శివనిందా పర్యవసానం గురించిన కథ. మిగతా కథల్లో లాగ కాకుండా ఇది కారుణ్యంతో ముగిస్తూ పాత్ర యొక్క మెచురేషన్‌ను సూచిస్తుంది. ఇక్కడా అధ్యాపకులు గిజుభాయి మాటల్నే గుర్తుపెట్టుకోవాల్సింది. పదహారో కథ' సూర్యుణ్ణి మింగిందెవలు?'. ఇది సూర్యగ్రహణం గురించి పురాణకాలపు ఘటనకు సంబంధించిన కథను జానపదుల కోణంలో ఆవిష్కరించే కథ. ఇందులో అక్క కోసం తమ్ముడు చేసే ధైర్యం అనేక మంది అక్కాతమ్ముళ్లలో ఐకమత్యాన్ని పెంచుతుంది. సూర్యుడిని పాము మింగడాన్ని సైన్సు ఒప్పుకోదన్న విషయాన్ని పిల్లలకు పరోక్షంగా కథ ద్వారా చెబితే బాగుండేది. పదిహేడో కథ'పాము కూర'. ఇది ధనవంతురాలైన అక్కకు అతి దారిద్ర్యంతో బాధపడే చెల్లెలికి సంబంధించిన కథ. సచ్చిన పామును చెల్లెలు కూర వండితే వనదేవత మాయ వల్ల అది వజ్రాలు రత్నాలు అవుతై. అదే ప్రయత్నంలో ప్రయత్నించి అక్క దారుణంగా మరణిస్తుంది. చెల్లెలు పేదరికంతో పోరాడలేక ఇంటిల్లిపాదికి విషసర్పాన్ని వండడం అనే క్లైమాక్స్ ద్వారా, దురాశతో పుట్టలో చేయి పెట్టి మరణించే అక్క ద్వారా పిల్లలు నేర్చుకునేది ఏమీ వుండదు. పైగా పాముకూర అనే మాట వింటేనే ఓకరిస్తారు, వణికి చస్తారు పిల్లలు. వికారపు విషాన్నాలు, విషాదాంత దృశ్యాలు బాలల కథల్లో పొరపాటున కూడా ఉండకూడదు. ఒకవేళ ఉంటే సామాజిక ముప్పుకు విరుగుడుగా విషాద సన్నివేశాలు ఉండాలి. అతీత శక్తుల సాయం కంటే స్వీయ సామర్థ్యంతో సమస్యలను అధిగమించడం అనే ధోరణిని అలవర్చుగలిగే కథలే గొప్ప కథలు. ఇందుకు పాముకూర కథ పూర్తి గా విరుద్ధం. పద్దెనిమిదో కథ 'మంచి శకునం'. శకునాలు జనాదరణ (Popular) పొందినట్లుగానే, జనాదరణ పొందిన దురభిప్రాయాలు (Popular misconceptions) గా కూడా ఉంటాయి. శకునాలకు హేతుబద్ధత ఉండదు. కథలో ప్రయాణం పెట్టుకున్నప్పుడు నక్కకు వరుణుడు, భూదేవి, లక్ష్మీ దేవి ఎదురైతే అసంగతాలు గుర్తుకు రావడం –వాటి సమన్వయం బాగానే వుంది. అగ్ని దేవుడు ఎదురైనప్పుడు నక్క మంచి శకునం అని చేసే సమన్వయంలో సహేతుకత లేదు. పిల్లలకు అగ్నిలో కాలే శరీరాలను ఉదహరించడం ఆరోగ్యకరం కాదు. పంతొమ్మిదో కథ 'శిన్న ముసలమ్మ పెద్ద ముసలమ్మ'. ఒకటి రెండు పోను ఈ సంపుటిలోని ఇతర కథల్లాగే ఇది సారాంశం రీత్యా ఆరోహణ మరియు అవరోహణ (Ascesion & Descesion) పద్ధతికి చెందిన కథ. అంటే పెద్ద ముసలమ్మ తన మేకను కొడితే నోట్లోంచి వజ్రవైడూర్యాలు రాల్తవి, శిన్నముసలమ్మ తన మేకను కొడితే పెంట పెడుతుంది. మంచి వాళ్లకు మంచి జరగడం చెడ్డవాళ్లకు చెడు జరగడం అనే విషయాన్ని పిల్లలకు చెప్పడానికి మూగజీవాల పీడనను అనుసరించడం అంత హృదయంగమం కాదు. పై పెచ్చు జంతు పీడన వల్ల పిల్లలకు

చేకూరేది బండహాస్యమే. ఇరవయ్యోకథ ఆఖరి కథ 'నంది జేశిన తప్పు'. ఇది చెప్పింది చేయని వాళ్లు పొందే ప్రతిఫలానికి (Vengeance)కు సంబంధించిన కథ. నందిని శివుణ్ణి ఇందుకు దృష్టాంతంగా చెప్పడం ,పశు సంతతి శాపవశాత్ రైతుల పొలాల్లో కష్టాలు పడుతున్నాయనడం భూమి-రైతు-పశువులు సంబంధాలను కించపరచడం కిందకు వస్తుంది. బాలల కథకు తప్పుడు తీర్పులు (Efroneus judgements) ముగింపుగా ఉండకూడదు.

బాలలకు నీతి నియమాలు ,మంచి చెడులు చెప్పాలనుకున్న జగదీశ్వర్ ఈ కథలను 'పిల్లలు-ప్రకృతి' వాతావరణానికి అతి దూరంగా పెద్దలతో ,పెద్దల సమస్యలతో నడిపించాడు. దాదాపుగా కథలన్నీ ప్రతీకారం (Revenge)తీర్చుకునే వైపు నడుస్తాయి."బాల సాహిత్యం ముఖ్యంగా పిల్లల శారీరక ఎదుగుదలకు,మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తుంది. మానవీయ విషయాలను సామాజిక విషయాలను, ధైర్యసాహసాలను, విజ్ఞాన సంశోధక విషయాలను ఆకళింపు చేసుకునే విధంగా ఉండాలి" అంటున్నారు దక్కన్ లాండ్ మాసపత్రిక హైదరాబాద్ ఆధ్వర్యంలో వస్తున్న 'బాల చెలిమి' బృందాలు. కథల్లో మనుషులను ఆదుకునే దైవకృప కన్నా, మానవుడు మేధస్సుతో సాధించే అద్భుతాలనే బాలలకు చేరవేయడమే ఇవాళ్టి అవసరం. ఈ లక్ష్యాల సాధనలో పెండెం జగదీశ్వర్ 'దోస్తులు చెప్పిన కథలు 'అంతగా కృతకృత్యం కాలేవు. కథా వస్తువులకు సంబంధించి సుప్రసిద్ధ ఫ్రెంచి రచయిత జార్జెస్ పోల్టీ తన The thirty six dramatic situations గ్రంథంలో పేర్కొన్నట్టు- నాల్గోది : బంధువుకోసం బంధువు మీద ప్రతీకారం (Vengeance taken for kin upon kin), ఏడోది: క్రూరత్వం, దురదృష్టాలకు బలైపోవడం (Falling prey to cruetly of misfortune), పదమూడోది: బంధువుల శత్రుత్వం (Enmity of kin) అనే అంశాలకు ఈ కథలు లఘురూపాలుగా కనిపిస్తాయి. బహుశా ఈ మూడే కదా! సాహిత్య జగత్తులో అపురూపంగా వెలుగొందాల్సిన జగదీశ్వర్ కథ అర్థాంతరంగా ముగియడానికి కారణం. తనకు ఎదురైనదంతా పెద్దలకు చెప్పుకోలేక పిల్లలకు ఎరుక చేసి వెళ్లిన కథకుడుగా ఈ కథల ద్వారా జగదీశ్వర్ బాలసాహిత్య లోకంలో మిగిలాడు,వెలుగుతున్నాడు.

– డా. బెల్లి యాదయ్య
m: 9848392690
e : dr.bellipoet@gmail.com



# నిజ దర్పణం

సమతల
దర్పణమే ఐ తీరాలని
నిబంధనలేం లేవు
జల్లులు జల్లులుగా
వానకురుస్తూ ఉన్నప్పుడు
తుంపర తుంపరలుగా
చూరుచుక్కలు జారవిడుస్తూ ఉన్నప్పుడు
తరచిన అంతరంగంలా
శిలాకెరటాన్ని నునుపుగా చెక్కితే
అద్దంలానే ప్రతిబింబాన్ని పరుస్తుంది
సప్తవర్ణాల నయాసౌధాల నేలగోడల్లో
దీనవదనాలే కాదు
దిక్కులన్నీ కనిపిస్తాయి
మేఘాలు డీకొని మెరిసిన
ఆకాశ దర్పణం మీద
భూతల తడితలంపు
చిత్రితమౌతూనే ఉంటుంది
భూమ్యాకాశాల నడిమి
ఆవర్తన రేఖనిండా తిరగాడే
పిట్టలగుంపు మనుషుల్లోనే
దాగిన రెక్కలను
సంకేతిస్తూ ఉంటాయి
అన్నీ అంచనాలే
అనంతంలో దేన్నైనా
అచ్చంగా దాన్లాగే చూపే
పరికరమేదీ ఉన్నట్టు లేదు
అయినా మనల్ని మనం
అద్దంలోనేనా
మిత్రుల కనురెప్పలు చిలికే
నీలిమలోనూ చూసుకోవచ్చు
సహచరి చిట్లించే
కనుబొమల వంపుల్లోనూ
వ్యక్తపరచుకోవచ్చు
కన్నవాళ్ళ చిట్టివదనపు
భవితలోనూ దర్శించుకోవచ్చు
మనం పట్టించుకోంగానీ
మన చుట్టూ తిరగాడుతున్నదంతా
మనకో నిజదర్పణమే

-ఏనుగు నరసింహారెడ్డి
m : 8978869183
e : narsimhareddy.anugu@gmail.com

# పీఠికలు భిన్నభావాల పేటికలు

పీఠిక, ఉపోద్ఘాతం, ముందుమాట, తొలిపలుకులు ఇలా ఎన్ని రకాల పేర్లు పెట్టినా అవి గ్రంథాని (text)కి, పాఠకుని (target)కి అనుసంధానాలుగా ఉపకరించేవి. గ్రంథకర్త స్వయంగా రాసుకోవచ్చు. తాను పడిన శ్రమ, తనలక్ష్యం, ఇంకా భవిష్యత్తులో చేయవలసిన కృషి, సహకరించిన వారికి కృతజ్ఞతలు మొదలైన అంశాలు రచయిత తన పీఠికలో నివేదించుకొంటాడు. రచయిత తన గ్రంథానికి మరి కొందరు ఇష్టులు అయిన వ్యక్తుల చేత ముందు మాటలు రాయించుకొంటాడు. వారు సాహిత్యలోకంలో సుప్రసిద్ధులు కావచ్చు. వారి ముద్ర పడితే తన రచనకు తగిన గుర్తింపు వస్తుందన్న విశ్వాసం. ఔద్యోగికంగా ఉన్నతాధికారులు కావచ్చు. వారితో పరిచయం ఏర్పడడానికి ఇదొక అవకాశంగా భావించుకోవచ్చు. (ముప్పదేళ్ళ క్రితం ఓ స్కూలు టీచర్ రాసిన పుస్తకానికి వారి డైరెక్టర్ తో పీఠిక రాయించమని ఉచిత సలహా ఇచ్చాను. డైరెక్టర్ తో పీఠిక రాయించుకోవడమే కాక నెలరోజుల్లో కోరుకున్న పాఠశాలకు బదిలీ కూడ అయ్యాడు. ఆ రచయితకు ఇది అదనపు ప్రయోజనం.) పాఠాలు చెప్పిన గురువుల ఆశీస్సులు పొందడం కోసం కూడ పీఠికలు రాయించవచ్చు.

ప్రత్యేకంగా ఆ విషయం మీద అధికారం ఉన్న వారితో రాయించుకోవడం ఒక పద్ధతి, సన్నిహిత మిత్రుల అభిప్రాయాలు పొందుపరుచుకోవడం ఒక తీరు. ఇలాగ పీఠికాకారులు బయలుదేరుతారు. మొత్తం మీద పీఠికాకారులందరు రచయిత ఇష్టంతో ముడిపడిన వారు అన్నది విస్మరించకూడదు.

**పీఠికాకారులందరికి రచయిత శక్తి సామర్థ్యాల మీద అవగాహన ఉంటుంది. సదభిప్రాయం ఉంటుంది. పీఠికకు ప్రథమశ్రోత రచయితనే అవుతాడు. కనుక పీఠికలు ప్రోత్సాహకారకంగా ఉండడం సంస్కారలక్షణం. పీఠికాకారులు “వెన్నుగుద్ది” చెప్పకుండా “వెన్నుతట్టి” లోపాలను సవరించుకోవాలని సూచించడం ఆనవాయితి. పత్రికల్లో వ్యాసం, సమీక్ష రాసే విమర్శకుడయితే రచయితతో “అభ్యర్థనాత్మకమైన సంబంధం” ఉండని వాడవుతాడు కనుక కాస్త ఘాటుగా విమర్శించ వచ్చు.**

పీఠికాకారులందరికి రచయిత శక్తి సామర్థ్యాల మీద అవగాహన ఉంటుంది. సదభిప్రాయం ఉంటుంది. పీఠికకు ప్రథమశ్రోత రచయితనే అవుతాడు. కనుక పీఠికలు ప్రోత్సాహకారకంగా ఉండడం సంస్కార లక్షణం. పీఠికాకారులు “వెన్నుగుద్ది” చెప్పకుండా “వెన్నుతట్టి” లోపాలను సవరించుకోవాలని సూచించడం ఆనవాయితి. పత్రికల్లో వ్యాసం, సమీక్ష రాసే విమర్శకుడయితే రచయితతో “అభ్యర్థనాత్మకమైన సంబంధం” ఉండని వాడవుతాడు కనుక కాస్త ఘాటుగా విమర్శించ వచ్చు. రచయిత తన ధోరణిలో తాను రాస్తాడు. తన శక్తియుక్తులు, అవగాహనలు, అభ్యాసరీతి వాటిలో ప్రతిఫలిస్తాయి. ఆ గ్రంథగత అంశం, వైశిష్ట్యం, చారిత్రక నేపథ్యం, పూరణాత్మకంగా, సవరణాత్మ కంగా, విశ్లేషణాత్మకంగా చెప్పడం, రచయిత పడిన శ్రమ, శైలీవిన్యాసం, ఆకరాలసేకరణలో, విశ్లేషణలో చూపిన నైపుణ్యం మొదలైనవి పేర్కొనడం రచయిత గ్రంథంలో అంతర్భాగం కాజాలదు. తాను అంతగా చెప్పుకోవడం సభ్యతాలక్షణం కాదు. కనుక ఇంకొకరు చెప్పవలసిందే. అలా పీఠికాకారులు చెప్పిన అంశాలు పాఠకులకు గ్రంథ అవగాహనలో ఉపకరిస్తాయనడం నిర్వివాదాంశం.

అసలు గ్రంథంలో సరుకు లేకపోయినా పీఠికల వల్ల నిలుస్తాయనడం అబద్ధం. కాస్త తక్కువస్థాయి గ్రంథానికి పెద్దల పీఠికలతో ప్రచారం కలుగుతుందేమో కానీ “విలువ” పెరుగుతుందని మాత్రం విశ్వసించలేం. పీఠికల్లో అతిప్రశంసలు అనౌచిత్యానికి దారి తీసేవి మాత్రమే కాక రచయిత పట్ల పాఠకుల్లో చిన్నచూపు కలగడానికి దోహదకారులవుతాయి. ఒకరిద్దరిచేత పీఠికలు రాయించడం అందంగా అనిపించవచ్చు. కాని ఇరవై పుటల చిరుపొత్తానికి పదిమంది చేత యాభైపుటల పీఠికలు రాయించడం ఆభాసుపాలు కావడానికే హేతువవుతుంది.

ప్రాచీన కావ్యాల్లోని అవతారికలే ఆధునిక రచయితల స్వీయ ఆముఖాలుగా పరిణమించాయి. ప్రాచీన కావ్యాల్లో ఇతరుల చేత రాయించడం ఉండదు. ఆధునికుల్లో ఇతరుల చేత రాయించడం ఆంగ్లవిమర్శకుల Fore word సంప్రదాయం నుండి వచ్చింది.

ప్రాచీన కావ్యాలను పరిష్కరించి ప్రచురించినపుడు పండితులు అత్యంత విస్తారమైన పీఠికలు రాయడం అందరికీ తెలిసిందే. దాని వల్ల మనకెన్నో విషయాలు అవగాహనకు వస్తాయన్నది వాస్తవం. చిలుకూరి నారాయణరావు పండితారాధ్య చరిత్రకు రాసిన 348 పేజిల పీఠిక, వేటూరి ప్రభాకర శాస్త్రి క్రీడాభిరామానికి, బసవపురాణానికి, తంజావూరు ఆంధ్ర చరిత్రకుబీ అక్కిరాజు ఉమాకాన్తం పలనాటి వీరచరిత్రకుబీ ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు ప్రతాపరుద్ర యశోభూషణానికి, ఆముక్తమాల్యదా పర్యాలోకనానికి రాసిన పీఠికలు నిజంగా విజ్ఞానపేటికలు. అవి ఇంచుమించు స్వతంత్ర గ్రంథాలు. వావిళ్ళ, ఆనందముద్రణాలయ సంస్థ, వేదం వెంకట్రాయశాస్త్రి & బ్రదర్స్ లాంటివారు ప్రకటించిన కావ్యాలకు పండితులు వైదుష్య భరితమైన ముందుమాటలు సంతరించి పాఠకులకు జ్ఞానకవాటాలు తెరిచారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నిర్వాహకులు దేవులపల్లి రామానుజరావు, ఇరివెంటి కృష్ణమూర్తి, ఆకాడమీ ప్రచురించిన ఎన్నో కావ్యాలకు, భారతం సంపుటాలకు సర్వ ఆంశాలను, సకల కోణాలను స్పృశిస్తు సుదీర్ఘమైన పీఠికలను రాసే అవకాశాన్ని కలిగించారు. నిడుదవోలు వెంకటరావు, విశ్వనాథ సత్యనారాయణ, పాటిబండమాధవశర్మ, బి.రామరాజు, పియస్ఆర్ అప్పారావు, పల్లాదుర్గయ్య, గడియారం రామకృష్ణశర్మ, నాయనికృష్ణ కుమారి, పి.యశోదారెడ్డి, కోవెల సంపత్కుమార ఇలా ఎందరెందరో విద్వాంసులు పీఠికల రూపంలో తమ ప్రజ్ఞప్రాభవాలను ప్రదర్శించారు. ఆ పరంపరలో రాటుతేలిన మరో విద్వాంసుడు శ్రీ రంగాచార్య. దశరథరాజనందన చరిత్ర, తాలాంకనందినీ పరిణయం, శ్రీరంగ మహత్త్వం, రసార్ణవ

సుధాకరం, అప్పకవీయం లాంటి 70 తెలంగాణ కావ్యాలను పరిష్కరించి సప్రమాణికమైన పీఠికలు సంతరించి పండిత శబ్దానికి సార్థక్యం కలిగించారు శ్రీ రంగాచార్య గారు.

మానవల్లి రామకృష్ణకవి నన్నెచోడుని కుమారసంభవం మొదటి భాగాన్ని ప్రకటిస్తు పీఠికలో ఇతడు (నన్నెచోడుడు) క్రీ.శ. 940లో పశ్చిమ చాళుక్యులతో యుద్ధము చేసి రణరంగమున నిహతుడయ్యెను– అని రాశాడు. అంటే నన్నయకు ముందున్నకవి నన్నెచోడుడు అన్నది తాత్పర్యం. ఇది అనేక సంచలనాలకు, తర్జన భర్జనలకు ఆస్కారాన్నిచ్చింది. అసలు నన్నెచోడుని కవిత్వవైఖరి కన్నా కాల నిర్ణయానికి పండితులు ఎక్కువ ఘర్షణ పడ్డారు. ఆనాటి పండితులందరు పాఠాంతరాల చర్చ, ప్రతుల చర్చ, కవి కాల స్థల, కులాదుల చర్చ, కృతిభర్త చర్చ, అన్యకృతులు, పూర్వాపరాలు, అనువాదవిధానం, కథాకల్పనం, ఛందో వ్యాకరణాలంకారాదుల చర్చ, అర్వాచీన కవులపై ప్రభావం మొదలైన ఒకానొక పద్ధతి (Methodology) ప్రకారంగా చర్చించారు. రాళ్ళపల్లివారిపీఠికలు ఆకారంలో చిన్నవే అయినా గ్రంథగౌరవాన్ని ప్రస్ఫుటం చేస్తు చమత్కార భరితంగా సూచనలు చేస్తూ పాఠకుల్లో జిజ్ఞాసను రేకెత్తిస్తాయి.

భావకవిత్వయుగంలో పీఠికల విషయంలో ఒక గమనార్హమయిన అంశం కనిపిస్తుంది. ఎక్కువ మంది కవులు ఇంగ్లీషులో పీఠికలు రాయించుకొన్నారు. ఇది ఇప్పుడు కాని అభ్యుదయకవుల కాలంలో కాని లెక్కించదగినంత కాదు. భావకవులందరు ఎక్కువగా ఇంగ్లీషు వాళ్ళ దగ్గర చదువుకోవడం కావచ్చు. నోబుల్ ప్రైజ్ మీద వారికి ఆశలుండేవి. ముఖ్యంగా జేమ్స్.హెచ్.కజిన్స్ మదనపల్లి కాలేజి ప్రిన్సిపల్‌గా ఉండడం. దువ్వూరి రామిరెడ్డి లాంటి వారు ఆయనకు సన్నిహితులుగా ఉండడం లాంటివి కావచ్చు.

అభ్యుదయ కవి ప్రయోక్త శ్రీశ్రీ మహా ప్రస్థానానికి చలం యోగ్యతాపత్రం పేరుతో రాసిన పీఠిక సాహితీలోకంలో ఎంతో పేరు గడించింది. యోగ్యతాపత్రం చదివితే మహాప్రస్థానం చదవక్కర లేదనుకొనే "పిచ్చిరెడ్డి లాంటి సార్థకనామధేయులు" బయలుదేరారంటే చలం పీఠిక ఏ మేరకు తన సమ్మోహకశక్తిని ప్రసరింపచేసిందో విదితమవుతుంది. (చూడుడు శ్రీశ్రీ ప్ర.జ సంపుటం) శ్రీశ్రీ, కె.వి రమణారెడ్డి, కె.కె.రంగనాథాచార్యుల లాంటి వారు మార్క్సియ సిద్ధాంతం, చారిత్రక భౌతిక వాదం. ప్రగతిశీల దృక్పథం ఉండాలని విస్తారంగా రాసిన పీఠికల్లో అభిప్రాయపడ్డారు. వచన కవితను ఒక ప్రక్రియగా స్థాపించడానికీ, అందులో కథాకావ్యాది వైవిధ్యాన్ని జోడించడానికీ, సారళ్యం సమకాలీన స్పృహ ఉండాలని మార్గికత, అతి సాంస్కృతికత తగదని ప్రచారం చేయడానికీ కంకణం ధరించినట్లుగా కుందుర్తి ఆంజనేయులు పీఠికలు రాశారు.

**అభ్యుదయ కవి ప్రయోక్త శ్రీశ్రీ మహా ప్రస్థానానికి చలం యోగ్యతాపత్రం పేరుతో రాసిన పీఠిక సాహితీలోకంలో ఎంతో పేరు గడించింది. యోగ్యతాపత్రం చదివితే మహాప్రస్థానం చదవక్కర లేదనుకొనే "పిచ్చిరెడ్డి లాంటి సార్థకనామధేయులు" బయలుదేరారంటే చలం పీఠిక ఏ మేరకు తన సమ్మోహకశక్తిని ప్రసరింపచేసిందో విదితమవుతుంది.**

విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధానులు వందలాది పీఠికలు రాశారు. విశ్వనాథ సత్యనారాయణ పీఠికలు రెండు సంపుటాలుగా సంకలితమయ్యాయి. కాని దివాకర్ల వెంకటావధాని పీఠికలు పుస్తకంగా రాలేదు. ఎవరైనా తెస్తే సాహిత్యలోకానికి మేలు చేసిన వారవుతారు. దివాకర్ల వారి పీఠికలు రచయితను తగిన విధంగా ప్రశంసిస్తూ , ప్రతికూలాభిప్రాయాలు లేకుండా వస్తువు, రసం, భాష, అలంకారాలు, ఛందస్సు అన్నట్లుగా దేని దానికి విడివిడి ప్యారా గ్రాపుల్లో ఒక క్రమశిక్షణాయుతమైన పద్ధతిలో (మూస పద్ధతి అనడం అపచారం) కొనసాగుతాయి. పాఠకుడు ఈ పీఠిక చదివి ఎంతో ప్రయోజనాన్ని పొందుతాడు.

విశ్వనాథ, శేషేంద్ర లాంటి వారి పీఠికలు విపరీతమైన ప్రేమాభిమానాలు కురిపిస్తాయి. గ్రంథంలోని వస్తువుకు అతీతమైన వలయంలో సంచరిస్తూనే ఆ వస్తువుతో ముడిపడివుంటాయి. విశ్వనాథ నాలగయిదు వాక్యాలలో పీఠిక అయిపోయిందని చేతులు దులిపేసుకోగలడు. విస్తారంగానూ రాయగలడు. ఆ రచయిత మీద కానీ, రచన మీద కానీ ఇష్టం లేకపోతే విశ్వనాథ ఎంతో గడుసుగానూ, ఎవరికీ దొరకకుండానూ రాయగలడు. భారత రాష్ట్రపతి వి.వి. గిరిగారి శ్రీమతి సరస్వతీగిరి 1969లో బీజాక్షరమాల అని ఒక పుస్తకం రాసి విశ్వనాథ పీఠిక కోసం ఇచ్చారు. ఆ పుస్తకం అతి సామాన్యమైనది. రాసిన వ్యక్తి అసామాన్య వ్యక్తి. భారత దేశంలోనే సర్వోన్నతమైన పదవిలో ఉన్న వ్యక్తి ధర్మపత్ని. ఇంకెవరైనా అయితే అమాంతం ఎగిరి గంతేసి అత్యద్భుత మని పీఠిక రాస్తారు. కాని విశ్వనాథ ఎలా స్పందించాడో చూడండి.

ఇది ఒక గ్రంథము కాదు. అక్షరమాల. అక్షరముల వాసన, ఇందులో అక్షరములు లేవు. శబ్దాలు లేవు. అన్వయము లేదు. ఉన్నను వాని దారి వానిదే. ఒక పెద్ద అఱపు. ఒక పెద్ద ఆక్రోశము. ఒక జీవుడు– ఆ జీవుడు స్త్రీ. ఇప్పుడు గొప్ప స్త్రీ, ఒక గొప్ప పదవిలోనున్న పురుషుని భార్య. కడివెడు బిడ్డలను కన్న స్త్రీ. ఆమె సంతతి తామరతంపరగా నున్నది. గొప్ప లౌకిక జ్ఞానము కల స్త్రీ. తన భర్త పదవికి తాను హేతువు ననుకొన్నంత వివేకవతి. ఈ జీవునకు, ఈ అరచిన జీవునకు సంబంధము లేదు. ఇది ఒక ఆశ్చర్యము. పూర్వజన్మ విశిష్ట సంస్కారమో ఒక విలక్షణమైన సాధనమో కాని ఈ అఱపులో ఆ జీవుడు– లోకము నందొక లౌకిక జ్ఞానము కలవాడన్న లక్షణమున్నది. అది యిది గ్రంథమనిపించుచున్నది.

ఈ అఱచిన యామె, యీమె కానిచో నిది సహజము. ఎవరో యోగిని. ఒక యోగిని యొక్క యున్మత్త ప్రలాపము, కాని యీమె యీమె సాధన మొక ఆశ్చర్యము. ఈ అఱపునకు ఈ కేకకు ఈ ఆక్రోశమునకు ఒక వైలక్షణ్యము తెచ్చినది. ఇట్టి సాధన నాన్యతో దర్శనీయము. పరమేశ్వరుడు విన్నాడు. వినక తప్పదు. అట్టి కేక.

ఇందులో విశ్వనాథ సత్యనారాయణ గారు చెప్ప దలుచుకొన్న భావమేమిటో ఎవరికీ బోధపడదు. పీఠికలు రాయడం నుండి తప్పించు కోదలచిన జీవునివేదన ఇది. ఇది ఒక చమత్కారం అంతే. పీఠికలు సకాలానికీ ఇవ్వక ఇబ్బంది పెట్టే రచయిత లెందరో ఉన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తిని అడిగిన పాపానికి ఎన్నోరోజులు ప్రచురణలను

ఆపుకొన్నవారున్నారు. డా. సి నారాయణరెడ్డి కాలం విలువ తెలిసిన వృక్తి. సకాలంలో పీఠిక ఇవ్వడంలో ఆయనను మించిన వారు లేరు. వారి పీఠికల్లోని ఆశీరభినందనలు అనే చివరి వాక్యం మొదట ఉండే ఔపచారిక వాక్యం తీసేసినా మధ్యలో ఉండే రెండు మూడు వాక్యాలు పుస్తకంలోని ఆయువుపట్టును సారభూతమైన అంశాన్ని వెల్లడిస్తాయి. క్లుప్తత సినారె పీఠికలకు ప్రాణం. ఇంకా జీ.వి. సుబ్రహ్మణ్యం విస్తారంగా అంశాల వారీగా వర్గీకరిస్తు విశ్లేషణాత్మకంగా పీఠికలు రాసే వారు. ఎస్వీజోగారావు, చేకూరి రామారావు, సంపత్కుమార, సుప్రసన్నాచార్య అద్దేపల్లి రామ్మోహన్ రావు, సంజీవదేవ్. తంగిరాల సుబ్బారావు , రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, వెల్చేరు నారాయణరావు, ఎన్. గోపి, బేతవోలు రామబ్రహ్మం, నందినిసిధారెడ్డి లాంటి వారెందరో తమతమ ధోరణిలో పీఠికలు రాశారు. చాలమంది పీఠికాకారులు కూడ తెలిపోయారన్న సంగతి విస్మరించకూడదు.

ప్రముఖపేరడీ విద్వాంసులు శ్రీరమణ వివిధ రచయితల పీఠికల శైలీవిన్యాసాలను ప్రతిభావంతంగా అనుకరించిన తీరును శ్రీరమణ పేరడీలు అనే గ్రంథంలో చూడవచ్చు. డి. చంద్రశేఖరరెడ్డిగారు పీఠికల స్వరూప స్వభావాల గురించి పరిశోధించి డాక్టరేటు పట్టం పొందారు. ఆరుద్ర, విశ్వనాథ, జి.వి.సుబ్రహ్మణ్యంగారల పీఠికా సంకలవాలను సమీక్షించే అవకాశం నాకు కలిగింది. అతి పొగడ్తల పేటిక కాకుండా రచయిత మరిన్ని పుస్తకాలు రాసే విధంగా తన స్థాయిని పెంచుకొనే విధంగా ప్రోత్సాహకరంగా ఉంటూ స్వీక ృతాంశానికి సంబంధించి రచయిత చెప్పలేకపోయినవి, వ్యాసంలో ఇమడక చెప్పడానికి అవకాశం లేకపోయినవి విశ్లేషణాత్మకంగా వివరిస్తు అతి స్వల్పంగాను కాకుండా అతిదార్ఘంగాను కాకుండా రచయితకు పాఠకునికి (వస్తువుకు గ్రహణశీలతకు) అనుసంధానాత్మకంగా ఉంటూ భవిష్యత్ లో ఆ రంగంలో మరికొంత వ్యాసంగానికి దారులు చూపిస్తు రాసేవే ఉత్తమమైన పీఠికలు.

**-డా. వెలుదండ నిత్యానంద రావు**
m : 9441666881
e : veldandanithyanand@gmail.com

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్ ఏడేళ్ళు పూర్తి చేసుకొని ఎనిమిదవ సంవత్సరంలోనికి అడుగు పెడుతున్నది. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది.

స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, చరిత్ర, సాహిత్యం, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యావరణం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరి స్తున్నది కథ, కవితలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు విశ్లేషణలతో మీ ముందుంచుచున్నాము. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళు తుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
**– మణికొండ వేదకుమార్**
సంపాదకులు

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 300 |
| 2 సం॥లకు | : | రూ. 600 |

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |







## జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్-త్రైమాసిక

TELANGANA RESOURCE CENTRE

# TRC
# Journal of Telangana Studies

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (TRC) ఆధ్వర్యంలో 'టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్' త్రైమాసిక జర్నల్ (జూలై–అక్టోబర్ రెండవ సంచిక) వెలువడింది. దీనికి ఓయూ మాజీ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ఎడిటర్‌గా, తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ మణికొండ వేదకుమార్ పబ్లిషర్‌గా ఉన్నారు. ఈ జర్నల్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ప్రచురితమవుతుంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై ప్రముఖంగా వచ్చిన వ్యాసాలను ఈ జర్నల్‌లో ప్రచురిస్తారు. టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్ (TRC Journal of Telangana Studies)లో వివిధ రాష్ట్రాల నుండి ఎమినెంట్ స్కాలర్స్ రాసిన పరిశోధన పత్రాలను ప్రచురిస్తారు. మేధావులైన ఎడిటోరియల్ బోర్డు పర్యవేక్షణలో ఈ త్రైమాసిక జర్నల్ అక్షర రూపంగా వెలువడుతుంది. తెలంగాణ రాష్ట్ర చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్ట్స్ అండ్ లిటరేచర్, హెరిటేజ్ మొదలైన సామాజిక అంశాలపై విస్తృతంగా, పరిశోధనాత్మకంగా వ్యాసాలను క్రోడీకరించి వాటిని ప్రపంచంలోని పలు యూనివర్సిటీలకు అందించేందుకు కృతనిశ్చయంతో ఉంది.

**Books for reviews may be sent to the postal address:**

**"BHOOPATHI SADAN"** 3-6-716, Street :12, Himayathnagar,
Hyderabad-500029, Telangana.
Mob: +91 8686 66 4949 email: trcjts@gmail.com

**Subscription:**

- Individual (India) : Rs. 250/issue; • Annual Subscription Rs. 800/-
- Institution (India) : Rs. 400/issue; • Annual Subscription Rs. 1,500/-
- Foreign Individual : US$ 65/issue; ▪ Annual Subscription US$ 260
- Foreign Institution : US$ 70/issue; ▪ Annual Subscription US$ 280

**ACCOUNT DETAILS:**

*A/C Name :* Telangana Resource Centre
*Bank Name :* Telangana Grameena Bank
*A/c. No. :* 79009067970
*IFSC No. :* SBIN0RRDCGB;
*Branch Code :* 229

# పాద ముద్రలు

చితి మంటల్లో దహించుకుపోతున్న తండ్రి శరీరం వైపు అభావంగా చూస్తూ నిలుచున్నది సుమతి. సుమతి.. ది వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ 'రీ డు' కంపనీ.

'రీ డు' కంపనీ తన మొదటి ప్రయత్నం లోపలే అన్ని వేళలా మనుషులు కృతకృత్యులు కారనీ.. గమ్యాన్ని చేరడానికి మనిషి మళ్ళీ మళ్ళీ ప్రయత్నం చేస్తూనే ఉండాలనీ.. అలసిపోవడమో.. పథభ్రష్టత పొందడమో, లక్ష్యం నుండి ప్రక్కకు తొలగి దారి మళ్ళి వెళ్ళిపోవడమో చేయకూడదనీ.. అసలు ఏ మనిషైనా జీవితాంతం ఎప్పుడూ విజయాలనే చవిచూడలేరనీ.. ప్రతి మనిషీ చాలాసార్లు ఓడిపోతూ.. కొద్దిసార్లు మాత్రమే గెలుస్తాడనీ తన క్లైయింట్స్‌కు చెబుతూ వాళ్ళకు వాస్తవ జీవిత సత్యాలను అవగతపరుస్తూంటుంది. ఇది మొదట వినడానికి చాలా విస్మరణీయ విషయంగా.. సిల్లీగా.. అప్రాధాన్య సంగతిగా అనిపించినా తర్వాత్తర్వాత చాలా మంది ఈ సత్యాన్ని గ్రహిస్తూ లక్ష్యాలను చేరుకోవడానికి తాము పదే పదే ప్రయత్నాలు చేసి ఓడిపోయిన అనుభవాలను వంచుకోడానికి ముందుకొస్తూ అర్థం చేసుకున్నారు. మనిషి లక్ష్యాలన్నీ పూర్తిగా భౌతికం కావనీ.. ఎన్నో అంతర్గత హృదయ సంబంధ విషయాలు కేవలం గెలుపు ఓటములకు సంబంధించినవి కావనీ.. చాలా వరకు మనిషి 'అసలు తనకు ఏమిటి కావాలో.. దానిని మించి ఏమిటి వద్దో.. తాను దేనికోసం తనకు తెలియ కుండానే అనవసరంగా ప్రాకులాడ్తూ విలువైన జీవితాన్ని వృధా పర్చుకుంటున్నాడో.. తమ 'రీ డు' సాంగత్యంతో తెలుసు కుంటున్నప్పుడు సుమతి ఎంతో ఆనందించడం అనుభవరీత్యా అనుభూ తించింది.



నాన్న.. నరసింహమూర్తి చెప్పాడు పదే పదే ఒక్కగానొక్క కూతురైన తనకు.. 'అమ్మా.. జీవితం మనిషికి దొరికిన అద్భుతమైన ఒక అవకాశం. దీన్ని అర్థవంతంగా.. నలుగురికి ఉపయోగపడే విధంగా జీవించడం చేయగలిగితే అదే సార్థకత' అని. ఆ మాటను విన్నప్పుడు.. 'అవకాశం', 'సార్థకత' అన్న పదాలు ఎంతో క్లిష్టంగా, కొత్తగా, చాలెంజింగ్‌గా అనిపించాయి సుమతికి.

నిజమే మనిషి నడక నేర్చుకోవడం సులువైన అతి కష్టసాధ్యమైన పనే.

నాన్న అన్నాడు 'అధ్యయనం చేయి.. ఈ ప్రపంచాన్ని.. ఈ దేశాలను.. ఈ భిన్న సమాజాలను.. కుల మత వర్ణ జాతులతో సంఘర్షిస్తున్న అనేకానేక మానవ సమూహాలను.. చివరికి ఆ అధ్యయనాల, విశ్లేషణల వెలుగులో నిన్ను నువ్వు తెలుసుకో.

'నిన్ను నువ్వు తెలుసుకున్న తర్వాత.. జ్ఞాన సంపన్నుడవైన నీకు నీ సామాజిక బాధ్యతలు అవగతమౌతాయి.. అత్యంత విషాదమైన విషయమేమిటంటే.. ప్రపంచ వ్యాప్తంగా మనుషులు వ్యష్టిగా.. అంటే, తాను కేవలం తనకు మాత్రమే చెందిన వానిగా భావిస్తూ తన, తన భార్యా పిల్లల, తన కుటుంబీకుల సుఖ సంతోషాలే పరమావధిగా జీవిస్తూండడం. కాని ప్రధానంగా సంఘ జీవియైన మనిషి ఆ మూలమైన ప్రధాన విషయాన్ని విస్మరించి సామాజిక బాధ్యతను మరిచిపోవడం. సాటి మనుషుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ఎథికల్ లివింగ్.. నైతిక జీవితాన్ని సమిష్టిగా జీవించగలిగే విస్తృత దృష్టితో ముందుకు ఆచరణాత్మకంగా ముందుకు సాగేవాళ్ళు దినదినం అంతరించిపోతూండడం. ఈ విపరిణామం పోను పోనూ ఒక అదృశ్య రుగ్మతగా విస్తరించి మానవ సమాజాలు ఎవరికివారే.. యమునా తీరేగా విచ్ఛిన్నమైపోతాయి.'

ఎన్ని లోతైన విషయాలో నాన్న ప్రస్తావించింది.

ఆయన చెప్పిన అవే విషయాలు.. వయసు పెరుగుతున్న కొద్దీ కొత్త కొత్తగా, వినూత్నంగా, ఇంకా ఇంకా విస్తృతంగా అర్థమయ్యేవి.

శ్మశానం దాటి చాలా దూరమే వచ్చారు అందరూ. ఓ పది మందిదాకా.

వెనక్కి తిరిగి చూచింది కాలుతున్న చితివైపు సుమతి. కళ్ళనిండా నీళ్ళు చిమ్ముకొచ్చాయి.

వెంట నడుస్తున్న మహేంద్ర ఆమె అంతరిక దుఃఖవివశతను గ్రహించి.. ఒక అనునయింపు నిండిన చూపుతో స్పర్శించాడు. మిగతా అందరిలోనూ గాఢ మౌనమే.

కారు ఎక్కుతూండగా 'సుమతీ.. ఒక సుదీర్ఘ అధ్యయనం తర్వాత తెలిసిన బహిరంగ రహస్యమేమిటంటే.. ఈ మన దేశాన్ని పట్టి పీడిస్తున్న ఏకైక సమస్య.. కుల మత జాడ్యం అని. 1947లో స్వాతంత్ర్యాన్ని పొంది మన స్వంత రాజ్యాంగంలో దీన్ని ఒక సెక్యులర్ దేశంగా ప్రకటిస్తూ.. కాలక్రమంలో కులమత రహిత సమాజంగా తీర్చి దిద్దాలని సంకల్పించిన అప్పటి తరం .. క్రమంగా అంతరించి పోతూ.. ఇప్పుడు.. భారతదేశమంటే.. కేవలం కుల మత సంఘాలతో మాత్రమే గల్లీ గల్లీలో వర్ధిల్లుతూ చీలికలు పేలికలై అన్ని రాజకీయ పార్టీలూ శాసిస్తున్నాయి. భారత ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ తనను 'నాకు కులం లేదు' అని ప్రకటించుకున్నాడు. కాని.. సామాన్య మానవులమైన మనం ఈ కుల మత వ్యవస్థతో ఎంత

పోరాటం చేస్తున్నామో.. నీకు తెలుసు గదా. 'అని మొన్నటి రాత్రి నాన్న చెప్పిన విషయం కోటి జ్ఞాపకాల తుఫాన్‌ను సంధించింది.

× × ×

జ్ఞాపకం- 1: పదునైన నేలపై బీజాలు పడిన వేళ.

జూన్ 12, 1961.

నరసింహమూర్తి తన ఒక్కగానొక్క కుమార్తె సుమతిని తీసుకుని ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళాడు. ఉపాధ్యాయుడతను. ప్రభుత్వ ఉద్యోగులందరూ విధిగా ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చదివించి అందరికీ మార్గదర్శకులు కావాలని అతని నికర ఆలోచన. ఆయన చేతి వేలు పట్టుకుని.. చంకలో కొత్త పలకను పట్టుకుని సుమతి. చిన్నపిల్ల.

"అడ్మిషన్ ఫాం నింపండి" అని గుమాస్తా ఒక కాగితాన్ని చేతిలో పెట్టే.,

పేరు.. తండ్రి పేరు.. చిరునామా.. కులము.. మతము.. జాతీయత.. ఇట్లా కాలంస్.



నరసింహమూర్తి 'కులము' అన్న కాలం దగ్గర .. ఖాళీ గీత, 'మతము' అన్న కాలం దగ్గర .. మళ్ళీ ఒక ఖాళీ గీత పెట్టి 'జాతీయత' అని ఉన్నచోట ' భారతీయురాలు (ఇండియన్ )' అని పూర్తి చేసి కింద సంరక్షకుని సంతకం చేసి ఇస్తే.. గుమాస్తా తీసుకోడు. కుల మతాల కాలం విధిగా నింపాలని వాదన. హెడ్మాస్టర్ ను కలిస్తే .. అతనూ అంతే. వితండ వాదన.

"నా కూతురుకు కులం లేదు. ఆమెను ఒక ఇండియన్‌గా భావించి తీసుకోండి" అంటే.. ఉహూ వినడు.

విసుగొచ్చి "ఈ సెక్యులర్ దేశంలో ఈ కుల మతాల కాలంస్ తప్పనిసరిగా నింపాలని ఉన్న రూల్ చూపించండి" అని ప్రశ్నిస్తే.,

"అవి నింపకున్నా ఫర్వాలేదు.. అడ్మిషన్ ఇవ్వొచ్చు అన్న రూల్ చూపించండి " అని ఎదురు ప్రశ్న.

ఇక చేసేది లేక వెనుదిరిగి.. ఒక పోరాటం ప్రారంభం.

బయటికి వస్తున్నపుడు.. వీధిలో రెండు ప్రక్కలా చెంపలకు 'వెలుగు నీడలు' సినిమా పోస్టర్లను కట్టుకుని వెళ్తున్న జట్కా బండిలోనుండి గ్రాం ఫోన్ పాట వినబడ్తోంది 'పాడవోయి భారతీయుడా' పల్లవితో. 'పదవీ వ్యామోహాలూ, కులమత భేదాలూ, భాషా ద్వేషాలూ చెలరేగే నేడు' అని. అప్పటికి భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి పద్నాలుగు సంవత్సరాలే ఐంది. సెక్యులర్ రాజ్యమని రాసుకున్న రాజ్యాంగం సిరా ఆరనేలేదింకా. శ్రీశ్రీ మహాశయా జోహార్లు.

నాన్న ఇక తహసిల్ కార్యాలయంలో.. అక్కడినుండి కలెక్టర్ ఆఫీస్ కు.. భారత రాజ్యాంగం తన 25- 28 అధికరణాల్లో ఇచ్చిన 'ఫ్రీడం ఆఫ్ రిలిజియన్' హక్కు కింద 'నో కాస్ట్ నో రిలిజియన్ సర్టిఫికేట్ 'ఇవ్వమని. కాని వాళ్ళు ఇవ్వమని.

ఈ ప్రయత్నం చేస్తున్న నాన్నను చూచి అందరూ వింతగా చూడ్డం.. అవహేళన చేయడం.. అవమానించడం.. ' బయల్దేరాడయ్య దేశోద్ధారకుడు ' అని ఎకసక్కాలు .

పట్టు వదలని నాన్న చివరికి జిల్లా కోర్ట్.. అక్కడినుండి హై కోర్ట్ దాకా వెళ్ళి పదిహేను సంవత్సరాల తర్వాత పట్టువదలని నరసింహమూర్తిగా 'నో క్యాస్ట్‌నో రిలిజియన్' సర్టిఫికేట్ ను సాధించాడు. ఐతే ఎప్పుడూ దేశం గొడ్డుపోదు. ఈ పదిహేను సంవత్సరాల్లో నాన్న తనవంటి నాల్గు వందలమంది సామాజిక చైతన్యం గల వ్యక్తులనూ, కార్యకర్తలనూ తీర్చి దిద్దారు.

సుమతి పి.యు.సి అడ్మిషన్ కు వెళ్తే మళ్ళీ ఇదే ప్రతిబంధకం. నాన్న ఆ కోర్ట్ సర్టిఫికేట్‌ను చూపిస్తూ అధికారులను తిట్టడం.. ప్రతిసారీ ఒక సీన్. ఈ పట్టువదలని నాన్నకు ఈ పట్టింపేమిటి.. అని మొట్టమొదటిసారి సుమతి ఒక పౌరురాలిగా ఆలోచించింది. ఎందుకో ఆ క్షణం ఆమెకు ఆత్మగౌరవమూ, దయా, నిక్కచ్చితనం, నైతిక బాధ్యత కలిగిన నాన్నపై జాలీ, ప్రేమా, ప్రశంసా సమ్మిళితమై గర్వం కలిగింది.

అప్పుడామె నాన్న పాదముద్రల కోసం వెదకడం ప్రారంభించింది.

× × ×

జ్ఞాపకం-2: ఆరోగ్యవంతమైన మొలక తప్పక ఎదిగి వృక్షమౌతుంది.

యూనివర్సిటీలోనే ప్రథమురాలిగా స్వర్ణ పథకాన్ని సాధించిన సుమతికి దేశంలోనే అతి పెద్ద సాఫ్ట్ వేర్ కంపనీ 'వైబ్రెంట్ మైండ్స్'లో ఇంజనీర్ గా ఉద్యోగం వచ్చినపుడు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చేటప్పుడు అభ్యంతరం లేవనెత్తారు హెచ్ ఆర్ డిపార్ట్ మెంట్. .. 'నీ కులమేమిటో.. మతమేమిటో 'తప్పక రాయాలని. ఇక తప్పలేదు సుమతికి మళ్ళీ పోరాటం చేయక.

నేరుగా హైకోర్ట్‌ను ఆశ్రయించి నాన్న తనను చేతి వ్రేలుపట్టుకుని ప్రభుత్వ పాఠశాలకు తీసుకుపోయిన దగ్గరినుండి ఈ లౌకిక దేశంలో 'నాకు కులము లేదు మతము లేదు' అని నెహ్రూ లాగనే ప్రకటించినందుకు పడ్డ కష్టాల గురించీ, అవమానాల గురించీ ఏకరువుపెట్టింది కాగితంపై. ధర్మాసనాన్ని ' రైట్ టు రిలిజియన్ ఉంటే.. రైట్ టు నాన్ రిలిజియన్ కూడా ఉంటుందికదా యువరానర్'అని ప్రశ్నించింది.

న్యాయమూర్తి.. సుమతి చేస్తున్న అలుపెరుగని పోరాటాన్ని ప్రశంసిస్తూ.. రాజ్యాంగబద్ధమైన ఈ హక్కును ఉపయోగిస్తున్న పౌరులకు .. నిజానికి సమసమాజాన్ని స్వప్నిస్తున్న యువతరం ఒక ఆదర్శ మార్గంలో నడుస్తోంటే.. వాళ్ళకు దన్నుగా కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తూ ఈ అంశాన్ని ఒక ప్రధాన విషయంగా స్వీకరించి ఒక చట్టాన్ని తయారు చేయాలి' అని మానవ వనరుల శాఖకు

సలహా ఇచ్చింది.

ఐతే సుమతి ఈ దిశగా అనేకమంది సామాజిక స్పృహ ఉన్న వందలమంది యువతీ యువకులను చైతన్య పరుస్తూ.. 'నో క్యాస్ట్ అండ్ నో రిలిజియన్ సొసైటీ'ని స్థాపించింది.. రాజకీయ నాయకులను సభలకు పిలిచి.. వాళ్ళ చేత సమాజం బాగుపడాలంటే మనుషులు ఈ కులమత భావనను విడనాడాలని బహిరంగంగా చెప్పించింది. మీడియాలో అనేక చర్చలను పెట్టించి రాజ్యాంగ హక్కులు.. సమసమాజ స్థాపన దిశగా ఒక బలమైన ఆలోచనను యువతరంపై సంధించింది.

సుమతికి తోడు మహేంద్ర చేరాడు సరిగ్గా అదే భావాలు కలిగిన యువకునిగా.

'ఇక దీన్ని ఒక ఉద్యమంగా స్వీకరించి విస్తృతపరుద్దాం' అని తీర్మానించుకుని పిడికిలి బిగించారు.

సుదీర్ఘ ప్రయాణం ఒక్క అడుగుతో మొదలైంది.

× × ×

జ్ఞాపకం –3: మానవులే మహనీయులు

11 ఏప్రిల్, 1982

జ్యోతిరావ్ పూలే జన్మదినం.



జీవితాంతం కృషి చేసిన కులరహిత సమాజ స్వాప్నికుడు, సామాజిక సంస్కర్త జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా సుమతి, మహేంద్ర లు సృష్టించిన 'రీ డు' సాఫ్ట్ వేర్ సంస్థ భారీ ఎత్తున ఒక బహిరంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. దానిక్కారణం సుమతే తే దానికి ఎం.డి కావడం. విజేత కావాలనుకుంటున్నవాడు ముందుగా తనను తాను ఆర్థికంగా, బలగం పరంగా సమర్థునిగా మలచుకోవాలె.

నిజానికి దుర్వ్యసనాలు ఎంత తొందరగా వ్యాపిస్తాయో.. మంచి కార్యక్రమాలుకూడా తగిన, సమర్థవంతుడైన నాయకుడుంటే అంతకన్నా వేగంగా ప్రజల్లోకి విస్తరిస్తాయి. గాంధీ నాయకత్వంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన జాతీయోద్యమం అట్లాగే విస్తరించింది అప్పుడు. ' నో క్యాస్ట్ అండ్ నో రిలిజియన్ సొసైటీ ' యువకుల్లో ఒక మానియా ఐ విస్తరిస్తోంది. సుమతీ, మహేంద్రా యువకుల్లో రివర్ క్లీనింగ్, సేవ్ రాక్స్, ఇసుక మాఫియాలను అడ్డుకోవడం, ఎన్విరోన్ మెంటల్ ప్రొటెక్షన్ వంటి కార్యక్రమాలను గత రెండేండ్లుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. మంచి ప్రతిస్పందన వస్తోంది అన్ని వర్గాల్లోనుండి.

ఆ రోజు.. సుమతికీ, మహేంద్రకూ పెళ్ళి. జ్యోతిరావ్ పూలే 'సత్యశోధక మార్గం'లో ఏ వేదమంత్రాలూ, పురోహితులూ లేకుండా నిరాడంబరంగా స్నేహితుల మధ్య 'గాంధీ' పటం సాక్షిగా జరుగుతోంది కార్యక్రమం. పెళ్ళి ఖర్చులను ఆదా చేసి పదిహేను వందలమంది విద్యార్థులకు యూనిఫాంస్, పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. వేదికపై.. సుమతీ, మహేంద్రా తమ తమ పేర్లకు ముందూ, వెనుకా కులాలను సూచించే తగిలింపులను త్యజిస్తున్నట్టు ప్రకటించారు. ఇంటి పేరునూ కత్తిరించేశారు. తొడుగులూ, ముసుగులూ తొలుగుతున్నకొద్దీ మనుషులు పరిపూర్ణులౌతారని పెద్దలు చెప్పిన మాటలను ఉటంకించారు.

చివరగా సుమతి ఒక బృహత్ ప్రణాళికను ప్రకటించింది.

'ఈ దేశం నుండి ప్రజలకు అత్యంత హానికారకమైన ప్లాస్టిక్ ఉపయోగాన్ని పూర్తిగా నిషేదించేదాకా విశ్రమించేది లేదని'

ప్లాస్టిక్ వినియోగం పై రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు ఆడుతున్న కపట నాటకాన్ని బట్టబయలు చేస్తూ.. 'అసలు ప్లాస్టిక్ ఉత్పత్తి కేంద్రాలలోనే ప్లాస్టిక్ ను తయారు చేయడం నిషేదించాలని ప్రతిపాదించింది. 'మేమైతే తయారుచేస్తాం, అమ్ముతాం.. కాని మీరు వాడకండి ' అనే నినాదం తప్పు. బూటకం. అసలు ప్రజలకూ, వ్యాపారస్తులకు ప్లాస్టిక్ సంచులూ, ఇతర ఐటంస్ అందకుండా, కంపనీలు తయార్ చేయకుండా నిషేదిస్తే.. ఈ ప్లాస్టిక్ భూతం మరుదినమే పారిపోతుంది దేశం నుండి. దేశమంతా ఎక్కడ చూస్తే అక్కడ చెరువులు, కుంటలు, మున్సిపల్ మోరీలు, నదులు, రేవులు, కాలువలు అన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో మురిగిపోతూ మునిగిపోతున్నాయి. ఇది ఎంత హానికారకమో ఇప్పుడర్థం కావట్లేదు జనానికి. కాని పెనుప్రమాదం ముంచుకొస్తోంది వేగంగా ' చెప్పుకుపోతూనే ఉంది సుమతి ఆవేశంగా.

× × ×

'నో క్యాస్ట్ అండ్ నో రిలిజియన్ సొసైట' ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వివిధ రాష్ట్రాలనుండి వచ్చిన లక్షల మంది యువకులతో ఒక మెగా ర్యాలీని నిర్వహిస్తోంది.'

నినదిస్తున్నాయి లక్షల కంఠాలు.

'నో క్యాస్ట్ అండ్ నో రిలిజియన్ తరానికి రాజ్యాంగ భద్రత.. రక్షణ కల్పించాలె.'

'ప్రభుత్వాలు కుల సంఘాలకూ, మత సంస్థలకూ వంత పాడడం ఆపేయాలె'

'దేశంలో ప్లాస్టిక్ ఉత్పత్తిని తక్షణం నిషేదించాలె.'

'మీరు మాకు చేయూత నివ్వండి.. మేము ఈ దేశాన్ని శుభ్రం చేస్తాం

'యువత తలుచుకుంటే.. ఈ దేశ గమనం మారుతుంది. కలిసికట్టుగా ఆరోగ్యవంతమైన ప్రగతిశీల సమాజాన్ని నిర్మిద్దాం.'

నినాదాలు మిన్ను ముద్దున్నాయి.

కొత్త రక్తం.. కొత్త గాలి.. కొత్త ఆలోచనలు.. కొత్త తరం ముంచుకొస్తోంది ఈ దేశపు వీధులగుండా.

– రామా చంద్రమౌళి,
m : 9390109993
e : chandramoulirama@gmail.com

చరిత్ర, సాహిత్యం, వారసత్వం, పర్యాటకం, కళలు, సంస్కృతి, సామాజిక అంశాలు, తెలంగాణ ఉద్యమం.. ఇలా ఎన్నో అంశాలపై తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది. ప్రచురించిన ప్రతి పుస్తకం కూడా ఆ రంగంలో లేదా విభాగంలో ఒక ఆణిముత్యంలా నిలిచింది.










రకరకాల కారణాలతో తెలంగాణ ప్రముఖుల చరిత్రలు అంతగా వెలుగులోకి రాకుండా పోయాయి. ఆయా ప్రముఖులపై ప్రజలకు ఒక అవగాహన కల్పించేలా వివిధ వ్యాసాల సంకలనంతో మనిషి పేరిట తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది.



# బంజార జీవితాలను నవరసభరితంగా చూపించిన 'గోర్‌జీవన్' చిత్రం

సుమారు వంద సంవత్సరాల తెలుగు సినిమా చరిత్రలో పూర్తిస్థాయిలో బంజారా భాషలో రూపొందిన తొలిచిత్రం గోర్ జీవన్ సినిమా. ఒకరకంగా ఇది రికార్డ్ అనికూడా చెప్పొచ్చు. 1921లో రఘుపతి వెంకయ్య 'భీష్మ ప్రతిజ్ఞ' అనే మూగ సినిమా (మాటలులేని) విడుదల చేశాడు. పూర్తిస్థాయి మాటలతో 1931లో భక్త ప్రహ్లాద చిత్రం విడుదలైంది. ఆనాటి నుండి నేటి వరకు వేల సంఖ్యలో సినిమాలు వచ్చాయి. అయితే అవన్నీ పౌరాణిక, సాంఘిక, చారిత్రక, కాల్పనిక నేపథ్యాలతో అల్లబడిన సినిమాలనే చెప్పాలి. వందల సంవత్సరాలుగా ఈ నేలపై జీవిస్తూ ప్రత్యేక భాష ఆచార వ్యవహారాలు, ఆహార్యం కలిగిన బంజారాల జీవితం మాత్రం వెండితెరపై కనిపించడానికి ఇన్ని సంవత్సరాలు పట్టింది. ఏదైమైన బలమైన కాంక్షతో జాతి ఋణం కొంత తీర్చుకోవాలన్న తలంపుతో కె.పి.ఎన్ చౌహన్ చేసిన తొలి ప్రయత్నం ఎంతో అభినందించదగ్గది.

మంగ్లీ, చౌహన్, చమ్మక్, బోలేషావలి ప్రధానతారా గణంగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకాధరణని, విమర్శకుల ప్రసంశలని దక్కించుకుంది. చిత్రకథలోకి వెళితే... సక్కు బాయిగా తండాలో స్మగ్లింగ్ ధందా చేస్తూ తనకి ఎదురొచ్చిన వారిని అడ్డుతొలగించుకొంటూ సొంతవ్యవస్థను నడుపుతుంటాడు షావలి. ఆక్రమంలో కొన్ని సంవత్సరాల కింద తండా నించి పారిపోయి ప్రేమ వివాహం చేసుకొని సంవత్సరాల కింద తండా నించి పారిపోయి ప్రేమ వివాహం చేసుకొని తిరిగొస్తున్న చౌహన్ (కథానాయకుడు) తల్లిదండ్రులను చంపుతాడు విలన్ షావలి. అదే సమయంలో తాగుడుకి బానిసై కూతురుని అమ్మ జూస్తాడు స్వేచ్ఛ (హీరోయిన్) తండ్రి. తన కూతురిని వ్యాపారస్తులు ఎత్తుకుపోతుంటే కాపాడబోయి వారి చేతిలో హత్యకు గురవుతుంది స్వేచ్ఛ తల్లి అక్కడి నుండి కథ హైదరాబాదుకి చేరుతుంది.




తల్లిదండ్రుల చనిపోవడంతో అనాథలుగా మారిన స్వేచ్ఛ, చౌహన్‌లు హైదరాబాదులో పెరిగి పెద్దవుతారు. స్వేచ్ఛను ఒక పెద్దమనిషి పెంచుకొంటాడు. చౌహన్ సొంతంగానే పెరుగుతాడు. సమాజంలో బాధ్యతగల పౌరుడిగా నడుచుకొంటూనే సినిమా డైరెక్టర్ అవుతాడు. చిన్నప్పుడు గోదావరి నదిలో పడవ ప్రయాణంలో స్వేచ్ఛను చూసి ఇష్టపడిన చౌహాన్ పెద్దయ్యాక దాన్ని ప్రేమగా మలుచుకొంటాడు. స్వేచ్ఛ జర్నలిస్ట్ అవుతది. ప్రపంచంలోని సవాళ్ళపై డాక్యుమెంటరీలు తీస్తుంటుంది. ఈ క్రమంలోనే అనుకోకుండా తండాలపై డాక్యుమెంటరీ తీయడానికి తన సొంత తండాకి వెళు తుంది. స్వేచ్ఛను అనుసరిస్తూ చౌహాన్ అక్కడికి వెళ్లడంతో కథ పాకాన పడుతుంది. అక్కడే వీరిద్దరికి బాల్యంలో సక్కుబాయి చేసిన అన్యాయం బట్టబయలు అవుతుంది. దాంతో చౌహాన్, స్వేచ్ఛలు సక్కుబాయిపై పగ తీర్చుకోవడం, స్వేచ్ఛ చౌహాన్ ప్రేమను అంగీకరించడంతో కథ సుఖాంతం అవుతుంది.

నటీనటుల విషయానికొస్తే కథ, కథనం, మాటలు, దర్శకత్వం వంటి బాధ్యతలన్ని మీదేసుకొని కె.పి.ఎన్ చౌహాన్ తన ప్రతిభచాటాడు. నటుడిగా తొలిచిత్రమే అయినప్పటికీ ఎక్కడా ఆ భావన కనిపించలేదు. సినిమా దర్శకుడిగా, నిజాయితీగల ప్రేమికుడిగా, యాంగ్రీయంగ్ మెన్‌గా కనువిందు చేశాడు చౌహాన్. ఇక తెలుగు రాష్ట్రాల్లో తన గ్రాతంతో లక్షలాది అభి మానుల్ని సంపాదించుకొన్న మంగ్లీ స్వేచ్ఛ పాత్రలో ఒదిగిపోయింది. ఆపదలో ఆత్మ స్థైర్యాన్ని ప్రదర్శిస్తూ, కరాటీలో ఫైట్లు చేసి స్ఫూర్తివంతమైన పాత్రలో జీవించింది మంగ్లీ. వారిద్దరితో పాటు చెప్పు కోవాల్సింది బోలేషావలి, చమ్మక్ చంద్రల గురించి రెండు భిన్నమైన వేరియేషన్స్‌తో బాగా ఆకట్టుకొన్నాడు షావలి. సాధారణ వ్యక్తిలా నాయక్‌గా, కరుడు కట్టిన విలన్ సక్కుబాయిగా అలరించాడు షావలి. అతడి భవిష్యత్‌కి ఈ పాత్ర ఒక మెట్టులా ఉపయోగపడుతుంది. జబర్దస్తుతో సుపరిచితమైన చమ్మక్‌చంద్ర సినిమా ద్వితీయార్థంలో తనదైన మేనరిజమ్‌తో నవ్వులు పంచాడు. రెండవ హీరోయిన్ ప్రియ పాత్రమేరకు నటించింది. చిన్ననాటి నాయికా నాయకులుగా నటించిన చిన్నపాప, బాబు (లక్కీస్టార్ చక్రి) మంచి నటనని కనబరిచారు. కెరీర్ ప్రారంభంలోనో ఇట్లాంటి మంచిపాత్రలు దొరకడం, వాటిని వారు సద్వినియోగం చేసుకోవడం బాగుంది.

సినిమా చూస్తున్నంతసేపు టెక్నిషియన్స్ ప్రతిభ అడుగడుగున దర్శనమిస్తుంది. ఛాయాగ్రాహకుడు విజయ్ ఠాకూర్ తన కెమెరా పనితనంతో సినిమాకు మరింత వన్నె తెచ్చాడు. తండావాతావరణం గోదావరి అందాలు కళ్ళకు కనువిందుగా చూపించాడు. సంగీతం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ రెండూ అందించిన బోలేషావలికి ఇది మంచి

బ్రేకింగ్ చిత్రమనే చెప్పాలి. సినిమాలోని ఆరుపాటలు వేటికవే ప్రత్యేకంగా, వినసొంపుగా ఉన్నాయి. ముఖ్యంగా 'జారీచుయామా జారీచు యా, పిసానా వక జారీచు' పాట మనసుల్ని కదిలించింది. బంజారా సంప్రదాయాన్ని చూపుతో 'జాటీ జంగేలేతి దుంకర ఖౌళ్యా మాతి, బంజారా... ఆ... ఆ...' అంటూ సాగే గీతం హుషారుగా ఉంటూ సంస్కృతిని ఆవిష్కరించింది. అట్లనే ఈ 'జల్రోంతారు ఎల్డోజీ మాయె' అనే ప్రేమగీతం హృదయాన్ని బరువెక్కించింది. సినిమా తీయాలంటే ఖుత్తో కూడుకున్న పని. నిర్మాత సతీష్ నాయుడు చిత్రాన్ని ఎంతో క్వాలిటీగా నిర్మించాడు. పాటలు, సన్నివేశాలు చాలా బాగా కన్పించాయంటే దానివెనుక సతీష్ నాయుడు నిర్మాణ విలువలు కొనియాడదగినది. తెరపై కనిపించే ప్రతి సన్నివేశంలోనూ నిర్మాత ఖర్చు కనిపిస్తుంది. ఎడిటర్ సతీష్ దుర్గం ఎడిటింగ్ పర్వాలేదని పించింది. సినిమా మొదలైన దగ్గర నుండి చివరిదాకా సన్నివేశాలు సందర్భానుసారం రావడంలో ఎడిటర్ ప్రతిభ కనిపిస్తుంది. అక్కడక్కడ కొన్ని సన్నివేశాలు సాగదీసిన భావన కలుగుతుంది. అయినప్పటికీ ఫైనల్గా బాగుంది. దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన కె.పి.యన్. చౌహాన్ శ్రమ, అభిరుచి, నైపుణ్యం సినిమా ఆసక్తిగా మలిచి, అద్భుతమైన మనసుని హత్తుకునే సంభాషణలతో మలిచాడు దర్శకుడు. ఒకపక్క ప్రేమకథని చూపుతూనే, మరొపక్క సామాజిక సమస్యల్ని చూపించాడు. ఇప్పటికీ తండాల్లో అమాకులైన బంజారాలు మద్యం మత్తులో జీవితాల్ని ఎలా ఛిద్రం చేసుకుంటున్నారో చూపించాడు. అక్షర జ్ఞానం అంతగాలేని లంబాడీలు అప్పులు చేసి వాటికి పెరిగిన వడ్డీలు కట్టలేక ఆడపిల్లలని అమ్ముకునే దైన్యాన్ని కళ్లముందుంచాడు.

తండాలు హాయిగా, ఆనందంగా ఉంటాయని మనందరం అనుకుంటాం. కానీ వాటి లోతుల్లోకెళ్లి అక్కడి పరిసరాలతో మమేకమై వాస్తవాన్ని చూస్తే తండాల్లో విషాదాలు నింపుతున్న కోణాలెన్నో బోధపడుతాయి. మాయ, మోసం తెలియని బంజారాల్లో మద్యపానం, పేదరికం ఎట్లాంటి తప్పటడుగులు వేయిస్తాయో, ఎలాంటి అనాలోచిత నిర్ణయాలకు పురిగొల్పుతాయో చెప్పింది ఈ చిత్రం. రిజర్వేషన్ల పేరిట ఒకరిద్దరు డెవలప్ అయినట్లు కనిపిస్తున్నా అది నామమాత్రమే. ఇప్పటికే తొంబై శాతం అభివృద్ధికి దూరంగా భారమైన జీవనాన్ని గడుపుతున్నారు. సినిమా ప్రారంభంలో వచ్చే 2050 సంవత్సరానికి సంబంధించిన సన్నివేశాలు గగుర్పాటుని కలిగిస్తాయి. స్వచ్ఛమైన ఆక్సిజన్ కోసం ప్రజలు ఆనాటికి ఎంత కష్టపడాల్సి వస్తుందో దూరదృష్టితో చూపారు.

అడవుల పరిరక్షణ, ఆడపిల్లల అమ్మకాల నిరోధం, సంస్కృతి సంప్రదాయాల కలబోతగా తెరకెక్కిన 'గోర్జీవన్' చిత్రం సినిమా చరిత్రలోనే ఒక సందేశాత్మక, ప్రయోగాత్మక చిత్రం. అభివృద్ధి నాగరికత పేరుతో అన్యభాషలు నేర్చుతూ మాతృభాషలో మాట్లాడటం మర్చిపోతున్న ఈ రోజుల్లో గోర్బోలి / బంజారా భాషలో సినిమాతీయడం గొప్ప ప్రయత్నం, స్ఫూర్తిదాయకం. ఇప్పటికే ప్రేక్షకాధారణ చూరగొన్న ఈ సినిమా భవిష్యత్ అనేక అవార్డులను కూడా అందుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మొన్నటి దాకా ప్రజలని కాపాడే పోలీసువృత్తిలో సేవలందించి, నేడు జాతిని, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసే బృహత్కార్యంగా చిత్రాన్ని మలిచి విజయం సాధించిన చిరంజీవి కె.పి.యన్. చౌహాన్ని మరొకమారు అభినందిస్తూ, చిత్రంలోని నటీనటులకు సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు. జీవితాల్ని అతిదగ్గరగా చూపే ఇలాంటి చిత్రాలు సినిమారంగంలో మరెన్నో రావాలని కోరుకుంటున్నాం.

**చిత్రం:** బంజారా భాషలో మొదటి చిత్రం
**నటీనటులు:** కె.పి.ఎన్. చౌహాన్ - కథానాయకుడు
మంగ్లీ - కథానాయకి
బోలేషావలి - ప్రతినాయకుడు
చమ్మక్చంద్ర - సహాయనటుడు

కథ, మాటలు, స్క్రీన్ప్లే (కథనం) దర్శకత్వం : కె.పి.ఎన్. చౌహాన్
నిర్మాతలు : సతీష్ నాయుడు కుమార్ సంగీతం : బోలేషావలి
ఎడిటర్ : సురేశ్ దుర్గం కెమెర : విజయ్ ఠాగూర్

- ఆచార్య సూర్యాధనంజయ్,
m : 9849104187
e: surydhananjay@yahoo.co.in



డా. ఎన్. గోపి రచించిన వృద్ధోపనిషత్ కావ్యం హిందీ, ఇంగ్లీషు అనువాద గ్రంథాలను తెలంగాణా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో కిన్నెర అధినేత మద్దాళి రఘురాం, శ్రీమతి సిరిసిల్ల చందన, కృతికర్త హర్షవర్ధన్, సభాధ్యక్షులు డా. వోలేటి పార్వతీశం, మూలకవి ఎన్.గోపి, ఆంగ్లానువాదకులు ఎం. శ్రీధర్, అల్లాడి ఉమ ఉన్నారు.

## 'దండకడియం'

# అతని కవిత్వం ఒక నిరలంకారపద్యం

తెలంగాణ నేపథ్యంతో, తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబించేలా, తెలంగాణ పదబంధాలతో సాహిత్య సృజన చేయడం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఎక్కువగా జరుగుతోంది. ఈ సోయి ఎక్కువగా యువకవుల్లో కనిపిస్తోంది. ఇది ఒక మంచి పరిణామం. అలాంటి యువకవుల్లో ఈ మధ్య బాగా వినిపిస్తున్న పేర్లలో తగుళ్ళ గోపాల్ ఒకటి. ఈ మధ్యనే రంగులద్దిన వాక్యాలలోకి అంటూ తన 55 కవితలని 'దండకడియం'గా ధరించి మన ముందుకొచ్చాడు. గోపాల్ కవిత్వాన్ని చదువుతుంటే జీవితచిత్రాల్ని సజీవంగా ప్రతిఫలింపజేసే, సహజ స్పందనల్ని అంతే సహజంగా ఆవిష్కరించే ఒక సహజకవిలా అనిపిస్తున్నాడు. తెలంగాణలోని విలక్షణమైన మట్టివాసన, కష్టాల చరిత్ర, సాంస్కృతిక వారసత్వం గోపాల్ కవిత్వానికి మూలధాతువులు. గోపాల్ కవిత్వం నిండా మానవీయ స్పర్శ ఉంది. అనుభవాలను అక్షరాలుగా మలిచే విద్య ఉంది. అవే పఠితకు అనుభూతి కేంద్రాలవుతాయి, ఆ అక్షరాల దారిగుండా వెళ్ళి తనని తాని వెతుక్కునేలా చేస్తాయి. మానవ సంబంధాల సున్నితత్వం, దుఃఖానికి సంబంధించిన గాఢమైన వ్యక్తీకరణ అతని కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంది. ఇవన్నీ అతనిలోని ఆర్ద్రత వల్లనే సాధ్యమయ్యిందేమో. అందుకే ఆర్ద్రత, అనుభవాల అక్షరాకృతే అతని కవిత్వమనొచ్చు. గోపాల్ కవిత్వం సజీవ జానపద సంగీతంలా, శ్రమ సంస్కృతి సంకేతంలా, గ్రామీణ జీవనగీతంలా ఉంటుంది. తాను పుట్టిపెరిగిన మట్టివాసననే తన కవిత్వంలో చొప్పించాడు. అతడు మట్టిలోంచి మొలకెత్తిన కవిత.




ఇంతకీ గోపాల్ వయస్సు ముప్పైలోపే. ఆ ముప్పైలో జీవితాన్ని చూడగలిగిన, తెలుసుకోగలిగిన వయస్సు దాదాపుగా ఇరవైకి దగ్గరే అని చెప్పొచ్చు. అప్పటికే జీవితాన్ని కవిత్వంగా మలుస్తున్నాడు. అంటే అతని జీవితమే కవిత్వమని చెప్పొచ్చు. కవిత్వంతో జీవితాన్ని కళాత్మకంగా జీవిస్తున్నాడు. రసాత్మకం చేసుకుంటున్నాడు.

శివారెడ్డి గారు తన ముందుమాటలో చెప్పినట్లు గోపాల్ బలమంతా అతని భాషే, అతని ఊరి భాషే. తెలంగాణ పదబంధాలతో నేటివిటీని చూపెట్టడడం అతని ప్రత్యేకత.

దండకడియం సంపుటిలో మొదటి కవిత(అమ్మదీపం)తోనే నేటికాలంలో మృగ్యమవుతున్న మానవసంబంధాలమీద అక్షరాస్త్రం సంధించాడు గోపాల్. సృష్టిలో ప్రతిప్రాణి తన సహజలక్షణాలని కోల్పోకుండా మనుగడ సాగిస్తుంటే, మనిషొక్కడే ప్రకృతినుండి పక్కకు జరిగి వికృతిగా మారుతున్న వైనాన్ని సరళంగా చెప్పాడు. ఇక రెండో కవిత 'ఒకే ఆకాశాన్ని కప్పుకున్నవాళ్ళం'లో ఒకే ఆకాశాన్ని కప్పుకున్నం/ ఒకే మట్టిని కప్పుకోవలిసినవాళ్ళం/ ఇది చాలదా? /మేం బంధువులం కావడానికి అన్న పంక్తులతో విశ్వజనీనతను, సార్వకాలికతను, సార్వజనీనతను తన కవిత్వంలో సాధించగలిగాడు.

గోపాల్ కవిత్వంలో ఎక్కువగా గ్రామీణ జీవితం, నోస్టాల్జియా, తాత్వికత, ఆశావాదం, భావుకత, అసమానతలు వస్తువులుగా కనబడుతున్నాయి.

పొద్దుపొద్దున్నే/తామరమొగ్గలను సిగలో ముడుచుకున్న/చెరువమ్మ ముఖం చూసినంకనే/సూరీడు ఏడుగుర్రాల బండికడుతాడు అని అలాగే కాంటాలు చిమ్మెటలు వేలాడే/పసుపుతాడు/ ముక్కుపుల్ల లేని నిండు ముఖం/బువ్వచేతి కొంగు ఏసుకునే అమ్మ/ఒక నిరలంకార పద్యం అంటూ భావుకతని పొదగగలిన కవి గోపాల్. అంతేకాదు ఇది కల అని తెలుసుకున్నాక/కండ్లు ఆనకట్టలేసిన చెరువులౌతాయి అని ఆర్ద్రతనూ అక్షరమయం చేయగలుగుతున్నాడు.

మనిషిని ముట్టుకోకుండజేసిన/కులం గీతల్ని దాటి/మనుషులంతా ఇక్కడ/ తామరపువ్వులై విచ్చుకుంటారు అంటూ ఆవేశంతో కాకుండా ఆశావాదాన్నే పలుకుతున్న గోపాల్కి కుర్చీల మెడలు వంచి/ఎత్తుకుపోయిన మెతుకుల్ని/ఎలా పట్టుకొచ్చుకోవాలో తెలుసు/ రైతుల రక్తాన్ని కండ్లజూస్తున్న/ఏ సర్కారు ముండ్లనైనా/ఒడుపుగా ఎలా కాలబెట్టాలో తెలుసు/ఇంకెప్పుడైనా/రైతు ఊపిరి చెట్లకొమ్మలకు వేలాడితే/ తోలు చెప్పుల సప్పుడే/దేశమంతా/జాతీయగీతమై మారుమోగుతుంది అంటూ ధిక్కార పద్యాన్ని వినిపించడం తెలుసు. ఈ కోవలో ఏది దొంగతనం, ఎవరు అసలు దొంగ అంటూ ప్రశ్నలు విసిరిన 'వెలిమామిడి' కవిత చదవాల్సిందే.

'గంజి' అనే కవితలో రెండే రెండు వాక్యాలతో (పట్టుబట్టలను గంజిలో అద్ది ఇస్త్రీ చేసే కొన్ని బతుకులు గుర్తొస్తాయి/పేగులమూటను నానబెట్టి పలుగుపార పట్టే మనుషులు గుర్తొస్తారు) సమాజ అంతరాలను పట్టిచూపిన తీరు గోపాల్ సమాజాన్ని చదువు తున్నాడనడానికి సంకేతంగా చెప్పొచ్చు. అదే కవితలో తన పేదరికాన్ని చిత్రించిన తీరు పాఠకుడ్ని కదిలిస్తుంది. అది అతని పేదరికమే కాదు మరెందరిదో.

దుఃఖాన్ని మోస్తూ తిరగడమే జీవితం అంటూ తాత్విక చింతనని కనబరుస్తూనే భరించలేనంత దుఃఖమని/చెట్టునో, చెరువునో వెతుక్కునే నిరాశాజీవులకి దుఃఖాన్ని వినే మనుషులు ఎక్కడో ఒకరు ఎవరో ఒకరు

ఉంటారని వాళ్ళముందు దుఃఖపుగంపని దించుకోవాలని ఆశావాదాన్ని నూరిపోస్తున్నాడు. రోజుకు ఒక్కసారైనా మాటల్ని కలుపుకొని తిందాం అంటూ తన కవిత్వంతో కౌన్సిలింగ్ ఇస్తున్నాడు. పొయ్యిమీద ఎసరు కాగుతుంటే/బియ్యంగింజలు చెప్పె గెలుపుపాఠం గంజి అంటూ సున్నితంగా మానసిక వికాసాన్ని కలగజేస్తున్నాడు.

జీవితమంతా పల్లెపట్టుల్లోనే గడిపినవాడిగా, అక్కడి శ్రమైక సౌందర్యాన్ని కళ్ళారా చూసినవాడిగా, ఆ ఈతిబాధలను అనుభవించినవాడిగా... గోపాల్ తన జీవితాన్నే కవిత్వం చేశాడు, కవిత్వానికి జీవం పోశాడు. అందుకే నిజమైన శ్రమ అంటే ఏంటో, నిజమైన ఉత్పాదకత అంటే ఏంటో అని ఎన్నో కవితల్లో సూత్రప్రాయంగా చెప్పుకుంటూ వస్తూ కవిత్వానికి మానవీయతను అద్దుతాడు. మచ్చుకు ఈ కింది పంక్తులను చూడండి.

ఈ ఇనుపగొడ్డలి/మా నాయనకు జిగిరి దోస్తు/మా ఇంట్లోని పేదరికాన్నంతా/కొంచెం కొంచెంగా నరుక్కుంటూ వచ్చింది/నాన్న మరణం చూడలేక/ఆ రోజే సగం విరిగిపోయింది/మొనదేలిన ఇనుపగొడ్డలి/ పెళుసులుపెళుసులుగా రాలి/నాన్నకు నివాళి నర్పించింది/ ప్రాణంగా చూసుకున్న దోస్తులేదని/మొద్దుబారి కూర్చుంది ఓ మూలకు.

అమ్మతనం గురించి చెప్తూ పాలుతాగే కొడుకు గుర్తుకొస్తే/ పిల్లబాటల గుండా నడక పెంచినపుడు/అడ్డమొచ్చిన మట్టిపెళ్ళలన్ని/ నీ పాదాలకు దండం బెడ్తవి అంటూ కరుణ రసాత్మకమైన దృశ్యకావ్యాన్ని కళ్ళముందు ఆవిష్కరిస్తాడు. మూడు రంగులు కలిసి/జాతీయ పతాకమైందే తప్పా/మన ముగ్గురమెపుడైనా/కలిసి నడిచామా? అని మన జాతి సమైక్యతను సూటిగా ప్రశ్నిస్తూనే మనుషుల్ని నరికే ఈ గోడను కూల్చడానికి/ఏ పలుగూపారా అవసరం లేదు/మానవత్వపు మొక్కను నాటితే/పగుళ్ళు వచ్చి కూలిపోతుంది అని మానవీయ సమైక్యతా మంత్రాన్ని బోధ చేస్తాడు. లక్షల పెట్టుబడులను పెట్టి/ ర్యాంకుల పంటలను ఆశిస్తున్నారు గానీ/ఆ పొలంలో ఏ పంట పండుతుందో/ఒక్కసారైనా ఆలోచిస్తే ఈ కడుపుకోతలు ఆగేవేమో అంటూనేటి తల్లిదండ్రుల కోసం హితవాక్యం పలుకుతాడు.

తన బాల్యం, తనలాంటి వాళ్ళ బాల్యం అంతా కష్టాలతోనే గడిచిందని, పేదరికాన్నే అనుభవించిందని ప్రతీకాత్మకంగా ఇలా అంటాడు కాళ్ళను ముందలేసుకొని/ముండ్లు తీయడంతోనే/ గడిచిపోయింది బాల్యం. ఇప్పుడు పేదరికాన్నుండి తప్పించుకున్న నేటి ఈ ఉరుకుల పరుగుల జీవితంలో ఒక మనిషి సాటి మనిషిని పట్టించుకోనంత ఒంటరి అవుతున్నాడని, ఇంతటి సంక్లిష్ట జీవితం కంటే కష్టాలని అనుభవించిన ఆ బాల్యమే అందమైందని అందరిలో ఉంటూనే/ఒంటరితనాన్ని మోస్తున్న ఇప్పటి నొప్పికన్న/ఈ తుమ్మముల్లు నొప్పి/ఏమంత పెద్దది గాదు అని వాపోతున్నాడు. ఏ భాష రాని వాళ్ళు ఉండొచ్చుగానీ/కన్నీటి భాష/అర్థంకాని వాళ్ళు ఉండరేమో/నాలుక భాషలు/మనిషి నుండి మనిషిని/దూరంగా విసిరేస్తాయి గాని/నరనరాలు పలికే కన్నీటి భాషొక్కటే/మనుషుల మధ్య ఖాళీని పూరిస్తుంది అంటూ ఆర్ద్రంగా చెప్పినా నిజానికి ఇదే గోపాల్ కవిత్వ భాష. ఆ గుండెతడి పోనంతవరకు ఇలాంటి కవిత్వాన్ని సృజించగలుగుతూనే ఉంటాడు. తన కవిత్వాన్ని మట్టిపరిమళం చేయడమే కాదు తాను మట్టిబిడ్డనే అన్న స్పృహను కోల్పోనివాడు. ఉదాహరణకి తన తాతను జనం పొగిడినప్పుడల్లా తన తనువు పులకించిందని చెప్పటానికి ఈ మట్టిపెయ్యి మీద/గడ్డిపూలు మొల్చినట్టుంటది అంటాడు.

ఇప్పుడు నేను/దుఃఖనదిని దాటుకుంటూ వచ్చిన/నునుపుదేలిన అక్షరాన్ని అంటూ సారవంతమైన అక్షరాలనే కవిత్వంగా పండిస్తున్న అక్షరహాలికుడు గోపాల్. అతని కలంహలం మరెంతో గొప్ప సాహితీ వ్యవసాయం చేసి అందమైన అక్షరపంటల్ని పండించాలని కోరుకుందాం.

కవిత్వసంపుటి: **దండకడియం**
కవిపేరు: **తగుళ్ళగోపాల్**
**పేజీలు:** 164 **వెల:** రూ. 150
**ప్రతులకు:** నవతెలంగాణ, నవచేతన బుక్ స్టాలల్లో లభ్యం
ఫోన్ నంబర్ -9505056316

- రాపోలు సీతారామరాజు
దక్షిణాఫ్రికా
p : +27 727747549
e : rsrraju@gmail.com

## పత్రికలు - పరిచయం:

గమనిక: ఈ శీర్షికలను ప్రచురించేందుకు ఆయా పత్రికలు, ప్రత్యేక సంచికల వివరాలను మాకు తెలియ జేయగలరు.

**రైతుబంధు**
సంపాదకులు :
ఎన్. లక్ష్మి




ఫోన్: 9848902520

**ఉపాధ్యాయ దర్శిని**
ప్రధాన సంపాదకులు :
కె. వేణుగోపాల్




ఫోన్: 98661514577

**భూమిక**
సంపాదకురాలు :
కె. సత్యవతి




ఫోన్: 040-27660173

**చైతన్య సేద్యం**
ఎడిటర్ :
డా॥ అరిబండి ప్రసాద్‌రావు




ఫోన్: 9949725951




ఇది మాతరం కథ. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో జన్మించిన వారి కథ. వ్యక్తిగతంగా, సామాజిక – రాజకీయ పరంగా మాతరం అనుభవించిన 'ఆత్మక్షోభ' కథ. "కాలం కత్తుల వంతెన" మీద కదను తొక్కిన "కన్నీటి కాలం కథ". నెత్తురు నిండి శక్తులు మండిన మా తరం కన్న కలలన్నీ కల్లోలానికి గుర్తై కల్లలుగా మారి జీవితమే ఒక "పగిలిన అద్దం"లా మిగిలిన మా తరం కథ.

ఖండిత శిరస్సు తెగిపడి నేల వాలినా ఆ కళ్లల్లోని ధిక్కార స్వభావాన్ని మాత్రం కోల్పోని తరం మాది. చేసిన యుద్ధాలలో క్షతగాత్రులమైనా, మనసులోపలి గాయాలు మానకుండా ఇంకా పచ్చిగానే సలుపుతున్నందున, గతం చేసిన గాయాలను గానం చేసి ఈ తరం వారికి అర్థం అయ్యేలా చెప్పటం కోసమే చేసిన యాత్ర ఈ "అక్షర యానం".

**కల్లోల కలల కాలం (సలాం హైదరాబాద్ - రెండవ భాగం), రచన:** పరవస్తు లోకేశ్వర్, **ప్రచురణ:** సాహితి ప్రచురణలు. **వెల :** రూ.350, **ప్రతులకు :** 33–22–2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ. ఫోన్: 0866–2436642/43, 8121098500

---

వారి పుస్తకపఠనం కేవలం సాహిత్యానికే పరిమితం కాలేదు. తత్వశాస్త్రం నుండి కళలు, విజ్ఞాన శాస్త్రాల దాకా విస్తరించింది. వారి వివేచనా దృష్టి సాహిత్యరంగంలో తెలుగు, ఇంగ్లీషు, హిందీలే కాక, పారసీ, అరబ్బీ, ఉర్దూ బాషా సాహిత్యం శాఖోపశాఖల మీద ఎగిరివాలింది. అందుకే నోముల సాహిత్య వ్యక్తిత్వంలో తులనాత్మక కోణానిదే పెద్దపీట. ఆయన సాహిత్యమొక తీరని దాహంగా ఎన్ని చెలిమల నీళ్ళు తాగారో లెక్కలేదు. అందుకే వారికి నీడలేదు– సాహిత్యమనే తోడునీడ తప్ప. విశాల దృష్టి ఆధునిక మానవుణ్ణి సృష్టిస్తుంది. నోముల ఒక ఆధునిక వ్యక్తి. 'నోముల అన్‌టోల్డ్ లెసన్స్' తెలంగాణ భాషలో వచ్చిన మ్యూజింగ్స్, తత్వవేత్తలు, సాహితీకారులు, మొదలుకొని వెలుగునీడల ద్వందాల దాకా వెలిగే హరివిల్లు. నోముల బతికింది డెబ్బయి తొమ్మిది వసంతాలే. కాని జీవించబోయేది శతాధిక సంవత్సరాలు. **నోముల యాదిలో... సంపాదకులు :** దేవులపల్లి కృష్ణమూర్తి, ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, **ప్రచురణ :** జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక. **వెల :** రూ.100, **ప్రతులకు :** 17/98, శ్రీశ్రీ మార్గం, నకరేకల్, నల్లగొండ, ఫోన్ : 79817017220. అన్ని ప్రధాన పుస్తకాలయాలలో.




---




ఆకుపచ్చటి పెదవుల మీద చిగురులకల
ఆడివిపాటై కొండల లోయల్లో మోగుతున్నది
కొంచెం మనిషిగా పచ్చటి ఊపిరుల్ని
గుండెల్నిండా ఊదుకోవాలె
గుండె నిండా ప్రేమతో హత్తుకోవాలె
మట్టిలో మనిషిపాదముద్రలే చరిత్ర
ప్రపంచమంతటా మొలకెత్తిన బువ్వ కథే మనిషి చరిత్ర.

**కొండపాదుగుపాలు, రచన:**హరగోపాల్, **ప్రచురణ :** రచన ప్రచురణలు
**వెల :** రూ.150, **ప్రతులకు :** నవ తెలంగాణ, ప్రజాశక్తి, నవచేతన, విశాలాంధ్ర, నవోదయ, బోధి, ప్రముఖ పుస్తక కేంద్రాలలో

---

ఈ పుస్తకం సమాజంలోని అనేక అంశాల ప్రతిబింబం. రచయిత సూర్యాపేట నుంచి అండమాన్ వరకు జర్నలిస్టుగా తన అనుభవాలను ఇందులో పొందుపరిచారు. తెలంగాణ ఉద్యమం, వరద బాధితుల అవస్థలు, భూకంప ప్రాంత ప్రజల కష్టాలు, రాజకీయ నాయకుల విన్యాసాలు మన కళ్ళముందే కదలాడుతున్నట్టు ఉంటాయి. సమాజంలోని అమానవీయ ఘటనలు మనల్ని కదిలిస్తాయి. ఇది తన పాతికేళ్ళ జర్నలిజం ప్రయాణం అనే కంటే ఈ రెండున్నర దశాబ్దాల సమాజ స్థితిగతుల సమాహారం అంటే అతిశయోక్తి కాదు.

**ది జర్నీ ఆఫ్ ఎ జర్నలిస్ట్ రచన :** కంభాలపల్లి కృష్ణ, **ప్రచురణ :** భూమి బుక్ ట్రస్ట్
**వెల :** రూ.100, **ప్రతులకు :** అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో. ఎస్ఆర్‌టి 267/1, జవహర్‌నగర్, ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ దగ్గర, హైదరాబాద్. ఫోన్: 9849908929




సూచన: ఈ శీర్షికలో ప్రచురణ కోసం : రెండు పుస్తకాలను పంపించాలి.




**తెలంగాణ విజయగాథ**
సంపాదకుడు : జూలూరు గౌరీశంకర్
ప్రచురణ : అడుగు జాడలు పబ్లికేషన్స్
వెల : రూ. 175
ప్రతులకు : 410, ఎం.ఎస్.కె. టవర్స్, స్ట్రీట్ నెం.11,
హిమాయత్‌నగర్, హైదరాబాద్.
రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తకాల షాపుల్లో




**మహామంత్రి మాదన్న**
రచన : కె.వి. భూపాలరావు
పచురణ : తెలంగాణ సాహిత్య అకాడమి
వెల : రూ. 140
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమి,
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం,
హైదరాబాద్. ఫోన్: 040-29703142




**తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర**
సంపాదకులు : ఎలికట్టె శంకర్‌రావు
ప్రచురణ : నోముల సాహిత్య సమితి
వెల : రూ. 220
ప్రతులకు : నవచేతన బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.
నవోదయ బుక్ హౌస్, కాచిగూడ.
ఎన్.ఎస్. అరుణ, ఫోన్ : 7799114349




**తెలంగాణ వాగ్గేయ వైభవం**
సంపాదకులు : మామిడి హరికృష్ణ
ప్రచురణ : భాషా సాంస్కృతిక శాఖ
వెల : రూ. 100
ప్రతులకు : డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ,
కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాదు
ఫోన్: 040-23212832




**మనసు లిపి (కవిత్వం)**
రచన : సుతారపు వెంకటనారాయణ
ప్రచురణ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
వెల : రూ. 60
ప్రతులకు : ఇం.నెం.12-11-367/6,
మారుతి వీధి, వారాసీగూడ, సికింద్రాబాద్.
ఫోన్: 9848958690




**విశ్వవిహారం (యాత్రా కవితలు)**
సంపాదకులు : దేవీప్రసాద్ జువ్వాడి
ప్రచురణ : యశస్వి పబ్లికేషన్స్
వెల : రూ. 200
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, కాచిగూడ.
ప్రముఖ పుస్తక కేంద్రాలలో




**వికసించిన ఆకాశం (కవిత్వం)**
రచన : ఉప్పల పద్మ
ప్రచురణ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
వెల : రూ. 100
ప్రతులకు : ఇం.నెం.18-950/2,
శివానీ టెక్నో స్కూల్ దగ్గర, మిర్యాలగూడ, నల్లగొండ.
ఫోన్: 9959126682. ప్రముఖ పుస్తక కేంద్రాలలో




**వనజీవి ప్రయాణం**
రచన : నరేష్ జిల్లా
వెల : రూ. 60
ప్రతులకు : ఇం.నెం.8-29, బంధంపల్లి గ్రామం,
తిరుమలాయపాలేం, ఖమ్మం జిల్లా
ఫోన్: 8187898285, 8187801295




**తెలంగాణ సాహిత్యం - సమాలోచన**
ప్రధాన సంపాదకులు : ఆచార్య సూర్యాధనంజయ్
ప్రచురణ : ఉస్మానియా విశ్వవిద్యాలయం
వెల : రూ. 350
ప్రతులకు : తెలుగుశాఖ, ఆర్ట్స్ కాలేజ్,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్




**నివాళి**
ఘంటా మొగిలయ్య ప్రవాసం-ప్రస్థానం
ప్రచురణ : కుటుంబ సభ్యులు



**వరంగల్ జిల్లా పత్రికలు: నాడు-నేడు**
సంపాదకులు : డా॥ నమిలకొండ సునీత
ప్రచురణ : సునిశిత ప్రచురణలు, కామారెడ్డి
వెల : రూ. 300
ప్రతులకు : 5-6-177/సి, ఎన్.జి.ఓ.ఎస్. కాలనీ,
కామారెడ్డి, ఫోన్: 9908468171
విశాలాంధ్ర, నవచేతన పబ్లిషింగ్ హౌస్.




**కుందెన (సాహిత్య వ్యాసాలు)**
రచన : సాగర్ల సత్తయ్య
ప్రచురణ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
వెల : రూ. 150
ప్రతులకు : వట్టిమర్తి గ్రామం, చిట్యాల, నల్లగొండ.
ఫోన్: 9966549991, 7989117415

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186, Behind SBH(H.O)
Gunfoundry, Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp. Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS



DECCAN LAND, Telugu Monthly Magazine 1st - February - 2020, ISSN 2581-3188
Postal Dates: 2nd & 3rd Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, RNP/HD/1167/2018-2020

















# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

## బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు- ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం.

పిల్లలలో నైతికను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాల సాహిత్యవే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. **'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ'** తెలంగాణాలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది.

10 పుస్తకాల సెట్ ధర రూ. 330
తగ్గింపు ధర రూ. 300

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*

















Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar